# మనిషి జన్మ ఎందుకు?

## (మానవుడు కారణ జన్ముడా?)

**డా॥ బి. జాన్**

**ఇనిస్టిట్యూట్ ఆఫ్ బైబిల్ టెక్నాలజి హైదరాబాద్**
హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్, ఇండియా.
www.bibletechnology.org

మనిషి జన్మ ఎందుకు?

*మనిషి జన్మ ఎందుకు?*

***(IS THERE ANY PURPOSE BEHIND MAN)***

*ప్రథమ ముద్రణ : ఆగష్టు 2004*

*రెండవ ముద్రణ : డిసెంబరు 2008*

*ప్రతులు : 2000*

*వెల : 35/-*

©సర్వహక్కులు రచయితవి

*డిజైన్డ్ & ప్రింటెడ్*

*'గుడ్ డిజైన్', విజయవాడ, 9948146574*

*రచయిత :*

***డా॥ బి. జాన్***

*డైరెక్టర్ : ఇనిస్టిట్యూట్ ఆఫ్ బైబిల్ టెక్నాలజి, హైదరాబాద్*

*సెల్ : 9440142887*

*ప్రతులకు*

***Institute of Bible Technology Hyderabad***

#06-264/13/1/5H, HAL Colony, Opp. Godavari Homes,

Behind Suchitra Bus Stop, Chintal Post, Quthbullapur MCP,

Hyderabad - 500 054, India, Ph : 040-23878030 Cell : 9440142887

**Bro. J. RAVI,** Admn. Officer - IBT,

H.No. 7-1-38/1/33, BJR Nagar, Ameerpet, Hyd-16

Cell : 9440792192

# అంకితం

తమ జన్మకు అర్థం తెలుసుకొని,
దానిప్రకారం ప్రవర్తించి
ప్రతి మనిషి కూడా కారణ జన్ముడని అనేకులకు
తెలియజేసి సర్వమానవ సౌభ్రాతృత్వం
కోసం తమకు తెలిసిన ప్రతి వ్యక్తి
రక్షణ కొరకు సమయమందును,
అసమయమందును
దేవుని పనిచేసే దేవుని పిల్లలందరికి
నా ఈ చిన్న గ్రంథాన్ని
అంకితమిస్తున్నాను.

**డా॥ బి. జాన్**

# ముందుమాట



క్రీస్తు నందు ప్రియమైన దేవుని పిల్లలందరికి యేసుక్రీస్తు నామములో నా వందనములు, శుభములు పలుకుచూ వ్రాయునది. ఒకప్పుడు దేవుడు అంటే తెలియక, దేవుడు ఎవరో తెలియక, అసలు దేవుని ఉద్దేశ్యము అంటే ఏమిటో తెలియక జీవించిన నాకు తండ్రియైన దేవుని గూర్చియు ఆయన కుమారుడైన యేసుక్రీస్తును గూర్చియు మరియు పరిశుద్ధాత్మను గూర్చియు అనేక సంగతులను, దేవుడు డా॥ బి. జాన్ గారికి అనుగ్రహించిన మహాజ్ఞానము వలన ఆయన గారు చేసిన ఎన్నో ప్రసంగముల ద్వారాను అతని రచనల ద్వారా అనేక విషయుములను గ్రహించగలిగాను డా॥ బి. జాన్ గారు వ్రాసిన రచనలలో భాగంగా ''మనిషి జన్మ ఎందుకు?'' అనే పుస్తక ప్రచురణకర్తగా ఉండుటకు ముందుకు వచ్చినాను. మొట్టమొదటి మానవుడైన ఆదాము మొదలుకొని నేటి ఆధునిక మానవుడుగా చెప్పుకుంటున్న చాలామందికి “తన జన్మ ఎందుకో” తెలియని దశలో ఉంటూ గమ్యం ఎరుగక పయనిస్తున్నారు. మనిషి జన్మ ఎందుకు? బుద్ధి, వివేకం, ఆలోచనశక్తికి కారణమైన 'ఆత్మ' మనుషులకే ఎందుకు ఉన్నది. మనిషి జన్మలోని పరమార్ధం ఏమిటి, దేవుడు మనిషి దేహాన్ని ఎందుకోసం నిర్మించాడు? అనే ఎన్నో సత్యాలను ఈ పుస్తకం ద్వారా సమస్త మానవకోటికి తెలియజేయాలనే దేవుని సంకల్పము మరియు ఈ పుస్తకం చదివిన వారందరు దేవుని జ్ఞానంలో పరిపూర్ణులవాలనే ఆశతో, ఆకాంక్షతో, హృదయపూర్వకంగా ప్రార్ధించుచున్నాను. ఇనిస్టిట్యూట్ ఆఫ్ బైబిల్ టెక్నాలజి ద్వారా ఇలాంటి అనేక రచనలు రావాలని ఈ అంశం ప్రపంచములోని అన్ని బైబిల్ కళాశాలల్లో పాఠ్యాంశముగా ఉండి తీరాలని ఆశిస్తూ......

ప్రభువైన క్రీస్తు పరిచర్యలో మీ సోదరుడు

***తరిట్ల సాయిబాబ,*** హైదరాబాద్

# నామాట...

తండ్రియైన దేవుని దయాసంకల్పం మేరకు ఈ భూమి మీదకు జీవుడిగా అవతరించిన దేవుని పిల్లలైన సోదర మానవులందరికి ఆయన ప్రియ కుమారుడైన క్రీస్తు నామములో శుభములు, వందనములు.

నాటి ఆదిమానవులు మొదలుకొని నేటి ఆధునిక మానవులుసైతం తన బ్రతుకు గురించి ఆలోచించక అన్యాయంగా ఈలోకమాయలో పడి నిత్యనాశనానికి వెళ్ళిపోవుచున్నారు. దేవుడు నాటి నుండి నేటి వరకు నానావిధములుగా తన ప్రజలైన వారితో మాట్లాడినా అర్థం చేసుకొని ఆలోచించలేకపోతున్నారు. మానవ జన్మకు పరమార్థముందని తెలియజేయడానికి సుమారు 8 సం॥ల క్రితం మానవుడు కారణజన్ముడా? అనే పేరుతో చిన్న పుస్తకం విడుదల చేశాను. అదే పుస్తకాన్ని చాలామార్పులు, చేర్పులతో సరికొత్త శాస్త్రపరమైన ఆలోచనలతో, ఆధారాలతో మళ్ళీ "మనిషి జన్మ ఎందుకు?" అనేపేరు మీద విపులంగా వ్రాసి విడుదల చేయుచున్నాను. ఈ దేశంలోని మారుమూల గ్రామాలు మొదలుకొని మహానగరాలలో నేను మాట్లాడిన క్రీస్తు సువార్త మహాజ్ఞాన సభలైన 'ఓమనిషినీవెవరు' 'చచ్చి బ్రతుకుతావా? బ్రతికి చస్తావా? 'నేటి శాస్త్ర ప్రపంచానికి తెలియని ప్రాణం పోకడ' లలోని ముఖ్యాంశాలను ఇందులో పొందుపరిచాను.

ఇంతటి మహాజ్ఞానాన్ని అందమైన పుస్తకరూపంలో మీ ముందుకు తీసుకుని రావటానికి తనవంతు ఆర్థిక సహాయాన్ని అందించిన సోదరులు టి. సాయిబాబా (సిండికేట్ బ్యాంక్) గారికి, వారి శ్రీమతి సుశీల గారికి నా హృదయపూర్వక వందనములు. మొదటి ముద్రణలోఎంతో ఓర్పుతో ఎన్నోసార్లు తప్పులు దిద్ది ఈ పుస్తకానికి అందమైన

రూపాన్నిచ్చిన యస్.యల్.ఎన్.పి. గ్రాఫిక్స్, మూసాపేట, హైదరాబాద్ – శ్రీ సాయిరాం గారికి, రెండవ ముద్రణలో మరింత అందంగా డిజైన్ మరియు ప్రింటింగ్ చేసిన సోదరులు బి. పూర్ణచంద్రరావు (గుడ్, విజయవాడ) గారికి, నాతోపాటు శ్రమించిన నా సోదరులు, జతపనివారైన బ్రదర్ టి. ఆశీర్వాదం గారికి, బ్రదర్ దాసి ప్రసాదరావు గారికి బ్రదర్ జె. రవి గారికి నా ప్రత్యేక వందనాలు. అలాగే దీనిని ప్రజలలోనికి తీసుకొని వెళుతున్న నా సోదరులు, జతపనివారైన, ఐ.బి.టి. సువార్తికులు, ప్రిన్సిపాల్, లెక్చరర్లు, విద్యార్థిని విద్యార్థులందరికి వందనాలు.

ఈ రెండవ ముద్రణకు తన వంతు ఆర్థిక సహాయాన్ని సోదరులు సాయిబాబా గారితో కలిసి పంచుకున్న బ్రదర్ ఆర్. కోటేశ్వరరావు (Rtd. Asst. Manager - SBI) శ్రీమతి అనిత కోటేశ్వరరావు గార్లకు ప్రత్యేక వందనాలు.

ఇందులో అచ్చుతప్పులుంటే మన్నించి సరిదిద్దుకోగలరు. వాక్యానుసారమైన తప్పులుంటే నాతో ముఖాముఖిగానైన, మరేవిధంగానైనా ప్రేమతో సంప్రదించి నన్ను నాబోధను సరిదిద్దగలరని నా తరం వారైన దేవుని సేవకులను హృదయపూర్వకముగా మరోసారి కోరుతున్నాను. దేవుడు మనలందరిని సర్వవేళల్లో విజయోత్సవంతో ఊరేగించాలని ప్రార్థిస్తున్నాను.

తేది : 09-12-2008

హైదరాబాద్

రారాజు క్రీస్తు యేసు రాజ్యములో

మీ సహోదరుడు

డా॥ బి. జాన్

# మనిషి జన్మ ఎందుకు?

(మానవుడు కారణజన్ముడా?)

నేటి 21వ శతాబ్ధంలోకి అడుగిడిన మానవుడు నాడు ఎవ్వరూ ఊహించని, అగమ్యగోచరమైన అంతరిక్షంలోకి దూసుకొనిపోయి అంతు తెలియని సుదూర నక్షత్ర రాశులను, వాటిలో జరుగుతున్న విశ్లేషణలను అక్కడే ఉండి మరియు భూమిమీద ఉండి కూడా చూడగలుగుచున్నాడు. అలాగే అందమైనది, అనంతమైనది అనుకొన్న సాగరగర్భంలోనికి ప్రవేశించి ఎన్నో ముత్యాలను, రత్నరాసులను, రహస్యాలను చేధిస్తున్నవాడు ఈ నరుడే. ఇంకా తనకన్నా ఎన్నో రెట్లు పెద్దదైన ఏనుగును, బలమైన క్రూరమైన సింహాలను, పులులను భయంకరమైన పాములను ఆటాడిస్తూ అలవోకగా వాటిమీద సవారీ చేయుచున్నాడు, పక్షులతో మాట్లాడిస్తున్నాడు, పక్షిలాగా ఎగురుచున్నాడు. తనకన్నా వేగంగా, ఖచ్చితంగా ఆలోచించి లెక్కలుగట్టే, పనిచేసే అధునాతన యంత్రాలను (కంప్యూటర్ లాంటి వాటిని, వాటితో నడిచే యంత్రాలను, మరమనుషులను) తయారుచేస్తున్నాడు. రేడియో, టెలివిజన్, సెల్‌ఫోన్, టెలికమ్యూనికేషన్, అణుశక్తి లాంటి రంగాలలో

అద్భుతాలను సృష్టించాడు. నిరంతరం ఈ సృష్టిలో కనబడుచున్న (Visible), కనబడని (Dark Matter) ప్రతి పదార్ధాన్ని అణువణువునా పరిశీలించి, పరమాణువుగా విడగొట్టుచున్నాడు.

తన ఇంటిని, ఇంటిలోని వారిని, ఊరిలోని వారిని అవసరమైతే దేశంలోని కోట్లాదిమందిని కంట్రోల్ చేయగలుగుచున్నాడు. సృష్టిని వాటిలోని చెట్లను, పక్షులను, జంతువులను మాత్రమేగాక తనలాంటి మరోమనిషిని కూడా అదుపు చేయగలుగుచున్నాడు. తన శరీరంలోని ప్రతి అవయవాన్ని, దాని పనితీరును పరిశీలించి, వాటికి పరిష్కారాన్ని, ప్రత్యామ్నాయాన్ని కనుగొనే పనిలోపడి, తన తనువులోని అణువణువును దానిలోని రహస్యాన్ని చేధించగలుగుతున్నాడు. ఒక రకంగా చెప్పాలంటే సృష్టికి ప్రతిసృష్టిచేస్తూ సర్వసృష్టిని శాసిస్తున్న రారాజే ఈ మనుష్యుడు. కాని ఎంతో విలువైన సమయాన్ని, కోట్ల రూపాయలను వెచ్చించి ఈ సృష్టిని గూర్చి పరిశోధనలను కొనసాగిస్తున్న ఈ నరుడే ఇంతకూ తనెవరు? ఇదంతా నేను ఎలా చేయగలుగుతున్నాను అనే విషయాన్ని మాత్రం పరిశీలించి పరిశోధించక పోవడమే కడు శోచనీయం.

అలాగే నాటి నుండి నేటి వరకు మరికొందరు మానవులు ఈ సృష్టినే కాక సృష్టికి కారణభూతమైన శక్తినికూడా పరిశోధించుచున్నారు. చాలామంది చాలారకాలుగా ఆ శక్తి దేవుడని, కొందరు సూపర్ పవర్ అని మరికొందరు ఆయన దగ్గరకు చేరే మార్గాల గురించి, ఆయన తత్వాల గురించి, సిద్ధాంతాల గురించి పరిశోధించుచున్నారు. అనేకరకాలుగా బోధించుచున్నారు, రకరకాలుగా ప్రవర్తించుచున్నారు. ఇంకొందరు నేనే దేవుణ్ణి అని చెప్పారు, చెబుతున్నారు. బాబాలుగా, యోగులుగా అవతారపురుషులమని అటు దేవున్ని ఇటు దేవుని పిల్లలను మోసం చేయుచున్నారు. మరికొందరు దేవుని భక్తులుగా, ఆయన శిష్యులుగా మారి కూడా మారణహోమం కావించుచున్నారు. మరికొందరు నేనెందుకు పుట్టానో నాకే తెలియదు బ్రదర్ అంటున్నారు. దీనికంతటికి కారణం ఇది అంతా చేస్తున్న లేక

చెబుతున్న మనిషి తను అంటే ఎవరో తెలుసుకోలేకపోవడమే. తను పరిశోధించిన వాటిలో అన్నిటికన్నా ముందు తనెవరో తెలుసుకొంటేనే గాని మిగతా సంగతులు అర్ధంకావు కదా ఒకసారి ఆలోచించండి.

నిజంగా ఒకసారి మనచుట్టూ ఉన్న ప్రకృతిని పరిశీలించి చూచినట్లయితే అది మనంరాకముందే ఉన్నదిగానూ, దాని పని అది ఎల్లవేళలా సక్రమంగా చేసుకొంటూ పోవుచున్నట్లుగా కనిపించుచున్నది, ఈ ప్రకృతిలోని నక్షత్రాలు, గ్రహాలు, చెట్లు, జంతువులు, సూక్ష్మజీవులు అన్ని క్రమంగా వాటి పనిని అవి చేసుకుంటూ పోతున్నాయి. కాని వాటి పనుల్లో అనవసరంగా వేలుపెట్టి వాటిని, వాటి పనిని పాడుచేసే వింత జంతువుగానో, వాటిని నియంత్రించే అద్భుతశక్తిగల అధికారిగానో, అన్నింటికి అందనంత అద్భుతమైన జ్ఞానం వివేచనగల శక్తిమంతుడైన వ్యక్తిగానో, ఈ నరుడే గోచరించుచున్నాడు, ప్రతిక్షణం ప్రకృతి ఒడిలో పవళిస్తూ, దానిని తేరగా అనుభవిస్తూ, ఆస్వాదిస్తూ అధికారంతో దానిని ఆటలాడించే అనన్య సామాన్యమైన శక్తి ఈ నరుడికి ఎలా వచ్చింది! ఈ అద్భుతమైన వ్యక్తి ఎవరు! ఈ మర్మమును పరిశోధించకనే ప్రతివాడు విగత జీవిగా మారిపోవుచున్నాడు. కనీసం మనకైనా (ఈనాటి మానవులకు) మరియు రాబోవు తరాలవారికి కూడా ఈ గతి పట్టకూడదనే ఈ నరుడెవరో పరిశోదిద్దాం. నేడు నరుడు చేస్తున్న నరమేధాన్ని ఆపుదాం.

కులంకుళ్ళులో మునిగి, మతం మత్తులో తేలి, ధనం మాయలో నడుస్తూ, అర్ధాంతరంగా మాయమైపోతున్న మనిషికి మనుగడను గుర్తు చేస్తూ, మానవ కళ్యాణానికి కంకణం కడుదాం. ఎంతో విలువైన మానవ జీవితకాలాన్ని సద్వినియోగం చేసుకొని వెలకట్టలేని బ్రతుకు పరమార్ధాన్ని గ్రహించి పరిపూర్ణులమవుదాం. మన బ్రతుకుకోసం మనమీదనో, మరొకరి బ్రతుకు మీదనో ఆధారపడక మనకు బ్రతుకునిచ్చి, బ్రతకనిస్తున్న మానవులందరికి బ్రతుకు పుస్తకమైన బైబిల్‌పై ఆధారపడి అనేకులను బ్రతుకనిద్దాం.

# నేను అంటే ఎవరు?

ఈరోజు ప్రపంచంలోని ఏ వ్యక్తినైనా కలిసి మీరెవరండీ? అని అడిగాం అనుకోండి, వారు వెంటనే నేను హిందువును, నేను క్రైస్తవుడను, ముస్లింను మరియు సిక్కును... ఇలా ఫలానా మతంవాడిని అని చెబుతున్నాడు. మరొకడు నేను మాదిగను, మాలవాడిని, రెడ్డిని, కమ్మను, గౌడ్‌ను, యాదవుడను ఇలా ఒక కులానికి చెందిన వాడినని, తమ పేర్ల చివరన ఈ కులాన్ని తగిలించుకొని మరీ చెబుతున్నారు. మరికొందరు మేము తమిళులం, కన్నడవాళ్ళం, బెంగాలీ, బీహారీ, మరాఠీ, తెలుగు వాళ్ళం అని చెబుతున్నారు. అందులో కూడా తెలంగాణా వాడిని, ఆంధ్రావాడిని, రాయలసీమ వాడినని లేక ఫలానా ప్రాంతం వాడినని చెబుతున్నారు. ఇంకా భారతీయుడినని అందులో ఆర్యుడనని, ద్రావిడులమని ఒక భాషా, మరో వర్గం వాడినని చెబుతున్నారు. ప్రతి కులంలో మళ్ళీ ఫలానా ఉపకులం వాడినని, ప్రతి మతంలో మళ్ళీ విభజన చేసి ఫలానా వాడినని చెబుతున్నారు. కాని ఏ ఒక్కరూ

డైరెక్టుగా కనీసం నేను మనిషిని అని సమాధానం చెప్పడంలేదు, లేదా దేవుని కుమారుడనని ఏ క్రైస్తవుడు కూడా చెప్పడంలేదు. అందరికి దేవుడొక్కడే అంటున్నారు, మనుషులంతా ఒక్కటే అనికూడా అందరూ అంటున్నారు. కానీ నోరున్న ఈ మనిషి, నేను మనిషినని ఒకే సమాధానం చెప్పడంలేదు. అందుకే ప్రతీ వ్యక్తి ఇక నుండి తాను మాట్లాడుతున్న ప్రతి దానిని ప్రశ్నించుకొని, తనెవరో? ముందు తెలుసుకొని తీరాలని, తెలుసుకొన్నాక, గ్రహించుకొని దాని ప్రకారం నడుచుకోవాలని ఆశించి ఈ విషయాన్ని మీ ముందుకు తెస్తున్నాను.

ఈ ప్రపంచంలో అందరిలాగే పుట్టి మహాత్ములుగా ఎదిగిన లేదా పిలువబడ్డవారందరు కూడా ముందు నిన్ను నీవు తెలుసుకో; నీవు కాని దాన్ని చూసి నేను అని భ్రమపడడమే 'మాయ' అని చెప్పారు. మనిషి తన రూపం, హోదా, పేరు ప్రఖ్యాతలు, ఉద్యోగం, కులం, మతం ఇలా ఎన్నింటినో నేను – నాది అని మురిసిపోతూ మాయలో పడి మాయమైపోతున్నాడు. ఈ సకలచరాచర ప్రకృతిలోని జీవరాశులన్నిటిలో అసంతృప్తితో తన జీవితాన్ని ముగిస్తున్నవాడు నరుడేనని చెప్పక తప్పదు. అందుకే నీవు/నేను అనగా ఎవరో ఆలోచించి గ్రహిద్దాం.

మనలో చాలామందిమి ఉదయాన్నే లేవగానే అద్దం ముందుకెళ్ళి నిల్చుంటాం. మన అందమైన రూపాన్ని చూసుకొని మురిసిపోతుంటాం, కొన్నిసార్లు బాధపడుతుంటాం. అవయవాలన్ని వాటివాటి స్వాధీనంలో ఉంటే గర్వపడుతూ మనంత అందమైన వాళ్ళులేరని ఆనందపడుతుంటాం. కొందరు తమరంగు, అవయవ నిర్మాణాన్ని తలచుకొని చాలాబాధపడుతుంటారు. అందంగా లేమని ఇంకా అంగవైకల్యాన్ని తలచుకొని బాధపడుతుంటాం. ఇంకా కొందరు మనల్నిచూసి మీరు ఈ మధ్య చాలా చిక్కిపోతున్నారు, ముసలివారు అయిపోతున్నారు అనగానే లోన చివుక్కుమని తెగ

బాధపడుతుంటాం. అయితే మన మాటల్లో ఒక నిజాన్ని మాత్రం పలుకుతుంటాం మనకు తెలియకుండానే. అదేమంటే శరీరంలో నలతగా ఉన్నపుడు డాక్టరు దగ్గరకెళ్ళి నా కన్నుబాగాలేదని, నా తలనొస్తుందని, నా కడుపు నొస్తుందని, నా గుండె నొస్తుందని, నా ఒంట్లో బాగాలేదని చెబుతాముగదా! ఇంకొక రకంగా చెప్పాలంటే ఇది నా చెయ్యి అని, ఇవి నా కాళ్ళు అని, నా ముక్కు అని, నా నోరు అని, నా కళ్ళు అని, మొత్తంగా ఇది నా శరీరం అని అంటాం. ఇవన్నీ నీవి అయితే, లేక ఇవన్నీ నావి, ఇదంతా నాది, నాది అంటున్న ఇంతకు నీవు ఎవరవు? నీ ఇల్లు అంటే, నీ భార్య, నీ పిల్లలు, నీ దుస్తులు, నీ గడియారం, నీ కళ్ళజోడు అంటే న్యాయంగా ఉంది ఎందుకంటే వారు, అవి నీకు వేరుగా ఉన్నాయి గదా; మరి నేను అని ఇంతకాలం చూసుకుని మురిసిపోతున్నది నీ ఒళ్ళు లేదా నీ శరీరం అయితే ఇంతకీ నీవెవరు? ఎప్పుడయినా ఎవ్వరైనా ఆలోచించారా? ఇపుడు ఆలోచించండి. నీవు వేరు – నీ శరీరం వేరుగా ఉందన్న సంగతి అర్థం అవుచున్నది. అందుకే దేవుడు తన సత్య వేదంలో మనకోసం ఈ సంగతిని ముందే వ్రాయించాడు.

నాయందు, అనగా నా శరీరమందు మంచిది ఏదియు నివసింపదని నేనెరుగుదును. మేలైనది చేయవలెనను కోరిక నాకు కలుగుచున్నది గాని, దానిని చేయుట నాకు కలుగుటలేదు అయ్యో, నేనెంత దౌర్భాగ్యుడను? ఇట్టి మరణమునకు లోనగు శరీరము నుండి నన్నెవడు విడిపించును? (రోమా 7:18–24). నేను మంచివాణ్ణే గాని, నేను ఉంటున్న ఈ నా శరీరం మంచిదికాదు దాని నుండి నాకు విడుదల/రక్షణ కావాలి అంటున్నాడు పౌలుగారు. ఇంకా అయినను శరీరముతో నేను జీవించుటయే నాకున్న పనికి ఫలసాధనమైన యెడల నేనేమి కోరుకొందునో నాకు తోచలేదు. ఈ రెంటి మధ్యను ఇరుకున బడియున్నాను. నేను వెడలి పోయి

క్రీస్తుతోకూడ నుండవలెనని నాకు ఆశయున్నది, అది నాకు మరి మేలు. అయినను నేను శరీరమునందు నిలిచియుండుట మిమ్మును బట్టి మరి అవసరమైయున్నది (ఫిలిప్పీ 1:22-24). భూమిమీద మన గుడారమైన యీ నివాసము శిథిలమైపోయినను, చేతిపనికాక దేవునిచేత కట్టబడినదియు నిత్యమైనదియునైన నివాసము పరలోకమందు మనకున్నదని యెరుగుదుము (2కొరింథి 5:1-10). మరియు మన ప్రభువైన యేసుక్రీస్తు నాకు సూచించిన ప్రకారము నా గుడారమును త్వరగా విడిచిపెట్టవలసివచ్చుననియెరిగి, నేను ఈ గుడారములో ఉన్నంతకాలము ఈ సంగతులను జ్ఞాపకముచేసి మిమ్మును రేపుట న్యాయమని యెంచుకొనుచున్నాను (2పేతురు 1:13,14). ఇన్ని వాక్యాలలో దేవుడు మనకు ఈ సంగతిని బయలుపరచుట కొరకే వారి శరీరాలను ఉదాహరణగా తీసుకొని ఇంత వివరంగా చెప్పుచున్నాడు. అంటే ఇంతకాలం అందరు అనుకున్నట్లు పైకి కనబడే ఈ శరీరం నీవు నేను లేదా మనం కాదు అన్నమాట."

ఈ శరీరంలో ఎవరికి కనపడకుండా ఉండి దానిని నడిపిస్తూ, ఆడిస్తూ, పాడిస్తూ, దాని ద్వారా లోకాన్ని చూస్తూ, ఆలోచిస్తూ పని చేయిస్తున్న ఒక గొప్ప శక్తి నీవు నేను అని అర్థమగుచున్నది. ఇంతకూ ఆ శక్తి ఏంటి? ఆ శక్తి ఎవరు అని ఆలోచించండి. మనకు చేతకాదు గనుకనే బైబిల్‌లో యేసు ప్రభువు బోధ దగ్గరకెళుదాం.

క్రీస్తు తన బోధలో "ఆత్మయే జీవింపజేయుచున్నది. శరీరము కేవలం నిష్ప్రయోజనమైనది..."(యోహాను 6:63) అంటున్నాడు. అనగా ఈ శరీరాన్ని జీవింప జేయుచున్న శక్తి 'ఆత్మ' అని తెలిసిపోయింది. ఈ ఆత్మ అనగా ఇంతకాలం నేను - నీవు అంటున్న శక్తి ఉంటేనే శరీరానికి విలువ అని అది లేకుంటే ఈ శరీరం ఎందుకూ అనగా - బొత్తిగా పనికిరానిదని దేవుడు

సెలవిచ్చుచున్నాడు.  పదవిలో ఉన్నపుడు ఎంత గొప్పవాడుగా ఉంటాడో పదవిపోగానే ఎందుకు పనికిరాకుండా పోతాడు.  అలాగే నీవు (నేను) నీ శరీరంలో ఉన్నపుడు నీ భార్యా, పిల్లలకు, తల్లిదండ్రులకు, బంధువర్గానికి, స్నేహితులకు దేవునికి మరియు సైతానుకు కూడా కావాలి.  నీవు నీ శరీరాన్ని విడిచితే ఎవరికి పనికిరావు సరికదా ఈ శవం తెల్లవారితే కంపుకొడుతుందని ఈరోజే తీయండి అంటారు.  అందుకే ఇంతటి మహత్తరమైన ఈ ఆత్మకు ఒక గుర్తింపు, ప్రత్యేకత ఉండాలి గదా, అనగా దానికొక పేరు కూడా అవసరమై ఉందన్నమాట.

బాగా ఆలోచిస్తే మనకున్న పేర్లు అన్నియు ఈ శక్తివంతమైన ఆత్మకేగాని శరీరానికి కావని గుర్తుంచుకోవాలి.  ఉదాహరణ : నేను నా శరీరాన్ని వదిలివెళ్ళిపోయాననుకో అదే చనిపోవడం అంటాం. అపుడు నా శరీరాన్ని సారీ శవాన్ని క్రైస్తవ సాంప్రదాయ ప్రకారం పెట్టెలో పెట్టి పందిట్లో ఉంచుతారు.  అప్పుడు నాకు తెలిసిన వాళ్ళు వచ్చి జాన్‌గారు ఏరి అని అడుగుతారా! జాన్ శవం ఎక్కడ అని అడుగుతారా! ఇంకొక మాట మాట్లాడుతూ జాన్ మనకికలేడు, రాడు, వెళ్ళిపోయాడండీ అంటారు.  అంటే వెళ్ళిపోయిన వాడే లేదా చనిపోయినవాడే జాన్ అనియు వాడికే ఆ పేరు అన్నమాట.  అందుకే కొందరి పాపములు తేటగా బయలుపడి న్యాయపు తీర్పునకు ముందుగా నడుచుచున్నవి, మరికొందరి పాపములు వారివెంట వెళ్ళుచున్నవి (1తిమోతి 5:24).  కొందరి పాపములు వారి ముందు వెనకాల న్యాయపు తీర్పునకు వెళ్ళుచున్నవి అంటున్నాడు దేవుడు. ఇంకా వారిని గూర్చి ఎందుకనగా తాను జరిగించిన క్రియలచొప్పున, అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మనమందరమును క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును (2కొరింథీ 5:10).

అలాగే మీ పేరులు దేవుని యొద్ద ఉన్న జీవగ్రంథములో వ్రాయబడి ఉండుట చూసుకోండి అంటాడు. అయినను దయ్యములు మీకు లోబడుచున్నవని సంతోషింపక మీపేర్లు పరలోకమందు వ్రాయబడియున్నవని సంతోషించుడని వారితో చెప్పెను (లూకా 10:20). ఎవని పేరైనను జీవ గ్రంథమందు వ్రాయబడినట్టు కనబడనియెడల వాడు అగ్నిగుండములో పడవేయబడెను (ప్రకటన 20:15). ఈలోకంలో కూడా మనకు పేరుయొక్క అవసరం చాలా ఉంది, ఆ పేరు ఆత్మకేనని అర్థమయింది. ఇంతగొప్పదైన ఈ శక్తి ఆత్మ లేక జీవుడు ఎక్కడి నుండి ఈ శరీరంలోనికి వస్తున్నాడు, ఎక్కడికి వెళ్ళిపోతున్నాడు, ఈ ఆత్మ ఏమి అయి ఉన్నది. ఇవి ముందు తెలుసుకొన్నాక ఎందుకు వస్తున్నదీ తర్వాత తెలుసుకుందాం.

# ఆత్మ ఎక్కడి నుండి వచ్చినది

ఇప్పటికి చాలా మంది మన ఆత్మ తల్లి కడుపులో పిండము పూర్తిగా ఏర్పడ్డాక డెలివరికి ముందే వస్తుందని అనుకుంటున్నారు. కాని అది తప్పని దేవుని వాక్యము చెబుతుంది. ఈ ఆత్మ ఆదాము నుండి నేటి వరకు మన తండ్రుల ద్వారా విడిపోయి పిండముగా ఫలదీకరణము చెందిన రోజున వస్తుంది. అప్పటి నుండే మానవుని అస్థిత్వం లేదా ఉనికి ప్రారంభమవుతుంది. “నేను పిండమునై ఉండగానే నీ కన్నులు నన్ను చూచెను...” (కీర్తన 139:13-16).

ఈ ప్రపంచంలో ఆరిన నేల కనబడుతున్న ప్రతిస్థలములో జీవిస్తున్న మానవులు ఎలా పుట్టారు అంటే “మరియు యావద్భూమి మీద కాపుర ముండుటకు ఆయన యొకని నుండి ప్రతిజాతి మనుష్యులను సృష్టించి, వారు ఒకవేళ దేవునిని తడవులాడి కనుగొందురేమోయని, తన్ను వెదకు నిమిత్తము నిర్ణయకాలమును వారి నివాసస్థలము యొక్క పొలిమేరలను ఏర్పరచెను. ఆయన మనలో ఎవనికిని దూరముగా ఉండువాడు కాదు” (అపో.కా.

17:26,27). "అందరికి తండ్రియైన దేవుడు ఒకడే. ఆయన అందరిలోను అందరిగా వ్యాపించి ఉన్నాడు" (ఎఫెసి 4:6).

ఇలా ఒకే ఒకని (ఆదాము) నుండి నేడున్న కోట్లమంది ఎలా వచ్చారంటే దానికి కూడా చక్కని రుజువులతో కూడిన బోధ చేశాడు పరిశుద్ధాత్మ దేవుడు. "ఏలాగనగా మెల్కీసెదెకు అతని (లేవి) పితరుని కలిసికొనినప్పుడు లేవి తన పితరుని (అబ్రాము) గర్భములో ఉండెను" (హెబ్రీ 7:8-10).

హెబ్రీ పత్రికలోని పై ప్రవచనముల ద్వారా దేవుడు ఒక గొప్ప మర్మాన్ని విప్పి మనకు బోధించాడు. ఇక్కడి సందర్భాన్ని గమనించినట్లు అయితే దేవుడు ఇశ్రాయేలీయులకు ఒక కట్టడి పెట్టాడు. అదేదనగా యాకోబు సంతానంలోని మిగతా గోత్రాలన్ని పనిచేసి సంపాదించిన దాంట్లో యాజకత్వం చేసే లేవి గోత్రానికి దశమ భాగాన్ని ఇవ్వాలి. అయితే ప్రతీదానికి సణుగుకొనే తత్వాన్ని కలిగిన ఇశ్రాయేలీయులు (నేటి క్రైస్తవులు కూడా సేవకులకు మరియు సేవకు ఎందుకియ్యాలి అని మనసులో గొణుక్కొన్నట్లుగానే) లేవితో నీవు ఊరికే కూర్చుండి దశమభాగాన్ని కొట్టేస్తున్నావు అన్నట్లుగాను, అందుకు లేవి దశమ భాగాలు పుచ్చుకొంటున్న నేను కూడా ఒకపుడు దశమ భాగాలు చెల్లించాను అన్నట్లుగా అర్థమిచ్చుచున్నది. అయితే సంఘటన అబ్రాము కాలంలో జరిగింది అపుడు లేవి లేడు. అబ్రహాము కొడుకు ఇస్సాకు, ఇస్సాకు కొడుకు యాకోబు, యాకోబు కొడుకు లేవి. అంటే అబ్రహాముకు లేవి మునిమనుమడన్నమాట. కాని ఈ లేవి నేను కూడా మా ముత్తాత గర్భంలో ఉన్నపుడే మా తాత మెల్కీసెదెకుకు దశమభాగం ఇచ్చినాడు గనుక నేను కూడా ఇచ్చినట్లే అంటున్నాడు. ఇదెలా కుదురుతుంది అనుకొని ఇక్కడే చాలా జాగ్రత్తగా ఆలోచించాను, చాలా సంగతులు అప్పుడే బయటకు వచ్చాయి.

మనందరం ఎక్కడి నుండి వచ్చాం మన తల్లిదండ్రులలో నుండి, వాళ్ళు వాళ్ళు తల్లిదండ్రులలోంచి, ఇలా ఒకరి తర్వాత ఒకర్ని వెనుకకు పంపిస్తే అందరూ ఆది దంపతులైన ఆదాము – హవ్వలోంచి వచ్చినట్లు కనపడుతుంది. హవ్వ ఆదాములోంచి వచ్చింది. మరి ఆదాము ఎవరిలోనుండి వచ్చాడు. ఆదామును దేవుడు కన్నాడు కాబట్టే ఆదాము దేవునికి కుమారుడు అని వ్రాయించాడు. “కేయినాను ఎనోషుకు, ఎనోషు షేతుకు, షేతు ఆదాముకు, ఆదాము దేవునికి కుమారుడు”. (లూకా 3:38). ఆదామును దేవుడు ఎలా కన్నాడు! కనాలంటే అమ్మ ఉండాలి గదా! అని ఆలోచిస్తున్నారు గదూ! మనం అనగా మనిషి కనాలంటే స్త్రీ అవసరం ఉంది. ఆదాము కనాలంటే హవ్వనిచ్చాడు దేవుడు. కాని దేవుడే కనాలంటే అతనికి స్త్రీ అవసరం లేదు. తన ఆత్మను వేరు చేయడం అనగా ఆత్మనుండి వేరుపరచడమే కనడం అన్నట్లు అర్థం చేసుకోవాలి. ఆదామును ఈలాగే కన్నాడు. క్రీస్తును కూడా పరలోకంలో అలానే కన్నాడు దేవుడు. దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికారంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను (ఆది.కాం. 2:7). ఇక్కడ చూసినట్లయితే దేవుడైన యెహోవా నరుని (శరీరాన్ని) నేలమట్టితో (బొమ్మగా) చేసి ఆ బొమ్మ యొక్క నాసికారంధ్రముల గుండా తనలోని జీవ వాయువును లేక తనై ఉన్న జీవవాయువును ఊదగా నరుడు (ఆదాము) “జీవాత్మ” ఆయెను అని తెలిసింది. అంటే ఇక్కడ కూడా మనం జీవించుచున్న ఆత్మలమని తేలింది. అయినా ఇప్పటికి మనం మట్టిమి, పురుగు, పేడవంటి వారము అని చెబుతూ, ప్రార్థించుచున్నాము. ఈ ప్రార్థన ఎంతవరకు న్యాయమో ఆలోచించండి.

పై లేఖనాలను పరిశోధించి ఆలోచిస్తే ఇక్కడ ఇప్పటివరకు మానవులకు ముఖ్యంగా మన దేశంలోని అనేకులకు అర్థంకాని అద్భుతమైన విషయాలు చాలా ఉన్నాయి. మన విద్యార్హతలను

తెలిపే సర్టిఫికేట్‌లలోను, ప్రతి విధమైన కార్యకలాపాలను సాగించాలంటే మనకు ఇంటిపేరు, తండ్రిపేరు తప్పనిసరిగా వ్రాయుచున్నాం, వ్రాయాలి కూడా. అయితే మనల్ని కన్నది తల్లి, తండ్రి అయితే కేవలం తండ్రిపేరు, అతని ఇంటిపేరు మాత్రమే వస్తుంది. కొందరు తల్లులు తమ పిల్లలతో ఒరేయ్ నేను నవమాసాలు మోసి కన్నానురా? అని చెప్పటం వింటున్నాం. కాని తనుకన్న పిల్లవాడిని తీసుకొని స్కూల్‌లో చేర్పించడానికి ఆ తల్లి వెళితే, హెడ్‌మాస్టర్ గారు బాబు తండ్రిపేరేమిటి? అని అడుగుతారు. కాని తల్లిపేరు అడుగరు, తండ్రి వదిలేసినా లేక చనిపోయినా కీ॥శే॥ అనో, లేటు అనో తండ్రిపేరును వ్రాస్తారు. ఇంతకు అతను తండ్రిపేరు ఎందుకు అడుగుతాడో అతని(టీచరు)కేమైనా తెలుసా? అతడు రూల్సు అలా ఉన్నాయండి అంటాడు. అయితే ఆ రూల్సు వ్రాసిన వారినడిగినా దానికి మూలకారణం చెప్పలేరు. కాని ఈ సృష్టిలో అన్నింటికి మూలకారణం దేవుడు మరియు ఆయన వాక్యమైన క్రీస్తు కనుక వాక్యంలోనే సరియైన సమాధానం ఉంది. అదేమిటంటే మనల్ని కనేది తండ్రేకాని తల్లికాదు. ఇది మత్తయి 1:2లో "అబ్రహాము ఇస్సాకును కనెను, ఇస్సాకు యాకోబును కనెను, యాకోబు యూదాను అతని అన్నదమ్ములను కనెను" అని చెప్పబడింది.

అందుకే నా సర్టిఫికేట్‌లో బొంకూరి జాన్, S/o.మల్లయ్య అని ఉంది. అనేక దేశాల్లో కూడా ఈ రూల్ అమలులో ఉంది. కొన్నిచోట్ల తండ్రిపేరు ఇంటిపేరు కూడా అవుతుంది. అదే విషయం హెబ్రీ పత్రిక 7:8-10 వచనాలలో వివరంగా ఉంది. ఈ విషయాన్ని బ్రిటిష్‌వాడు కాపీకొట్టి, వాడు పరిపాలించిన దేశాలన్నింటిలో ఈ చట్టాలనే ప్రవేశపెట్టాడు. అయితే ఇది తప్పు చేయాలని బైబిల్ వ్యతిరేకులు ఒకవేళ ప్రయత్నిస్తే, వారు ఒకసారి డాక్టరును లేదా పిండోత్పత్తి శాస్త్రవేత్తలను కలిస్తే, ఆడబిడ్డ పుట్టాలన్నా మగబిడ్డ

పుట్టాలన్నా నిర్ణయించేది పురుషుడే కాని, స్త్రీకాదు అని నేటి శాస్త్రం కూడా చెబుతుంది. బైబిల్‌లో దేవుడు చెప్పినదే, ఈ రోజు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. చెప్పాలి కూడా ఎందుకంటే మనల్ని కనేది తండ్రి, ఎక్కడో తెలుసా? “తల్లి గర్భంలో” నే అని ఎంత మంది బైబిల్ పండితులకు తెలుసు? ఎంత మంది ఈ సిలువ వేయబడిన క్రీస్తు బోధను బోధించి క్రీస్తును, దేవునిని మహిమపరుస్తున్నారో మిమ్మల్ని మీరే పరిశీలించుకోండి. స్త్రీ తన గర్భమున పుట్టిన బిడ్డను కరుణింపకుండ తన చంటిప్లిను మరచునా? వారైన మరచుదురు గాని నేను నిన్ను మరువను (యోషయా 49:15). మన తల్లి గర్భములోనే మన తండ్రి మనల్ని కంటున్నాడు. నిజంగా మన జన్మస్థలం ఆసుపత్రి లేక మన ఇల్లు కాదు. బైబిల్ ప్రకారం మన జన్మభూమి ఇండియానో, అమెరికానో కాదు. మన అమ్మ తన కడుపులో పుట్టి పెరిగిన మనల్ని ఈ లోకంలోనికి డెలివరీ చేసుందంతే. ఈ సత్యము అందరూ గ్రహించి తీరాలి. కాబట్టి స్త్రీలారా ఇకముందు మిమ్మల్ని మీ భర్తలైనా, అత్తమామలైనా అందరూ ఆడపిల్లలనే కంటున్నావు అని నిందిస్తే, హింసిస్తే ధైర్యంగా నిలదీయండి. కనేదినీవే బాబు నా తప్పేమీ లేదు అని దేవుని వాక్యంతో ధైర్యంగా మీ భర్తలతో మాట్లాడండి. లేదా నా దగ్గరకు తీసుకొని రండి. దేవుని వాక్యంతోనే వారి నోరు మూయిస్తాను. ఈ సత్యము తెలియని అనేకులు (క్రైస్తవులు కూడా) ఆడపిల్లలను కన్నారని ఎందరో స్త్రీలకు విడాకులిస్తున్నారు, వారిని చంపో లేక చనిపోయేటట్లు ప్రేరేపించో మగపిల్లలకోసం మరోపెళ్ళికి సిద్ధపడుతున్నారు చాలామంది దుర్మార్గులు, వారి తల్లితండ్రులు. ఇక నుండైనా ఈ అన్యాయం, అక్రమాన్ని రూపుమాపాలి. దేవుని కుమారులైన క్రైస్తవులైన మనమే ఈ భ్రూణ హత్యలను ఆపి తీరాలి.

మరొక అద్భుతమైన సంగతి చెబుతాను. ఈనాడు లాయర్లకు, న్యాయశాస్త్రానికి అందనిది మానవుడికి దేవుడు ఉచితంగా ఇస్తున్న

కానుక.  మన దేశంలోని పీనల్‌కోడ్‌లో ‘తాత ఆస్తి మనవడికి వస్తుంది’ అని ఉంది.  ఐ.పి.సి. (ఇండియన్ పీనల్ కోడ్)లో ఈ న్యాయం, చట్టం ఇలా ఎందుకుంది అని ఒక లాయరునుగాని, జడ్జీని గాని, వాటిని వ్రాసిన నిర్మాతలను అడగండి.  ఏం చెబుతారో చూద్దాం.  మన వాళ్ళకు, అనేక దేశాలకు చట్టాలను ఇచ్చింది బ్రిటిష్‌వాడే.  వారెక్కడ నుండి దొంగిలించారో తెలుసా? మళ్ళీ బైబిల్ వాక్యములో నుండే అదే హెబ్రీ పత్రిక 7:4-10.  మనం పుట్టకముందు మన తండ్రిలో, మనతండ్రి మనతాతలో ఉన్నాడు గనుక మనం మన తాత గర్భంలో (అపుడు తాతగానే ఉన్నా) ఉన్నప్పుడే ఆయన ఆస్తిని సంపాదించాడు గనుక, తాతగా ఉన్న మనం కూడా సంపాదించినట్లే అవుతుంది కాబట్టీ ఖచ్చితంగా తాత ఆస్తి మనవడికి వచ్చి తీరుతుంది.  దేవుని వాక్యం నిరర్థకం కానేరదు. క్రీస్తును నమ్మనివారు కూడా దీని ద్వారానే కోర్టుకెళ్ళి తమ వంశపారంపర్య ఆస్తులను సంపాదించుకొంటున్నారు.  ఇప్పుడైనా ఒప్పుకొంటారా? దేవుడు, దేవుని వాక్యమెంత గొప్పదో! ఇది మతబోధ కాదు, విదేశీమతం అంతకన్నా కాదు.  మానవ బ్రతుకును నడిపించే సర్వోన్నతుడైన దేవుని మార్గం.  మానవత్వాన్ని మేలుకొలిపే మాటలు.

అలాగే ఈప్రపంచాన్ని లేక సృష్టిని మనం ఎందుకు ఆధిపత్యం వహించి లోబరుచుకోవాలో, మనకు సృష్టిమీద అధికారం ఎందుకిచ్చాడో తెలుసా? దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను.  దేవుని స్వరూపమందు వాని సృజించెను స్త్రీనిగాను పురుషునిగాను వారిని సృజించెను.  దేవుడు వారిని ఆశీర్వదించెను; ఎట్లనగా - మీరు ఫలించి అభివృద్ధి పొంది విస్తరించి భూమిని నిండించి దానిని లోబరుచుకొనుడి సముద్రపు చేపలను ఆకాశపక్షులను భూమిమీద ప్రాకు ప్రతి జీవిని ఏలుడని దేవుడు వారితో చెప్పెను... (ఆదికాండం 1:26-28).  మనం దేవుని గర్భంలో లేదా దేవునిలో దేవునిగా ఉన్నప్పుడే ఈ సృష్టిని దేవుడు

కలుగజేసాడు (సంపాదించాడు) కాబట్టి ఈ సృష్టికి మనం వారసులం, సృష్టిలోని ప్రతిదీ మనదే, ఇది మనకు హక్కుగా సంక్రమించింది తెలుసా! ఈనాడు ప్రతి లాయరు మీతాత ఆస్తిని మీకు తప్పక ఇప్పిస్తానని గట్టిగా చెబుతున్నాడు అంటే అది దేవుడు బైబిల్‌లో చెప్పాడు కనుకనే. ఈ ప్రపంచానికి క్రీస్తు ఎంతమేలు చేశాడో, ఇంకా ఎలా చేస్తున్నాడో ఆలోచించండి. అందుకే ఎవరు నమ్మినా నమ్మకపోయినా, అందరికి సమానమైన న్యాయం చేకూరుస్తున్నాడు గనుకనే ఆయన "యేసుక్రీస్తు అందరికి ప్రభువు" (అపో.కా. 10:38). అని పరిశుద్ధాత్మ ద్వారా బైబిల్‌లో వ్రాయబడియున్నది.

ఇక్కడ ఇంకా ఎన్నో మర్మాలు దాగిఉన్నా ప్రస్తుతం ఈ బ్రహ్మాండంలో ఎవరికి అర్థంకాని మరో బ్రహ్మాండమైన రహస్యం విప్పుతున్నాను. జాగ్రత్తగా చదవండి, ఆలోచించండి. మనం చిన్నప్పుడు, చదువుకున్న పుస్తకాలలో ఉన్నది. ప్రతిరోజు స్కూల్ ప్రారంభంలో కూడా ఈ ప్రతిజ్ఞ చేస్తున్నాం. భారతదేశం నా మాతృభూమి – భారతీయులందరూ నా సహోదరులు (అన్నదమ్ములం – అక్కచెల్లెళ్ళం) అని. ఇదెలా చెప్పారు మన పెద్దలు? దీని వెలుకాల చరిత్రకు కూడా బైబిలే కారణం తెలుసా! మరలా హెబ్రీ పత్రిక 7:4–10 చదివితే మనం అంతా ఎలా ఈ భూమి మీదకొస్తున్నామో తెలుసుగదా! మనం మన తండ్రిలోనికి మన తండ్రిని తాతలోనికి, ఆయనను ముత్తాతలోనికి పంపితే, మొట్టమొదట మట్టి దిబ్బగా ఉన్న ఈ దేశంలోనికి పొట్టచేతపట్టుకొని కైబరు బొరు కనుమలగుండా, సింధూనది పరివాహక ప్రాంతానికొచ్చిన ఆర్యులే మన ముత్తాతలు, అలాగే సముద్రమార్గంగుండా దక్షిణ భారతానికి అంతకు ముందే వచ్చారని చెబుతున్న ద్రావిడులుకూడా మన తాతలే. ఇప్పుడు అందరం భారతీయులం. మేరాభారత్ మహాన్ అంటే మట్టి దిబ్బ గొప్పది కాదు. అందులో భారతీయులంతా మహాన్ అనగా మహాత్ములే అని అర్థం చేసుకోవాలి. దేశమంటే మట్టికాదోయ్ మనుషులోయ్

అని మన గురజాడ అప్పారావు గారు చెప్పింది జ్ఞాపకం చేసుకోండి. మట్టికోసం మనుషులను చంపక, మనిషికోసం మట్టిని అనగా లోక సంబంధమైన కోరికలను చంపండి.

ఒక కుటుంబం లేదా కొన్ని కుటుంబాలే నేడు 100కోట్లు భారతీయులయ్యారన్నమాట. ఒక 1000 సం॥ వెనక్కువెళితే ఈరోజు నేను ఆంధ్రప్రదేశ్‌లోని ఒక ఊరిలో ఫలానా కులంలో పుట్టానని చెబుతున్న మా తాత పంజాబ్‌లో పుట్టిన వాడి తాత ఇద్దరు అన్నదమ్ములే అంటాను కాదనేవారెవరో చెప్పండి. మన తెలుగోడు అయినా మాదిగవాడి తాత, బ్రాహ్మణుడి తాతలు కూడా ఒకప్పుడు అన్నదమ్ములే. మరో 2000సం॥ వెనకకు వెళ్ళండి. ప్రపంచంలో ఉన్న మానవులంతా అన్నదమ్ములమే కాదా? తెల్లవాడినైనా, తెలిసిన నల్లవాడినైనా కోస్తే వచ్చే రక్తం 'ఎరుపే' ఎందుకంటే అది ఆదిమానవుడైన ఆదాము నుండి పంచుకొన్న రక్తం గనుక (అపో.కా. 17:26) ప్రతి దేశంలో ప్రతి జాతి, మతం, కులంగా విడిపోయిన మనమందరం, ఒక తండ్రి పిల్లలం కనుకనే ప్రపంచ ప్రజలారా ఏకంకండి అనో, భారతీయులారా ఏకంకండనో మనమంతా అన్నదమ్ములం (సోదరులం) అని చెబుతున్నదంతా, బైబిల్‌లో ఒకే దేవుడు వ్రాయించినదాన్ని బట్టి. కాబట్టే ఇకనైనా మీ ప్రక్కవాడితో వీడు మన కులంవాడేనా? అందులో ఉప కులంవాడేనా? మనమతం, ఊరు, ప్రాంతం వాడేనా? అనటం మానేయండి. ఈ రోజు మతాల కన్నా కులాల గొడవలు ఎక్కువగా అవుతున్నాయి. జాగ్రత్తగా ఆలోచించి మసలుకోండి, భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరూ నా సోదరులు అని చిన్నప్పుడు స్కూలులో ప్రతిజ్ఞ చేసినవిధానానికి, పొట్టకూటికోసం ఉద్యోగంలో స్థిరపడ్డాక దానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నాం అని ఆలోచన చేయండి. పెద్దయ్యాక, ఉద్యోగం దొరికాక మనమెంత బుద్ధిహీనులముగా / మూర్ఖులముగా ప్రవర్తిస్తున్నామో జాగ్రత్తగా ఆలోచించి గ్రహిస్తే మీకే అర్థం అవుతుంది.

# ఈ ఆత్మ ఎవరు?

ప్రారంభ మానవుని శరీరంలోని నాసికా రంధ్రముల గుండా ప్రవేశించింది 'దేవుని ఆత్మ' అని అర్ధమవుచున్నది లేక దేవుడైన ఆత్మ అని అర్ధం చేసుకొని తీరాలి (యోబు 27:2,33:4). ఎందుకంటే దేవుడుకూడా ఆత్మ అని బైబిల్ చెప్పింది – "దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించు వారు ఆత్మతోను, సత్యముతోనూ ఆరాధించవలెను (యోహాను 4:24) అని యేసుప్రభువు చెప్పెను. ఉదాహరణకు : నాకు ఒక బాబు ఉన్నాడు. అతనికి ఇపుడు 16 సం॥లు వయస్సు. అయితే 17 సం॥ల క్రితం అతను ఎక్కడ ఉన్నాడు? ఎలా ఉన్నాడు? అని జాగ్రత్తగా ఆలోచించండి. నా కుమారుడు లేదా కుమార్తె నాలో నుండి వేరై బయటకు రాకముందు నాలో నేనై ఉన్నారు. ఇప్పుడు విడిగా కన్పించినా ఒకపుడు నేనుగానే నాలో ఉన్నారు. అలాగే ఆదాము, జీవాత్మగా దేవుడైన ఆత్మ నుండి విడిపోకముందు ఎక్కడ ఉండెను? దేవుని యొద్దనా? లేక దేవునిలో

ఒక మూలనా? **దేవునిలో దేవుడై ఉన్నాడు** అని నేనంటాను. కాదనే వారెవరన్నా ఉన్నారా? ఆలోచించండి. ఇపుడు లోకంలో తాత ఆస్తి మనుమడికి హక్కుగా వస్తుంది ఎందుకో తెలుసా ఈ మనువడు తాతలో ఉన్నపుడే ఆస్తిని సంపాదించాడు గనుక. ఇది బైబిల్ చెప్పిన రూలు మాత్రమేనని ఎందరికి తెలుసు. అలాగే ఈ సృష్టికి అనగా దేవునికి, ఆయన ఆస్తికి మనమెలా వారసులమో తెలుసా? మనం దేవునిలో దేవుడై అనగా మనకన్నా ముందే ఈ సృష్టిని దానిలోని, సమస్తం దేవుడై అనగా మనకన్నా ముందే ఈ సృష్టిని దానిలోని, సమస్తం దేవుడే కలుగజేసాడు. అన్ని కలుగజేసుకొన్నాక ఆఖరున మానవుడుగా దేవునిలోంచి బయటకు వచ్చి ఈసృష్టిలో రంగప్రవేశం చేసాడు. (ఆదికాండం 1:1-27) అందుకే ఈ సృష్టిమీద, దీంట్లో ఉన్న సమస్త చర-స్థిర జీవరాశుల మీద అధికారం చలాయించుచున్నాం. దీనిమీద అధికారం / వారసత్వం అందుకే మనకొచ్చింది. (ఆది.కా. 1:26-30), అయితే ఒకడు ఒక చోట ఈలాగున ధృఢముగా సాక్ష్యమిచ్చుచున్నాడు - నీవు మనుష్యుని జ్ఞాపకము చేసికొనుటకు వాడే పాటివాడు? నీవు నరపుత్రుని దర్శించుటకు వాడేపాటివాడు? (హెబ్రీ 2:6-8, కీర్తన 8:3-8) కాబట్టి సృష్టిలో ప్రతీదీ నరునికి లోబడుతుంది. అంటే నరుడు ఈ సృష్టికి అతీతుడా? లేక సృష్టికర్తయైన దేవుడా! లేఖనాన్ని పరిశోదిద్దాం ఆత్మజ్ఞానంతో అజ్ఞానాన్ని పారద్రోలుదాం.

నాడు చాలామంది వేసిన ప్రశ్న ఏమిటంటే ఆదికాండములో దేవుడు మనిషిని తన స్వరూపములో చేశాడు గదా! దేవునికి కూడా ముఖము, కాళ్ళు, చేతులు ఉంటాయా? అని అడుగుతున్నారు. అలాగే దేవుని కన్నులు, చేతులు, పాదాలు అని చాలాచోట్ల వ్రాయబడి ఉంది గదా అని రెఫరెన్సులు చూపిస్తున్నారు. అయితే అదే వాక్యంతో

దేవునికి ఆకారం, రూపం లేదని ఆయన సర్వశక్తిమంతుడని, ఆత్మ అని, ప్రేమా స్వరూపియని కూడా వ్రాసి యున్న దానిని గూర్చి ఆలోచించడం లేదు. ప్రేమకు, శక్తికి, రూపం ఉందా అవి గుణం, లక్షణాలను కల్గినవి. అందుకే మనిషికి శరీరాన్నిచ్చాడే తప్ప శరీరం కూడా మనిషి కాదు. అది మన గుడారం. మనం గాని, క్రీస్తుగాని దేవుని స్వరూపం అనగానే ఆయన గుణ, లక్షణాలు కల్గిన ఆత్మ స్వరూపులమే. మనకర్థమవటానికి, ఆదరించటానికి మన భాషలో దేవుడు నాకన్నులు నిన్ను చూస్తున్నాయి, నా హస్తము నీకు తోడుగా ఉంటుందని చెప్పాడని గ్రహించాలి.

# మానవుడు దేవుడా?

మానవునికి ఇంత ఆలోచన, వివేచన జ్ఞానం ఎందుకున్నది. అని ఆలోచిసన్తా లేఖనాన్ని పరిశోధిస్తుండగా క్రీస్తు బోధించిన బోధనలోని ఒక అద్భుతమైన సంఘటన నాకు కనబడింది. ఇది మత్తయి, మార్కు, లూకా సువార్తలలో వ్రాయబడి ఉన్నది. ఒక యవ్వనస్తుడు యేసు ప్రభువునొద్దకు వచ్చి నిత్యజీవానికి వారసుడవ్వాలంటే నేనేం చేయాలి? అని అడిగాడు. అందుకతడు అవన్ని చేస్తున్నాను అని అన్నాడు. అయితే నీకింకొకటి కొదువగా ఉన్నది అన్నాడు ప్రభువు. ఏమిటి? అని ఆ యవ్వనస్తుడు అడుగగా! నీ ఆస్తి అంతా అమ్మి బీదలకిచ్చి నీవు వచ్చి నన్ను వెంబడించమన్నాడు క్రీస్తు. ఈ మాటలు వినిన అతడు మిగుల ఆస్తిపరుడు గనుక మిక్కిలి వ్యసనపడి వెళ్ళిపోయాడు. వెంటనే ప్రభువు “ధనవంతుడు పరలోకరాజ్యంలో ప్రవేశించుట కంటే ఒంటె సూది బెజ్జంలో దూరుట సులభం – ఆస్తిగలవారు దేవుని రాజ్యంలో ప్రవేశింపనేరరు...” అన్నాడు. అందుకు శిష్యులు

మిక్కిలి ఆశ్చర్యపడి "అలాగైతే ఎవడు రక్షణ పొందగలడు" అని ఆయనను అడుగగా. యేసు "ఇది మనుష్యులకు అసాధ్యమేగాని దేవునికి సమస్తము సాధ్యం" అన్నాడు (మత్తయి 19:16–26). యేసు వారిని చూచి – ఇది మనుష్యులకు అసాధ్యమే గాని దేవునికి సమస్తమును సాధ్యమని చెప్పెను. (మార్కు 10:17–27).

ఇది చదివి ఆలోచించినపుడు నాకొక అద్భుతమైన వివేచన / ఐడియా వచ్చింది. ఎందుకంటే దేవుని వాక్యాన్ని గూర్చి ఆలోచిస్తే ఆయనే మనకు వివేచనిస్తానని చెప్పాడు (2తిమోతి 2:7). యేసు ప్రభువు స్వయానా "దేవునికి" సమస్తం సాధ్యం అన్నమాట ఆశ్చర్యంగా ఉన్నది ఎందుకంటే ఇక్కడ మాట్లాడుచున్నది స్వయంగా దేవుని వాక్యమైన దేవుడు గదా. "ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను. ఆయన ఆదియందు దేవుని యొద్ద ఉండెను. సమస్తమును ఆయన మూలముగా కలిగెను, కలిగియున్నదేదియు ఆయనలేకుండా కలుగలేదు (1యోహాను 1:1–2)". మనం ఇంతవరకు పై భాగాన్ని చదువుకొన్నపుడు మనకు సాధ్యంకానిది దేవునికే సాధ్యం గనుక "ఆ దేవుడే చూసుకొంటాడు" అని వదిలేస్తుంటాం. లేదా యేసయ్యా నీకు సమస్తం సాధ్యం ప్రభువా అని అంటుంటాం. మనం మనుషులం, బలహీనులం మనవల్ల ఏదీ కాదు అనుకొని ఏది మానడంలేదు. దేవుడు నాచేత అన్ని పనులు మాన్పించాలి అని అనుకొంటాం. మనం అనుకొంటున్నట్లు అన్నీ ఆ దేవునికే (తండ్రికే) సాధ్యం అని అన్నట్లయితే అక్కడ ప్రభువు నా తండ్రికి సమస్తం సాధ్యం అని అనుండాలి. ఎందుకంటే ఆయన దేవుని గూర్చి మనుషులతో చెప్పినపుడల్లా నా తండ్రి అని చెప్పాడు గదా! మనల్ని కూడా తండ్రీ అని అనమన్నాడు. ఇది తండ్రియైన దేవునికే సాధ్యం అని అనుకోవడానికి వీలు లేదు అని దేవుని ఆత్మతో ఆలోచిస్తే

సుళువుగా అర్థమవుతుంది. లేదా యేసుకే సాధ్యం మనకు అసాధ్యం అని మనం అనుకొంటున్నట్లయితే ఆయన (యేసు) అప్పుడు సమస్తం నాకు (యేసుకు) సాధ్యం అని అని ఉండాలి. ఈ రెండు గాక ప్రత్యేకంగా దేవునికి సమస్తం సాధ్యం అంటున్నాడు అంటే ఈ దేవుడెవరో అని జాగ్రత్తగా ఆలోచించాను.

ఇక్కడ మరొక ఆలోచన కూడా వచ్చింది. ఒకవేళ మనం అనుకొన్నట్లు "ధనాన్ని" వదులుకోడం మనకు అసాధ్యమైనట్లయితే, మనకు అసాధ్యమైన పనిని మనకెందుకు చెప్పాలి? మనం మోయలేని బరువు మనమీద మోపితే ఆయన (దేవుడు) తండ్రి కాగలడా? ఈయన (క్రీస్తు) ప్రభువు కాగలడా? ఎందుకంటే యేసు ప్రభువు తన కాడి చాలా సుళువు, తన భారం చాలా తేలిక అని చెప్పాడు. "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నాయొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును. నేను సాత్వికుడను, దీన మనసు గలవాడను గనుక నీ మీద నా కాడి ఎత్తుకొని నాయొద్ద నేర్చుకొనుడి, అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరుకును. ఏలయనగా నా కాడి సులువుగాను నాభారము తేలికగాను ఉన్నది. (మత్తయి 11:28-30), దేవుని ఆజ్ఞలు భారమైనవి కావు (యోహాను 5:3) అని పరిశుద్ధాత్మ కూడా చెప్పాడు గనుక బైబిల్ కు బైబిలే సమాధానం చెప్పాలని చాలా లోతుగా ఆలోచించాను. ప్రభువే నాకు వివేకము ననుగ్రహించాడు. మీరు కూడా అదే వివేకముతో ఆలోచించండి.

ఈరోజు క్రైస్తవులు కూడా పాత నిబంధనలోని ఆనాటి ఇశ్రాయేలీయులతో చెప్పిన యెహోవాయీరే. దేవుడే చూచుకొనును, దేవుడే చూసుకోవాలి అని ఆయన్నే ప్రార్థిస్తూ దేవుని పేరు చెప్పి ధనాన్ని సమకూర్చుకుంటున్నారు. ఏపని చెప్పినా మనం మనుషులం మనవల్ల ఏమవుతుంది బ్రదర్, సిస్టర్ అనే మాటలు చెప్పి తప్పించు కొంటున్నారు. మనిషివల్ల అయ్యేపనులను మనుషులకు మాత్రమే

చెబుతారు, దేవుడివల్ల అయ్యేపనిని దేవుడే చూసుకొంటాడనే తేడాను ఇంతకు ముందు వరకు తెలుసుకోలేకపోయాం. అయితే నమ్మిట నీవలననైతే నమ్మువానికి సమస్తం సాధ్యమే (మార్కు 9:4) అనే వచనం గుర్తుకొచ్చింది. దేవుని మాటలలోని మర్మాన్ని, అందులోని వాస్తవాన్ని ఆలోచించి నమ్మితీరాలి అంటున్నాడు. ఇప్పుడు చూడండి క్రీస్తుకూడా మనలాంటి మట్టిశరీరాన్ని ధరించుకొన్న మనిషైనా దేవుని కుమారుడనని గ్రహించి, ఒకవిధంగా దేవుడనని అర్ధం చేసుకొని, ఆలోచించి దేవుడిలాగానే ప్రవర్తించాడు గనుకనే ఆయనకసాధ్యమైనదేదియు లేదని గ్రహించినపుడు మనమెందుకు అలా ఆలోచించి ప్రవర్తించకూడదు. క్రీస్తు రక్తంలో కడుగబడి ఆయన చేసిన నూతన నిబంధనలోనికి వచ్చినవాడెవడును మామూలు మనిషిగా ఆలోచించకూడదన్నమాట. ఆయనను ధరించుకొన్న మనం ఆయనలాగా ఆలోచించాలని ఆమాట అన్నాడని గ్రహించేవారికి ఆనందం పుట్టలేక అందరికి చెప్పాలని ఆలోచించి మీకు వ్రాయుచున్నాను. ఇందుకు దేవునికి స్తోత్రం.

మీరు కూడా జాగ్రత్తపడి ఆలోచించండి నేను చెప్పుమాటలు ఆలోచించుకొనుము అన్ని విషయములయందు ప్రభువు నీకు వివేకము అనుగ్రహించును (2తిమోతి 2:7). మనిషిగా ఆలోచిస్తే నరుడికి అన్ని అసాధ్యమే కాని దేవునికుమారుడుగా అనగా దేవుడిగా ఆలోచిస్తే మనకు అసాధ్యమైనది ఏదీ లేదుగదా! కాబట్టి మనిషిగా ఆలోచించకు ఈ మట్టి బొమ్మలోనికి రాకమునుపు మన మెవరమో, మనల్ని ఈ మట్టిబొమ్మలోనికి వచ్చాక కూడా దేవుడు ఏమని పిలుస్తున్నాడో చూసే సరికి మనుషులకు అసాధ్యమే కాని దేవునికి సమస్తం సాధ్యమేనని శిష్యులతో ప్రభువు ఎందుకన్నాడో అర్థమయిపోయింది. ఆయన పలికిన దేవుడెవరో, మన చేతుల్లో ఉన్న జీవ వాక్యమును అడుగుదాం. క్రీస్తు అంటున్నది మన

గూర్చేనా? అవును అక్షరాలా మనను గూర్చే ప్రతి మానవుడు కూడా దేవుడే. ఎందుకంటే......

దేవుడు నరున్ని తన స్వరూపమందు సృజించెను (ఆది. 1:26) దేవుని స్వరూపం ఆత్మ (యోహాను 4:24) నరుడు కూడా ఆత్మే గనుక. ఇంకను దేవుని కుమారుడు దేవుడే గదా! మనిషికి పుట్టిన పిల్లవాడు మనిషి అయినపుడు, కుక్కపిల్ల కుక్క అయినపుడు రాజకుమారుడు (యువరాజు) రాజు అయినపుడు, దేవుని కుమారుడు దేవుడు కాడా? చిన్నపిల్లలు దేవునిలాంటి వారేనని అందరికి తెలుసుకదా! ఆత్మయైన దేవుడు పరలోకంలో ఉంటే 'పరమాత్మ', భూలోకంలోకి వచ్చాడు గనుక 'జీవాత్మ' ఆయన దేవుడు మనం జీవుడు అని అంటున్నాం. ఆయనకు మనకున్న అనుబంధం ఇదన్నమాట. అందుకే ఆయన మనల్ని (లోకాన్ని) ఎంతో ప్రేమించాడు. కనుకనే మనమాయనని ఎంతగానో స్తుతించి తీరాలి. ఇదే దేవుని వాక్యంలోని సారంశం. ఇదేంటి ఏదో క్రొత్తబోధ చేస్తున్నాడీయన అనుకొంటున్నారా తీయండి మన చేతిలో ఉన్న దేవుని మాటల్ని గమనిద్దాం.

– దేవుని సమాజంలో దేవుడు నిలిచియున్నాడు దైవముల మధ్యన తీర్పు తీర్చుచున్నాడు. మీరు దైవములనియు మీరందరును సర్వోన్నతుని కుమారులనియు నేనే సెలవిచ్చియున్నాను (కీర్తన 82:1,6).

ఇక్కడ దేవుడు తన పిల్లలైన వారందరితో (ఇశ్రాయేలీయులతో) మాట్లాడుతూ మీరందరూ సర్వోన్నతుడైన నా కుమారులే. మీరందరూ దైవ స్వరూపులే లేక దైవములే అంటున్నాడు. ఆరిన నేలపై (యావద్భూమి మీద) పుట్టిన, పుట్టబోవుచున్న ప్రతి మనిషి ఒకే ఆదాములోంచి వచ్చాడని, ఆదాము దేవుని నుండి వచ్చాడని ముందే తెలుసుకున్నాం. ఇంకా బైబిల్‌లో యోబు గ్రంథంలో నా

ఊపిరి యింకను నాలో పూర్ణముగా ఉండుటను బట్టియు దేవుని ఆత్మనా నాసికారంధ్రములలో ఉండుటను బట్టియు (యోబు 27:2). దేవుని ఆత్మ నన్ను సృజించెను సర్వశక్తునియొక్క శ్వాసము నాకు జీవమిచ్చెను (యోబు 33:4). దేవుని ఆత్మ నా నాసికారంధ్రంలో ఉండుట వలన అని వ్రాయబడినది. మన శరీరం యొక్క నాసికా రంధ్రముల గుండా ప్రవేశించింది దేవుడైన ఆత్మ అన్నమాట. "ఇదంతయు నీకు తెలిసియున్నది గదా. నీవు బహువృద్ధుడవు నీవు అప్పటికి పుట్టియుంటివి" (యోబు 38:1-21). దేవుడు యోబును విచిత్రంగా ప్రశ్నిస్తూ... ఈ సృష్టి, అంతయు పుట్టకముందు నీవెక్కడ ఉన్నావు. నీకు ఇదంతయు తెలుసు, నీవు అప్పటికి పుట్టియున్నావు. బహువృద్ధుడవు అంటాడు. అంటే నీవు అప్పటికి నాలో నేనే అయి ఉన్నాను నాయన అంటున్నాడు. **దేవుడు ఉన్నవాడు** (నిర్గమ. 3:14) ఆ ఉన్నవాడిలోంచి వచ్చిన మనం కూడా శరీరంలో ఉన్నవారమే. మనల్ని ఎవరు అడిగినా ఫలానా చోట ఉన్నాం అనే అంటాం. చనిపోయిన తర్వాత కూడా ఉంటే పరదైసు/పరలోకంలోనైనా ఉంటాం లేదా నరకంలోనైనా నిత్యం కాలుతూ జీవించే ఉంటాం. ఇది దేవుని వాక్యం, నమ్మి తీరాలి. అంటే ఈనాడు ప్రపంచంలోని అందరూ జాతి, మత, భాషా, ప్రాంత బేధం లేకుండా అందరూ దేవునికి కుమారులైన దేవుళ్ళే అన్నమాట. అందుకే చాలామంది నేనే దేవున్ని అని అనగలు గుతున్నారు. అసలు విషయం తెలియని అమాయకులు వారిని నమ్మి మోసపోతున్నారు.

అయితే బైబిల్ అంతా చదివినా, లేక వాస్తవంగా ఆలోచించినా నరుడు కూడా దేవుడు కాని నరుడే దేవుడు కాదు, ఎందుకంటే సర్వశక్తి అయిన ఆత్మలోని కొంతభాగం మాత్రమే ఈ నరుడైన జీవాత్మ. యెహోవా నా స్వాస్థ్యభాగము నా పానీయభాగము నీవే నా భాగమును కాపాడుచున్నావు (కీర్తన 16:5). యెహోవా,

నీవే నా భాగము నీ వాక్యముల ననుసరించి నడుచుకొందునని నేను నిశ్చయించుకొని యున్నాను (కీర్తన 119:57). యెహోవా నా భాగమని నేననుకొనుచున్నాను ఆయన యందు నేను నమ్మిక యుంచు కొనుచున్నాను (విలాప వా. 3:24). ఆ శక్తి యొక్క సర్వశక్తులు, స్వరూపం కల్గిన ఒక భాగం మాత్రమే ఈ నరుడని గోచరించుచున్నది. ఎందుకంటే ఇప్పుడు దేవుడు ఉన్నాడు, మనం కూడా ఉన్నాం. అందరికి తండ్రియైన దేవుడు ఒక్కడే. ఆయన అందరికిపైగా ఉన్నవాడై అందరిలోను వ్యాపించి అందరిలో ఉన్నాడు (ఎఫెసి. 4:6). ఇద్దరు వేర్వేరుగా ఉన్నా నరులంతా దేవుళ్ళు అయితే దేవాదిదేవుడు ఆయన (తండ్రి) అని అర్థం అవుచున్నది. ఇంకా బైబిల్‌లో దేవుడే ఒక నరున్ని (మోషేను) దేవునిగా నియమించినట్లు, సంబోధించినట్లు ఉన్నది. అతడే నీకు బదులు జనులతో మాటలాడును, అతడే నీకు నోరుగానుండును, నీవు అతనికి దేవుడవుగా ఉందువు (నిర్గమ 4:16). కాగా యెహోవా మోషేతో ఇట్లనెను - ఇదిగో నిన్ను ఫరోకు దేవునిగా నియమించితిని; నీ అన్న అహరోను నీకు ప్రవక్తగా నుండును (నిర్గమ. 7:1).

ఉదా॥ ఒక వ్యక్తి ఏమీలేని బీదవాడిననుకొని రాళ్ళుకొట్టుకొని లేదా రిక్షాలాగి బ్రతుకుతున్నాడనుకొందాం. అతని జన్మరహస్యాన్ని తెలుసుకొన్నవాడు వెళ్ళి అతనితో నీవు మామూలు వాడివికాదు, ఈ దేశాన్ని పరిపాలించే చక్రవర్తి కుమారుడివి అని చెప్పాడనుకోండి. వెంటనే ఆ వ్యక్తి ఆ దేశానికి రాజుగా అయి రాజ్యాన్ని పాలించాలను కొంటాడా? అలాగే పనికిమాలిన వాన్నే అనుకొంటాడా? చెప్పండి ఇపుడు మన జన్మరహస్యం తెలిసిందికదా! మనమెలా ఉండాలి? ఇంజనీర్ల మీటింగ్‌కి ఇంజనీరే వెళ్ళాలి. కల్లెక్టర్ల కాన్ఫరెన్స్‌కి కలెక్టర్లు వెళ్లాలి, మంత్రివర్గ మీటింగ్‌కి మంత్రులే వెళ్ళాలిగదా మరి దేవలోకంలోనికి వెళ్ళాలంటే మనిషిని రానివ్వరు. దేవుళ్ళే వెళ్ళాలి

గనుక మనల్ని ఆ దేవుడే దేవుళ్ళుగా చూస్తున్నాడు, దేవుడుగా చేశాడు, దేవునిగా ఉండమన్నాడు కూడా. మనుషులకు అసాధ్యం అన్నాడంటే మనం మనుషులంకాదు, దేవునికి పిల్లలమైన దేవుళ్ళమని చెప్పినట్లేనని అర్థం చేసుకోవాలి.

మనందరం దేవునిగా బ్రతకాలని అలా బ్రతికినపుడే మనకేదీ అసాధ్యం కాదని ప్రభువు బోధించాడు. అంతేకాని ఇదేదో క్రొత్త బోధ అనకండి. దేవుని ఆత్మతో పరిశీలించితేనే ఇంత అద్భుతమైన జ్ఞానం అర్థం అవుతుందని మరచిపోకండి. కనీసం ఇది చదివిన రోజునుండైనా దేవుడగా బ్రతికి దేవలోకానికి (పరలోకం) వెళ్ళడానికి ప్రయత్నించండి. ఒక నిమిషం ఆపదలో ఆదుకొన్నవాన్ని ఏమంటామో తెలుసా? ఫలానా బ్రదర్ సమయానికి వచ్చి దేవుడిలా ఆదుకొని కాపాడాడండీ, లేకపోతే నాకీ బ్రతుకే లేదండీ ఆయనకు చేతులెత్తి నమస్కరిస్తున్నానంటాము కదా! ఎందుకంటే మనం ఆయనలో భాగమే కనుక అనగా మనం ఈ భూమి మీద బ్రతికినపుడు ఫలానా ఆయన / ఆమె దేవుడండి అని పిలిపించు కోవాలన్నమాట.

ఈనాడు చాలామంది మనలో దేవుడన్నాడు గదా అంటున్నారు. జాగ్రత్తగా పరిశీలించితే మనలో లేడు. మన శరీరంలో మనంగా పిలువబడుతున్న దేవుడుగా ఉన్నాడు (ఎఫెసీ 4:6). అయితే ఈ దేవుడైన ఆత్మ ఈ లోకంలోని ఆకారంలో ప్రవేశించి తన పూర్వ వైభవాన్ని మరచి తన దైవత్వాన్ని కోల్పోయినపుడు, మనకు ఆదియైన దేవుడు తన ప్రియకుమారున్ని ఈ లోకానికి పంపి ఆయన ద్వారా ఇంకొక విధానంలో అనగా నూతన నిబంధనగా మాట్లాడాడు. ఈ నూతన నిబంధన కాలంలోని నరులందరు దేవుళ్ళు కాదుకాని, ఎవరైతే దేవుని వాక్యాన్ని (క్రీస్తును) చేర్చుకుంటారో లేక వాక్యంతో కడుగబడుతారో అనగా దేవుని వాక్యం ఎవరి దగ్గర ఉంటుందో వారే దేవుళ్ళని సెలవిచ్చాడు. “అందుకు యేసు మీరు దైవములని

నేనంటినని మీ ధర్మశాస్త్రంలో వ్రాయబడియుండలేదా? లేఖనము నిరర్థకము కానేరదు గదా; దేవుని వాక్యమెవరికి వచ్చెనో వారే దైవములని చెప్పినయెడల - నేను దేవుని కుమారుడనని చెప్పినందుకు..." (యోహాను 10:34,35). నన్ను రాళ్ళతో కొడతారా అని ప్రశ్నించాడు. ఎవరైతే ఈ మాటకు లోబడుతున్నారో వారిలో తను పంపిన (ప్రత్యేకమైన) పరిశుద్ధమైన ఆత్మను ఉంచి దేవుళ్ళనుగా మార్చి, జీవింపజేసి తిరిగి దేవలోకానికి (దేవుడున్న పరలోకం) తీసుకొంటున్నాడు. ఇది దేవుని అద్భుతమైన దయాపూర్వకమైన సంకల్పం. కాబట్టి నూతన నిబంధనకు లోబడి క్రీస్తు రక్తంలో కడుగబడి క్రైస్తవుడిగా జీవించిన దేవుని కుమారుడైన దేవునికి సమస్తము సాధ్యమేనని యేసు చేసిన బోధ ఎంత గొప్పదో గ్రహించాలి. మన మానవత్వాన్ని జ్ఞాపకం చేస్తూనే మనలోని దైవత్వాన్ని తట్టిలేపి, ప్రపంచాన్నే దేవాలయంగా మార్చే ప్రయత్నమే యేసు ఈ లోకానికి చూపిన సర్వోన్నతమైన మార్గము. దేవునికి పక్షపాతము లేదన్నది సిలువ వేయబడిన క్రీస్తుబోధ. మానవ సేవయే మాధవ సేవ అని మన పెద్దలు చెప్పింది దీనిని బట్టియేనన్నమాట. దేవా నీకు స్తోత్రం తండ్రీ!!

# డార్విన్ సిద్ధాంతం

**మానవ శరీరం మట్టి నుండి పుట్టిందా? కోతి నుండి వచ్చిందా!!**

ఈనాడు మనిషికి అతి తెలివి వచ్చి, జన విజ్ఞానం, లేక శాస్త్రం పేరుతో కుప్పిగంతులు వేస్తున్నాడు. మనిషికి పుట్టానని తెలిసినా నమ్మకుండా ఎవడో ఎప్పుడో ఊహించి చెప్పినదాన్నే నమ్ముతూ నేను కోతినుండి పుట్టానని చెప్పుచున్నాడు. నిలకడలేని, నిరంతరం మార్పులకు చేర్పులకు లోనవుతున్న శాస్త్రాన్ని ఆధారం చేసుకొని ఊహాలోకంలో విహరిస్తున్నారు. ఇతియోపియా దేశంలో శాస్త్రవేత్తలకు లభించిన పురాతన ఎముకలను బట్టి మానవుని ఆవిర్భావం వయస్సును లెక్కగట్టారు. పూర్వపు ఆదిమానవులు నియాండర్‌తల్స్ అని నిర్ధారణ చేశారు. అయితే ఎప్పుడయితే జీవరాశుల డి.ఎన్.ఎ. శాస్త్రం అభివృద్ధి చెంది, క్రోమోజోమ్స్, జీన్స్ మొదలగువాటి లెక్క తెలిశాక డార్విన్ ప్రతిపాదించిన పరిణామ సిద్ధాంతం వెలవెల బోయింది. పురాతన ఎముకల MTDNA ను మనిషి

ఎముకలోని డి.ఎన్.ఎ.ను పరిశీలిస్తే రెండింటికి సంబంధం లేదని తేలిపోయింది. డార్విన్ మహాశయుడే తన అవసాన దశలో తన సిద్ధాంతం తప్పని ఒప్పుకొన్నట్లు సాక్ష్యాధారాలు లభించినా నేటి ప్రకృతి సంబంధులు తమ మూర్ఖత్వాన్ని వదులుకోవడం లేదు.

పరిణామం చెందిన తర్వాత కూడా క్రొత్త జాతి, పాత జాతి భూమి మీద నివసిస్తున్నాయి. ఉదాహరణకు పిల్లి కాలక్రమేణా చిరుతపులిగా, చిరుతపులి కాలక్రమేణా పులిగా, పులి తర్వాత సింహంగా మారినా ఈ రోజు సింహం ఒక్కటే కాకుండా మిగిలిన పిల్లి, చిరుతపులి, పులి అన్నీ భూమి మీద ఇప్పటికీ జీవిస్తూ వున్నాయి కాని అవి నశించిపోలేదు. ఒక రకమైన చీమ నుండి రకరకాల చీమలు వచ్చుటవలన ఈరోజు ఒకరకపు చీమనే కాక అన్ని రకాల చీమలను చూస్తున్నాము. అలాగే మనము చింపాంజీ, కోతులను , కొండముచ్చులను చూడగులుతున్నట్లే మందమైన తోలు, బొచ్చు కలిగి రెండు కాళ్ళతో మనలా నడుస్తూ లక్షా ఏభైవేల సంవత్సరాల నుండి ముప్ఫైవేల సంవత్సరాలకు జీవించారనబడుతున్న ఆది మానవుల సంతతనిని కూడా ఈ రోజు చూడగలగాలి. నిజం చెప్పాలంటే చింపాంజీకున్న మందమైన చర్మం, దట్టమైన బొచ్చు, ముఖం మార్పు చెంది పలుచని చర్మం కలిగి రెండు కాళ్ళతో నడిచే మానవునిగా మారేటప్పటికి కనీసం వీటిమధ్య 4 సార్లు అయినా మార్పులు జరిగి చింపాంజీ మనుష్యుల మధ్య జాతిగా ఆ జాతులు ఇప్పటికీ ఉండాలి. కాని మనం వారిని చూడలేకపోతున్నాము ఎందుకంటే మనం చింపాంజీల నుండి పరిణామం చెందిన పూర్వ ఆది మానవులనబడే వారి నుండి కాలక్రమేణా పరిణామం చెందుతూ రాలేదు అదంతా శాస్త్రవేత్తలు సృష్టించిన ఆధారాలు లేని, నిరూపణకాని విషయాలు.

దేవుడు మనకు ఆత్మనిచ్చుట వలన మనం జంతువులా మాంసముతో కూడిన శరీరం కలిగియున్నా, జంతువుల కోవలోకి రాము. మనకు మంచి, చెడు, న్యాయం, ధర్మం, సత్యం, ఆధ్యాత్మికత ఇవన్నీ తెలుసు. ఒకవేళ పూర్వం మనుష్యులను పోలిన పూర్వ ఆది

మానవులున్నారనుకున్నా వారికి దేవుడు మనలాంటి ఆత్మనివ్వలేదు. కాబట్టి వారు జంతుజాతిలోనికి వస్తారు కాని మానవజాతికి చెందరు. నిజం చెప్పాలంటే మానవులు జంతువుల వలె రక్తమాంసాలు కలిగి, వాటిలా ఆహారం తింటూ ఆడుతూ పాడుతూ తిరుగుతున్నా జంతు జాతిగా పరిగణింపబడరు. ఎందుకంటే ఆత్మ అన్నది వీరిద్దరినీ వేరు పరచుచున్నది జంతువులకు మనలాంటి ఆత్మలేదు మంచి, చెడుల వివేచన, క్రియేటివిటి లాంటి ఇతరత్రా జ్ఞానం వాటికి లేదు.

ఒకప్పుడు రాతితో పనిముట్లు చేసుకునే మానవుడు ఇంత తక్కువ సమయంలోనే ఎలా అభివృద్ధి చెందాడని మీకు అనుమానమొస్తే ఒక విషయం ఆలోచించండి. మానవుడు పుట్టి సైన్స్ ప్రకారం ఒక లక్షాయాభైవేల సంవత్సరాలు అయినా సైన్సుపరంగా అభివృద్ధి ఈ మధ్యనే 18వ శతాబ్దం నుండి మొదలైనది. అంతకు ముందు మన దగ్గర అంత టెక్నాలజీలేదు. అయితే ఈ రెండు వందల సంవత్సరాలలోనే మానవుడు వైద్యపరంగా ఎన్నో మందులు కనుగొని ఆపరేషన్లు చేస్తూ, విద్యుత్, బల్బ్,ఫ్యాన్, టి.వి., వీడియో, టేప్‌రికార్డర్, కంప్యూటర్స్, ఫోన్స్, సెల్ ఫోన్స్, ఫ్యాక్స్, విమానాలు, రైళ్ళు, కార్లు, రోబోలు, బాంబులు, ఎక్స్‌రే, పెద్దపెద్ద బిల్డింగ్‌లు, ప్రాజెక్టులు, బ్రిడ్జిలు, రాకెట్స్ తయారుచేసి అంతరిక్షానికి వెళ్ళి ఉపగ్రహాల (Satelite) ద్వారా అన్ని విషయాలను తెలుసుకుంటూ విశ్వాన్ని, భూమిని, ఇతర గ్రహాలను గమనిస్తున్నాడు. రెండు వందల సంవత్సరాలలో ఇంత అభివృద్ధి సాధ్యపడగా, మానవుడు పూర్వ ఆదిమానవుని నుండి పరిణామం (Development) చెందటానికి లక్షా ఏభైవేల సంవత్సరాలు పట్టిందని చెప్పినా కాలక్రమేణా మానవుని మెదడు పరిమాణంలో తేడా లేదు. కాని 400 సంవత్సరాల క్రితం వారికి ఏ టెక్నాలజీ లేదు మరి ఇపుడు దిగ్భ్రాంతి చెందే అద్భుతమైన టెక్నాలజీ మన సొంతం. ఇదెలా సాధ్యమైంది? యెషయా 28:29 వచనంలోని విధంగా ఆశ్చర్యకరమైన ఆలోచనాశక్తి, అధికబుద్ధి మానవునికి దేవుడు

అనుగ్రహించుట వలననే.

దేవుడు తెలివితేటలిస్తే అద్భుతమైన విషయాలు, టెక్నాలజీ కనిపెట్టుటకు వంద సంవత్సరాలు చాలు. అదే సైన్సు చెప్పిన పరిణామం ప్రకారం భూమి మీద జీవరాశి ఆవిర్భవించి 400 కోట్ల సంవత్సరాలై పరిణామం చెందుతూ ఉన్నా ఇప్పటికీ, జంతువులకూ, పక్షులకూ, జలచరాలకు తింటం, తిరగటం, పడుకోవడం తప్ప ఏమీ తెలియదు. ఎందుకని ఇన్ని కోట్ల సంవత్సరాల తర్వాత కూడా వాటి మెదడు పరిమాణం పెరిగి మానవునిలా ఆలోచించుట లేదు. జీవరాశులన్నీ కాలక్రమేణా అభివృద్ధి చెందుతూ ఒకదాని నుండి ఒకటి వచ్చాయని భావిస్తున్నారు కదా మరి వాటి నుండి వచ్చిన మిగిలిన జీవరాశులకు ఎందుకు ఇంత జ్ఞానం లేదు? మనిషికే ఎందుకొచ్చింది?

మొదటి మానవుడైన ఆదాము యొక్క మెదడు పరిమాణం కంటె ఇప్పటి మానవుల మెదడు పరిమాణం పెరిగి మనుష్యులు అభివృద్ధి చెందారనుకుందాము. అటువంటపుడు సైన్స్ చెబుతున్నట్లుగా ఒక లక్షా యాభైవేల సంవత్సరాలలో మానవునిలో ఇంత మార్పు రాగా ఎన్నో కోట్ల సంవత్సరాల నుండి జీవిస్తున్న జంతు జాతుల మొదడు పరిమాణం ఇంకా పెరిగి మనకంటే తెలివి కలిగినవి అవ్వాలి. ఎందుకని వాటి మెదడు మనిషివలె అభివృద్ధి కాలేదని పరిణామ సిద్ధాంతంతో ఏకీభవిస్తున్న శాస్త్రవేత్తలను అడుగుచున్నాను? భూమి మీద కనుగొన్న ఈజిప్టు, సింధూ, మెసపుటోమియా నాగరికతలు అన్నీ సుమారు 6 వేల సంవత్సరాల కంటే తక్కువ వయస్సు కలవే. దేవుడు మానవునికి జ్ఞానం, ఆత్మ ఇచ్చి వారిని తన కుమారులని పిలిచి అభివృద్ధి చెందమని అంటే ఈ రోజు సృష్టిమీద అధికారం చెలాయిస్తున్నామే తప్ప ఇతరత్రా ఏ కారణంలేదు. సైన్స్ కూడా ఈరోజు ప్రపంచంలో ఉన్న మానవులందరూ ఒకే మానవుని నుండి వచ్చారని బైబిల్‌తో ఏకీభవిస్తున్నది. మానవ దేహంలోని కణంలోని మైటో కాండ్రియాను

బట్టి మానవులంతా ఒకే కుదురు అనగా ఈరకమైన కణం మరే జీవరాశిలో లేదని శాస్త్రజ్ఞులే ప్రకటించారు. అయిదున్నర అడుగుల పొడవు అయిదు అడుగుల పొడవు ఉండే స్త్రీ పురుషుల మద్య వివాహం జరిగిందనుకుందాం పుట్టిన పిల్లలందరు అయిదు నుండి అయిదున్నర అడుగుల పొడవు మాత్రమే కలిగి ఉండరు. జన్యువుల్లో మార్పులు జరిగినట్లయితే మూడు అడుగుల పొడవుండే మరుగుజ్జు పుట్టవచ్చు ఏడున్నర అడుగుల పొడుగుండే ఆజానుబాహులు పుట్టవచ్చు. ఆ విధంగా రకరకాల పొడవు పర్సనాలిటీ గల మనుష్యులు ఉద్భవించారు కాని వీరందరూ మనుష్య జాతే కాని వేరే జాతి కాదు. అలాగే చీమలలో ఉత్పరివర్తనాల (Mulations) వల్ల అనేక రకాల చీమలు వచ్చినా అవన్నీ చీమ జాతులే. పిల్లి – చిరుతపులి, పులి, సింహంగా మారినా అవి పిల్లి జాతికి సంబంధించినవే. కుక్కలు, నక్కలు, హైనా, తోడేలు వేరుగా ఉన్నా ఒకే జాతికి చెందినవి.

లేటెస్ట్ జీనోమ్ శాస్త్రం ప్రకారం మనిషికి 23 జతల క్రోమోజోమ్స్ ఉన్నాయి. అనగా మొత్తం 46. మనిషికి లెక్కలో దగ్గరగా జీన్స్ ఉన్న జంతువు ఎలుక, ఆ తర్వాత పంది. అందుకే ఈరోజు మనిషికి వస్తున్న రోగాలకు మందు కనుగొనేటప్పుడు శాస్త్రవేత్తలు ఎలుకలమీదనే ప్రయోగిస్తున్నారనే సంగతి చాలు. మనం కోతి నుండి పుట్టలేదనడానికి. ఇలా ప్రకృతిలో అనగా భూమి, జలం పుట్టించిన జీవరాశుల యొక్క శరీరంలోని మాంసం వేరు, వేరుగా ఉంటుంది. కోడి మాంసం వేరు, నిప్పుకోడి మాంసం వేరు. మేక మాంసం వేరు, పొట్టేలు మాంసం వేరు. చేపల్లో కొరమేను రుచివేరు, బొచ్చె మిగతా చేపలన్నిటి రుచి వేరు. ఇలా ఎన్నింటిని గూర్చో ఆలోచించవచ్చు. ఈ సంగతిని బైబిల్ ముందే చెప్పింది.

“మనుష్య మాంసము వేరు, మృగ మాంసము వేరు, పక్షి మాంసము వేరు, చేపమాంసము వేరు. మరియు ఆకాశ వస్తు రూపములు కలవు, భూవస్తురూపములు కలవు : ఆకాశ వస్తురూపముల మహిమ వేరు, భూవస్తు రూపముల మహిమ వేరు,

సూర్యుని మహిమ వేరు, చంద్రుని మహిమవేరు, నక్షత్రముల మహిమ వేరు. మహిమను బట్టి యొక నక్షత్రమునకును మరియొక నక్షత్రమునకును బేధము కలదు కదా!" (1కొరింథి 15:39–41)

"దేవుడు – జీవముకలిగి చలించువాటిని జలములు సమృద్ధిగా పుట్టించునుగాకనియు, పక్షులు భూమిపైని ఆకాశ విశాలములో ఎగురునుగాకనియు పలికెను. దేవుడు జలములలో వాటివాటి జాతి ప్రకారము జలములు సమృద్ధిగా పుట్టించిన మహామత్స్యములను, జీవముకలిగి చలించువాటినన్నిటిని దానిదాని జాతిప్రకారము రెక్కలుగల ప్రతి పక్షిని సృజించెను. అది మంచిదని దేవుడు చూచెను. దేవుడు – మీరు ఫలించి అభివృద్ధి పొంది సముద్రజలములలో నిండియుండుడనియు, పక్షులు భూమి మీద విస్తరించును గాకనియు, వాటిని ఆశీర్వదించెను. అస్తమయమును ఉదయమును కలుగగా ఐదవ దినమాయెను. దేవుడు – వాటి వాటి జాతి ప్రకారము జీవముగలవాటిని, అనగా వాటి వాటి జాతి ప్రకారము పశువులను, పురుగులను, అడవిజంతువులను భూమి పుట్టించుగాకనియు పలికెను. ఆ ప్రకారమాయెను. దేవుడు ఆయా జాతుల ప్రకారము అడవి జంతువులను ఆయా జాతుల ప్రకారము పశువులను, ఆయా జాతుల ప్రకారము నేలను ప్రాకు ప్రతి పురుగును చేసెను. అది మంచిదని దేవుడు చూచెను. దేవుడు – మన స్వరూపమందు మనపోలికచొప్పున నరులను చేయుదము, వారు సముద్రపు చేపలను, ఆకాశపక్షులను, పశువులను సమస్త భూమిని, భూమి మీద ప్రాకు ప్రతి జంతువును ఏలుదురుగాకనియు పలికెను. దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను. స్త్రీనిగాను, పురుషునిగాను వారిని సృజించెను." (ఆది. 1:20–27).

పైన వ్రాయబడిన దేవుని వాక్య ప్రకారము దేవుడు ప్రకృతిలో ప్రతి జంతువును, పక్షిని, పురుగును దేనికదే వేరువేరుగా పుట్టించాడు. అలాగే మనిషిని వేరుగా పుట్టించాడు అని అర్ధమవుతుంది. ఇది అర్ధం చేసుకోలేని కళ్ళుండి గుడ్డివాడైన డార్విన్ తన తప్పుడు

సిద్ధాంతాన్ని ప్రపంచంమీద రుద్ది అనేకులను దేవునికి దూరం చేశాడు, చేస్తున్నాడు. జీవరాశుల డి.ఎన్.ఎ. శాస్త్రం అభివృద్ధి చెందక పూర్వమే అనగా క్రీస్తు పూర్వం 1500 సంవత్సరాల క్రితమే సుమారు నేటికి 3500 సంవత్సరాల క్రితమే దేవుడు తన పిల్లలకు ఈ విషయాన్ని చెప్పాడు. అందుకే దేవుని పిల్లలైన క్రైస్తవులు వెలిచూపుని బట్టి గాక, విశ్వాసము చేతనే అనగా శాస్త్రపరమైన ఆధారాలు లేనప్పుడే దీనిని నమ్మారు. నేటి శాస్త్రపరంగాను, దేవుని వాక్యప్రకారంగాను డార్విన్ సిద్ధాంతం తప్పని చెప్పక తప్పదు. మానవ శరీరం పరిణామ క్రమం ప్రకారం కోతి నుండి కాక మట్టినుంచి ఎలా పుట్టిందో దేవుని వాక్యప్రకారం ఆలోచిద్దాం.

ఈ భూమిమీద జీవించుచున్నానని చెప్పుచున్న ప్రతి మనిషి యొక్క శరీరం పెరగాలన్నా, అందంగా అభివృద్ధి చెందాలన్నా అతను ప్రతిరోజూ ఆహారం తప్పక తీసుకోవాలి. నరుడు తినే ప్రతిదీ ఈ నేల నుండే వచ్చింది. ఇలా నేల నుండి వచ్చిన ప్రతిదానితోనే శరీరాన్ని పోషించుచున్నాడు. అలాగే నేలమీద లభించే నీరు కావాలి, ఆ నేల మీద తిరుగాడే గాలి కావాలి. తిరగడానికి ఖాళీ ప్రదేశం లేక శూన్యం కావాలి.. అలాగే సరియైన వేడి కావాలి. పై ఐదు పదార్థాలు లేకపోతే మనిషి జీవింపలేడు ఇది ఎవ్వరూ కాదనలేని సత్యం. మానవ శరీరాన్ని, ఈ సృష్టిని పరిశీలిస్తే దీనికి – దానికి ఏదో అవినాభావ సంబంధం కన్పించుచున్నది. ఈసృష్టిని జాగ్రత్తగా గమనిస్తే ఐదు సంగతులు గోచరిస్తాయి. అవి 1. భూమి, 2. నీరు, 3. గాలి, 4. అగ్ని, 5. విశాలం లేక ఆకాశం వీటిని మనం పంచభూతములు అని అంటాం. ఒకసారి మన శరీరంలో ఉన్న వాటిని పరిశీలిద్దాం. 1. మానవ దేహంలో చాలా వరకు ఎముకలు, నరాలు, మాంసంతో కూడినది అనగా పదార్థం కనిపించుచున్నది. చివరగా ఈ పదార్థం మళ్ళీ మట్టిలో (భూమిలో) కలిసిపోతుందికూడా. 2. ఈ నరాలలో ప్రవహించే రక్తంలో చాలాభాగం ద్రవపదార్థం అనగా అందులో ఎక్కువ శాతం (71%) నీరు కనిపిస్తుంది. 3.

మన నోటిలో నుండి ఊపిరి బిగపట్టి మనలోని లేక మన గాలి ఊదుతాం. చిన్న పిల్లలకు మనలోని గాలి నింపి బుగ్గలేక బుడగలను ఇస్తాం. 4. మన శరీరమును ముట్టుకుంటే వెచ్చదనం, లేక వేడి అన్పిస్తుంది. ఒంట్లో వేడి లేదనుకోండి చల్లగా అయితే పోయాడండీ అంటాం. మన జీర్ణాశయంలోకి ఏది వెళ్ళినా కరిగిపోవాల్సిందే. అందుకే కవులంటారు కడుపులో ఆకలి మంటలు అంటారు. 5. చివరగా మన ఉదరంలో చాలా విశాలం ఉంది. ఖాళీ స్థలం అన్నమాట. అప్పుడప్పుడు పెద్దగా అవుతుంది. చిన్నది కూడా అవుతుంది. అంటే శరీరంలో అనేకచోట్ల శూన్య ప్రదేశాలు లేక ఆకాశం కూడా ఉందన్నమాట.

ఇప్పుడు చెప్పండి నరుడి శరీరం నడిచే భూగోళం లేక కదిలే సృష్టికి సాదృశ్యం కాదా. అందుకే బైబిల్‌లో దేవుడు చాలా కరెక్టుగా చెప్పాడు. నరుని దేహాన్ని లేక శరీరాన్ని మట్టితో చేశాను అని. మట్టితో బొమ్మను చేయాలంటే నీరు కావాలి గదా. అందుకే మన శరీరంలో ఎక్కువ భాగం నీరు మరియు పదార్థం లేక మట్టి ఉంది. మన శరీరాన్ని అదే పనిగా రాయండి లేక రుద్దండి, మట్టిలాంటి పదార్థం రాలిపోతుంది. అలాగే ఈ బొమ్మలోనికి వాయువును ఊదాడు. వాయువు (గాలి)తో పాటు వేడికూడా ప్రవేశించింది. ఇప్పుడు ఆలోచించండి దేవుడైన యెహోవా నరుని నేల మంటితో నిర్మించి వాని నాసికారంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను. అని ఆదికాండం 2:7లో వ్రాయించింది ఎంత సత్యమో, మానవ దేహం పంచభూతములుగా పిలువబడుచున్న సృష్టిలో నుండి తయారు అయింది కాబట్టి ఈ సృష్టినే కోరుకొంటుంది. దాని సంరక్షణలోనే జీవనం కొనసాగిస్తుంది. అందుకే సమాధి దగ్గర మన్ను వేసేటప్పుడు మంటికి మన్ను, గాలికి గాలి నీటికి నీరు ఇలా పంచభూతాలలో కలిపేస్తున్నాం అని అంటారు. కాబట్టే

మన శరీరం పైనుండి వచ్చిన ఆత్మ చెప్పిన మాటలు అస్సలు వినదు, విననివ్వదు.

అందరూ అనుకొని నమ్ముతున్నట్లు మానవశరీర నిర్మాణానికి దేవుడు వాడిన మన్ను మనకు కనిపించే ఈ భూమిపైన ఉన్న మన్ను కాదని ఎంతమందికి తెలుసు! మానవ ఆకారానికి వాడిన మట్టిని గూర్చి, దాని నిర్మాణం గూర్చి తెలుసుకుంటే మనకు మతిపోతుంది. “నా అంతరింద్రియములను నీవే కలుగజేసితివి. నా తల్లి గర్భమందు నన్ను నిర్మించిన వాడవు నీవే... భూమి యొక్క అగాధస్థలములలో విచిత్రంగా నిర్మింపబడినాడు (కీర్తన 139:13-15) మన శరీర నిర్మాణానికి కావలసిన మంటికోసం దేవుడు భూమి యొక్క అగాధస్థలానికి అనగా భూమిలోపలి భాగానికి వెళ్ళానని చెబుతున్నాడు. భూమిలోపలి భాగంలో ఎలా ఉందో తెలిస్తే భయం, ఆశ్చర్యం తప్పనిసరిగా కలుగుతుంది. ఒకసారి వెళదామా? భూమినుండి ఆహారము పుట్టును దాని లోపలిభాగము అగ్నిమయమైనట్లుండును (యోబు 28:5). భూమియొక్క లోపలి (అగాధం) భాగాలలోనికి వెళ్తే మంటల మయం అంటున్నాడు దేవుడు ఇది నిజమా? అని ప్రశ్నించే వాడు ఒకసారి శాస్త్రవేత్త దగ్గరకు వెళ్ళితీరాలి. లేదంటే నోరుమూసుకొని దేవుడు చెప్పింది నమ్మాలి. కాదంటే స్వయంగా భూమిలోపలికి వెళ్ళిరావాలి.

నేటి భూగర్భ శాస్త్ర ప్రపంచాన్ని అడిగితే భూమిలోపలికి త్రవ్వకుంటూ వెళితే సుమారు 30 కి॥మీ॥ దాటితే టెంపరేచర్ సుమారు $4000^0$ C (నాలుగువేల డిగ్రీ సెంటీగ్రేడ్) పైన ఉంటుంది అంటున్నారు. $100^0$ Cలకే నీరు ఆవిరి అయిపోతుంది. $1500^0$C దాటితే ఇనుము, ఉక్కులాంటి లోహాలు కరిగిపోతున్నాయి, అంటున్నారు. ఇంతెందుకు బావులు (నూతులు) తవ్వేవారినడగండి లోతుకెళుతున్న కొద్దీ వేడిగా ఉంటుంది అంటారు. బోరు బావులలో నుండి వచ్చేనీరు వేడిగానే ఉంటుందిగదా. అందుకే దానిలోపల

భాగం అగ్నిమయం లేదా వేడి, మంటలమయం అన్నాడు దేవుడ. ఇది చెప్పి క్రీ॥పూ॥ 2000 సం॥లు నేటికి సుమారు 4వేల సం॥లు. ఇంతకీ లోపలిభాగం లేదా అగాధస్థలంలో భూమిలోపల మరియు సముద్రాలలో అగ్ని పర్వాతాలున్నాయని, అవి పేలినపుడు దాంట్లో నుండి వచ్చే మట్టి (లావా) ఎలా ఉంటుందో జ్ఞాపకం చేసుకోండి. శాస్త్రజ్ఞులు కూడా దేవుని వాక్యానికి రుజువులు చూపటానికే ఈ ప్రయోగాలు చేస్తున్నా రనిపిస్తుంది కదూ.

నీ హస్తములు నాకు అవయవ నిర్మాణము చేసి నన్ను రూపించి యున్నను నీవు నన్ను మ్రింగివేయుచున్నావు. జిగటమన్ను గానున్న నన్ను నిర్మించితివి ఆ సంగతి జ్ఞాపకము చేసుకొనుము నీవు నన్ను మరలా మన్నుగా చేయుదువా. ఒకడు పాలు పోసినట్లు నీవు నన్ను పోసితివిగదా జున్ను గడ్డ పేరబెట్టినట్లు నీవు నన్ను పేరబెట్టితివిగదా! చర్మముతోను మాంసముతోను నీవు నన్ను కప్పితివి. ఎముకలతోను, నరములతోను నన్నుసంధించితివి. (యోబు 10:8-10). జిగట మన్నుతో ఏదైనా బొమ్మను చేయాలన్నా, లేదా ఒక కుండను చేయాలన్నా మట్టిలో జిగి ఉండాలి. బాగా మెదుగాలి గదా! అందుకే భూమి లోపలిభాగాల్లో ఉన్న జిగటమన్ను సలసలకాగుతున్న మట్టిని తీసుకొని, జున్ను గడ్డ పేరబెట్టినట్టు మన శరీర ఆకారం కోసం ఆ మంటిని పేరబెట్టాడు. ఇక ఆకార నిర్మాణాన్ని గమనిస్తే మొదట యెముకలే గదా. ఒక వస్తువు లేదా బండికి "ఛాసీస్ ఎలాగో మన శరీరానికి వెన్నెముకతోపాటున్న ఎముకల గూడు లేదా అస్థిపంజరమే ఛాసీస్, దానిమీద మాంసంముద్ద వాటిని నరాలతో సంధించి పైన చర్మంతో కప్పాడు. అందుకే మన శరీరాన్ని దేవుడు కట్టిన ఇల్లు అంటాను నేను. బైబిల్ ప్రకారంగా యెహోవా ఇల్లు కట్టించనియెడల దాని కట్టువారి ప్రయాసము వ్యర్థమే... (కీర్తన 127:1,2). ఈ ఇంటి నిర్మాణక్రమాన్ని చూస్తే ఎవరికైనా ఒళ్ళు జలదరించి భయం, ఆశ్చర్యం

కలుగకమానదు. ఇది ఏ శాస్త్రానికి అందనిది, ఏ ఆర్కిటెక్, ఇంజనీర్ కట్టలేనిది అనడంలో అతిశయోక్తి లేదు. మానవ ఆకారాన్ని కాని వాటి భాగాలను గాని ఈసృష్టిలోని ఏనరుడు, ఎన్నటికి తయారు చేయలేడు. మరమనిషిని చేయగలడు అంతే.

ఈరోజుల్లో అనేకమంది తమ కలరు (రంగు) చూసి మురిసిపోతున్నారు. పెండ్లి చేసుకోవాలనుకొనే ప్రతియువకుడు రంగు ఫెయిర్ అనగా తెల్లగా ఉండాలి అని ప్రత్యేకంగా కోరుతున్నారు. దానిని బట్టి నల్లరంగులో ఉన్న వారు చాలామంది బాధపడుతున్నట్లుగా తెలుస్తుంది. మన శరీరం మనది కాదు. మనం ఈ రంగు కావాలని కోరలేదు. దేవుడే తను కట్టుకొన్న ఇంటికి పైకప్పు (చర్మము)కు ఆయన ఇష్టం వచ్చిన రేకులు వాడాడు. కొందరికి డాంబరు (నలుపు), కొందరికి ఆస్బెస్టాస్, లేదా తెలుపు రేకులు వాడాడు. తెల్లగా ఉన్నవారు మురిసిపోయి గర్వపడడం తప్పే, నల్లగా ఉన్నవారు బాధపడడం తప్పే అది దేవుని ఇష్టం అని ఆలోచిస్తే ఆనందంగా ఉంటుంది. దేవలోకం అనగా పరలోకం వెళ్ళే అక్షయ శరీరం మాత్రం అందరికి ఒకేరీతిగా ఉంటుంది. కలర్‌కోసం ప్రాకులాడేవారు కళ్ళుతెరుచుకోండి. హృదయం, దాని ఆలోచన తెల్లగుండాలి. కలర్ కాదు క్యారెక్టర్ ముఖ్యం.

ఇక్కడ మరో అద్భుతమైన సంగతి చెబుతాను మన శరీరంలో ఎన్నో మూలకాలున్నాయి. ఇనుము, భాస్వరం, జింక్, సోడియం, కాల్షియం ఇలా అన్ని రకాలున్నాయి. ఇవి భూమిలోపల మరుగుతున్న మట్టిలో కలిసిపోయాయి గనుకనే ఈరోజు మన శరీరానికి వాటి అవసరం ఉంది. ఏ మూలకం తగ్గినా వాటిని విటమిన్లు లేదా టాబ్లెట్లరూపంలో మనం తీసుకుంటున్నాం. దేవుడు స్వతహాగా మాంసం, పప్పులు, ఆకుకూరలు, కూరగాయల్లో కూడా వీటిని ఉంచి మన దేహాన్ని కాపాడుతున్నాడు, మనల్ని కాపాడుకోమంటున్నాడు. రోగాలు, మందులు, తలనొప్పి, కోరికలు,

వాటిని అణుచుకోవడం, పెంచుకోవడం ఇలా ఎన్నో అద్భుతాలకు నిలయం ఈ మానవాకార నిర్మాణం. ఇంత కష్టపడి కట్టిన ఈ దేహమును దేవాలయముగా దేవుడు మనకివ్వడంలో ఏదోకారణం ఉండి ఉండాలి కదా.

ఈ సృష్టిని, అందులోని జీవరాశిని దేవుడు తనమాట ద్వారా అనగా కలుగునుగాక, పుట్టించును గాక అని మాట పలికి పుట్టించాడు. అయితే మానవ దేహం యొక్క నిర్మాణం దగ్గరకొచ్చే సరికి ఆదాము ఆకారం కలుగునుగాక లేక శరీరాన్ని నేల పుట్టించును / తయారు చేయును గాక అనలేదు చూడండి. పోనీ నేల నుండి మట్టిని తీసి బొమ్మను నిర్మించినాక కూడా "బొమ్మా" లేచిపో అనలేదు. ఆ బొమ్మ ముక్కు రంధ్రముల గుండా తనలోని జీవాన్ని / తనైన ఆత్మను ప్రవేశపెట్టాడు. అందుకే మనం కుమారులం. మన పుట్టుక ఎంత ఆశ్చర్యం, అద్భుతం, అనన్య సామాన్యమైనదో ఆలోచించండి. మానవుడి ఆకారం నిర్మాణం మీద, మానవ జన్మ మీద దేవుడు ఇంతటి ప్రత్యేకతను, మక్కువను చూపటంలో ఆ తండ్రి ప్రేమ, మమతాను రాగాలు మనం అందుకోలేక పోవుచున్నాము. అందుకే ఆయన పూజ్యనీయుడు, అద్వితీయుడు, మహోన్నతుడైన మహాదేవుడు. ఆయన తన ప్రజలకు విమోచనము కలుగజేయువాడు తన నిబంధన ఆయన నిత్యముగా ఉండ నిర్ణయించువాడు. ఆయన నామము పరిశుద్ధమైనది పూజింపదగినది. (కీర్తన 111:9) యెహోవా మహత్మ్యముగలవాడు ఆయన అధికస్తోత్రము పొందతగినవాడు సమస్త దేవతలకంటెను ఆయన పూజ్యనీయుడు (కీర్తన 96:4). ఇశ్రాయేలూ వినుము. మన దేవుడైన యెహోవా అద్వితీయుడగు యెహోవా (ద్వితీ.కాం. 6:4). వారిని చూచి జడియవద్దు; నీ దేవుడైన యెహోవా నీ మధ్య నున్నాడు, ఆయన భయంకరుడైన మహాదేవుడు (ద్వితీ.కాం 7:21). యెహోవా, ప్రభువా సైన్యములకధిపతియగు యెహోవా అనుపేరు వహించువాడా, శూరుడా, మహాదేవా, నీ యధికబలముచేతను చాచిన బాహువు

చేతను భూమ్యాకాశములను సృజించితివి, నీకు అసాధ్యమైనదేదియు లేదు (యిర్మియా 32:17).

ఎంతో అందమైనదిగా కనపడి మనల్ని మురిపిస్తూ మైమరిపిస్తున్న ఈ సృష్టిని దేవుడు తన మాటచేత లేక వాక్యం ద్వారా నిర్మించెను లేక సృష్టించెను అని మన సత్యవేదంలో వ్రాయించాడు. ప్రపంచములు దేవుని వాక్యమువలన నిర్మాణమైనవనియు, అందునుబట్టి దృశ్యమైనది కనబడెడు పదార్థములచే నిర్మింప బడలేదనియు విశ్వాసము చేత గ్రహించుకొనుచున్నాము (ఆది.కా. 1:1, హెబ్రీ 11:3). యెహోవా ఆజ్ఞ ఇయ్యగా అవి పుట్టెను అవి యెహోవా నామమును స్తుతించును గాక (కీర్తన 148:5). అనగా దేవుని మాట వలన శబ్దం పుట్టగా శబ్దము వలన శక్తి పుట్టగా శక్తి పదార్థముగా మారినది అని అర్థం. నేటి అధునాతన శాస్త్రం గూడా శబ్దం లేక ప్రేలుడు (బిగ్‌బాంగ్) వలననే సృష్టి నిర్మాణం జరిగినదని చెప్పినది. పదార్థములోని అణువును విడగొడితే వచ్చేది శక్తి అని ఈనాడు అందరికి తెలుసు. ఈ మానవుడ్ని ఈ లోకానికి పంపడానికి వాడికో శరీరాన్ని ఇవ్వడానికి, దేవుడు ఇంతగా నరుల యెడల ఆసక్తిని కనబరచడానికి మూలం ఏమిటో, ఏకారణం వలన సృష్టిని కలుగజేసి, అందులోంచి దేహాన్ని తయారుచేసి, ఆ దేహంలోని నాసికారంధ్రముల గుండా ఆత్మయైన దేవుడు ప్రవేశించి జీవాత్మగా మారి నరుడిగా ఎందుకు అవతారమెత్తినాడో ఇప్పుడు ఆలోచిద్దాం, పరిశీలిద్ధాం.

# మానవ జన్మకు మూలకారణం

ఆనాటి నుండి నేటికి ఎంతో మంది ఈలోకంలో పుట్టారు, పెరిగినారు, అలాగే కనబడకుండాపోయారు. ఇప్పటికి ఎంతోమంది పుడుతున్నారు, జీవించుచున్నారు ఆ తర్వాత మరణిస్తున్నారు. ఈ కార్యక్రమం అంతా ఈ లోకం ఉన్నంత కాలం జరుగుతూనే ఉంటుంది. అసలెందుకు మనం పుడుతున్నాం అని ఆలోచిస్తే లేక ఎవరినైనా అడగండి రకరకాలుగా జవాబిస్తారు. సృష్టి పరిణామ క్రమం అని కొందరు, దేవుడి ఇష్టం, ఆ భగవంతుడి లీల, ఆ సర్వేశ్వరుడి దయ అని మరికొందరు చాలా విధాలుగా జవాబు ఇస్తారు గాని ఎందుకు అనే దానికి సమాధానం కరెక్టుగా చెప్పలేకపోవుచున్నారు. ఇది తెలియకనే మనిషిలో స్వార్థం, అహం, భోగలాలస పెరిగి నాటి నుండి నేటి వరకు సమాజంలో అల్లర్లు, దోపిడీలు, హత్యలు జరుగుతున్నాయి. మానవ నాశనంతోపాటు సృష్టి వినాశనం కూడా జరుగుచున్నది. మన మట్టి బుర్రకు ఎన్నటికి ఈ సమాధానం అందదనే దేవుడు

తన మాటలద్వారా మనకు ముందే తెలియజేసాడు. చాలామంది బైబిల్‌ను ఒక మత పుస్తకంగానో లేక ఎవరో తెలివైన మనుషులు వ్రాసిన మామూలు కథల పుస్తకంగానో ఆలోచించి కొట్టిపారేస్తున్నారు గానీ ఎంతటి అధునాతన మనస్థత్వానికైనా అందని మహాజ్ఞానం ఇందులో దాగిఉన్నదని, మానవుడి మెదడు ఆలోచించలేని, లేక సమాధానం చెప్పలేనివాటికి బైబిల్ తప్పనిసరిగా సమాధానం ఇస్తుందని ఎంతమందికి తెలుసు. మన బ్రతుకు పుస్తకాన్ని వదిలి, ప్రకృతి సంబంధియైన మనిషి వ్రాసిన పుస్తకాలనో వెదికితే ప్రయోజనం ఉండదు. అందుకే బైబిల్ అంతా వెదికితే ఒకచోట మనకు దీనికి సమాధానం దొరుకుతుంది. "ఎట్లనగా తన ప్రియునియందు (క్రీస్తునందు) తాను (దేవుడు) ఉచితముగా మనకనుగ్రహించిన తన కృపామహిమకు కీర్తికలుగునట్లు, తన చిత్తప్రకారమైన దయాసంకల్పం చొప్పున, యేసుక్రీస్తు ద్వారా తనకు (పిల్లలనుగా), కుమారులనుగా స్వీకరించుటకై, మనలను ముందుగా తన (దేవుని) కోసము నిర్ణయించుకొని, మనము తన యెదుట పరిశుద్ధులమును నిర్దోషులమునైయుండవలెనని జగత్తుపునాది వేయబడకమునుపే, ప్రేమ చేత ఆయన (దేవుడు) క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను" (ఎఫెసి. 1:4-6).

ఈరోజు ఈలోకంలో మనిషి పుట్టిస్తున్న లేదా తయారుచేస్తున్న ప్రతి దానికి ఒక కారణం ఉండి తీరుతుంది. ఇంట్లోంచి బజారు వరకు వెళ్ళాలన్నా ఏదోఒకకారణం అవసరం లేదా కోరిక ఉంటుందిగదా. కాలిన నడిచే మనిషి సైకిలు, మోటారు సైకిలు, కారు, విమానమును ఏది సృష్టించినా కారణం ఉంది. అలాగే మానవుని సృష్టి వెనుకాల ఏదో బలమైన కారణం ఉండి తీరాలి. మహోన్నతుడైన దేవుడు అకారణంగా ఏ పని చేయడు.

పై వచనములను ఆలోచించినట్లయితే మనం ఈ లోకంలో పుట్టకమునుపే, మనం నిత్యం చూస్తూ, అనుభవిస్తున్న ఈ అందమైన

ప్రకృతి లేక జగత్తు కలుగక మునుపే దేవునికి ఒక విచిత్రమైన కోరిక కలిగినట్లుగా అగుపడుచున్నది. సృష్టి, అందులో మనం పుట్టక మునుపే దేవునికి ఇంకా చాలామంది పిల్లలు కావాలని వారందరు తన వద్ద అంతకు మునుపే పుట్టియున్న తన ప్రియ కుమారుడైన క్రీస్తు ద్వారానే తన యొద్దకు రావాలని ఆలోచించి నిర్ణయం తీసుకొన్నట్లుగా కనబడుచున్నది. ఇక్కడ కొద్దిసేపు మనం ఆలోచిద్దాం. ఈ భూమి మీద పుట్టిన ప్రతి వారికి ఒక ప్రశ్నవేస్తాను. మనందరం ఫలానా దేశం / ఊరిలో, ఫలానా కుటుంబంలో, ఫలానా అనగా ఆడవారిగానో, మగవారిగానో పుట్టించమని కోరుకొన్నామా? మన ఇష్ట ప్రకారంగానో, లేక మన తల్లిదండ్రుల ఇష్టప్రకారంగానో ఆడ, మగ వారిగా పుట్టుచున్నామా? చాలావరకు మన కోరికలకు విరుద్ధంగానే జరుగుతున్నాయి. ఆడపిల్లలు కావాలంటే అందరూ మగ పిల్లలుపుడతారు. మగవాడు కావాలంటే అందరూ ఆడపిల్లలే పుడతారు. ఇది మనఖర్మగాదు. గ్రహచారం అంతకన్నా కాదు. దేవునికి ఎవరు కావాలనుకొంటే వారు మనకు పుడతారు. ఆడవారి అమ్మసాలో, అమ్మమ్మసాలో కాదు. ఎక్కడా సమాధానం దొరక్కపోతే అప్పుడు అంటాం అంతా మన చేతుల్లో ఏముంది బ్రదర్ ఆ పరమాత్ముని దయ, ఇష్టం అంటాం.

ఇంకా చాలామంది నా పిల్లలు, నేను కన్నాను, నా ఇష్టం అనీ అంటారు. ఇంతకూ అసలు విషయం ఏమిటి? నా కుమారుడు లేక కుమార్తె కూడా దేవుని పిల్లలే కదా. నేను నాభార్య, నా తల్లిదండ్రులు, అత్తమామలు, బంధుమిత్రులు, ఈ సృష్టిలో పుడుతున్న అందరూ దేవునికి పిల్లలు కాదా? అంటే మనమంతా దేవునికి పిల్లలం, ఒకరికొకరం సోదరులం, అయితే తల్లి తండ్రి, భార్య, చెల్లి, కుమారుడు, అన్న ఇలా ఆయా పాత్రలుగా జీవించుచున్నాం. దేవుడు తనకు పిల్లలుగానే మనల్ని కన్నాడు. అందుకే దేవుని వాక్యంలో గర్భఫలం దేవుడిచ్చు బహుమానం అని వ్రాయబడిఉంది. మనకు

మన పిల్లలు బహుమానంగా ఇవ్వబడుతున్నారు అంటే వారిని ఇంతకుమునుపే ఒకరు (దేవుడే) తయారుచేసి, లేక కని లేదా కొని మనకు బహుమానంగా ఇస్తున్నారన్నమాట. అలాగే ఈ బహుమానాన్ని దేవుడు తప్ప ఈలోకంలో ఇంకెవ్వరూ తయారు చేయలేరని (ఇవ్వలేరని) వాక్యం చెబుతుంది. కాబట్టే "యెహోవా ఇల్లు కట్టించని యెడల దాని కట్టువారి ప్రయాసం వ్యర్థమే." (కీర్తనలు 127:1-3). అను మాట అక్షరసత్యం.

కొంతమంది తమకు శరీరాన్ని తమ తల్లిదండ్రులు ఇచ్చారనో తామే ఇష్టపడి తెచ్చుకొన్నామనో భ్రమపడుతున్నారు. లేక తమ పిల్లలకు తామే శరీరాలను ఇచ్చాం అని గర్వపడుతున్నారు. కాని దేవుడు అంటున్నాడు నీవు కేవలం వట్టి (ఎండిపోయిన) గింజనే విత్తుచున్నావుగాని పుట్టబోవు శరీరాన్ని విత్తుటలేదు. నీవు విత్తుదానిని చూడగా అది గోధుమగింజయైనను సరే, మరి ఏ గింజయైనను సరే, వట్టి గింజనే విత్తుచున్నావు గాని పుట్టబోవు శరీరమును విత్తుటలేదు. అయితే దేవుడే తన చిత్తప్రకారము నీవు విత్తిన దానికి శరీరము ఇచ్చును. మరియు ప్రతి విత్తనమునకును దాని దాని శరీరము ఇచ్చుచున్నాడు. మాంసమంతయూ ఒక విధమైనది కాదు. మనుష్య మాంసము వేరు, మృగమాంసము వేరు, పక్షిమాంసము వేరు, చేప మాంసము వేరు (1కొరింథీ 15:37-39). దేవుని సంకల్పం ప్రకారం భార్యా, భర్తలు కలుసుకొని జీవకణాలు విత్తడమే వారి డ్యూటీ. అది ఫలించి కొన్ని వేల కణాలుగా అభివృద్ధి చెంది, ఆడ శరీరమా? మగ శరీరమా అని నిర్ణయించేది మన చేతుల్లో లేదు. దేవునికి ఆడపిల్ల కావాలంటే మనకు ఆడపిల్ల పుడుతుంది. ఆయనకు కుమారుడు కావాలనుకుంటే మనకు మగపిల్లవాడు పుడతాడు. ఎందుకంటే బహుమానం ఇచ్చేవారి ఇష్టాన్ని బట్టి ఉంటుందే గాని మన భక్తికి మెచ్చి దానంగా ఇచ్చేది కాదు సంతానం. వారికి ఏరూపాన్ని ఇవ్వాలో దేవుడి చేతుల్లో ఉన్నది. ఇది మన

ఆలోచనకు గాని, మనం సృష్టించిన సైన్సుకుగాని ఎన్నటికి అందనిది.

ఇంత గొప్ప నిర్మాణకుడు ఈ సృష్టిలో మనకు మరొకడు కానరాడు. ఈ లోకంలో ఒక ఇంజనీరు కట్టిన అనేక ఇండ్లకు ఒకదానికి ఒకటికి పోలికలుంటాయి. కాని, దేవుడు కట్టిన దేహమనే దేవాలయాలు మాత్రం అచ్చు ఒకేలాగా అనిపించినా ఏ ఇద్దరూ ఒకేలాగుండరు. ఆఖరున కవల పిల్లలైనా కొద్దిగా తేడాలుంటాయి. ఇంతెందుకు ఎన్ని కోట్ల మంది వేలు ముద్రలు పరిశీలించినా అన్ని వేరువేరుగానే ఉంటాయి. కాని ఒకిరి వేలు ముద్ర ఇంకొకరి ముద్రకు సరిపోదు (యోబు 37:7). ఆయన్నుండి విడిపోయిన లేక ఆయన కన్న ఆత్మలకు ఆయనే శరీరాన్ని ఇచ్చుచున్నాడు. మనం ఆ శరీరాలకు రక్తమాంసాలను మాత్రమే ఇచ్చుచున్నాం. ఈ రక్త మాంసాలు కూడా మనకు ఆయన ఇచ్చాడు గదా.

అందుకే ఎంతో గొప్ప ప్లాను (సంకల్పం) ప్రకారం మనల్ని ఈ లోకంలో ఎందుకు కంటున్నాడో తెలుసా? మన కులానికో, బలానికో, వంశానికో, దేశానికో పేరు తేవడానికి కాదు కేవలం ఆయన కృపా మహిమకు కీర్తి కలగాలనియు, ఆయన ప్రియ కుమారుడైన యేసు క్రీస్తు లాగా మనందరం నిర్దోషులుగాను, పరిశుద్ధులుగాను జీవించి ఆ యేసుక్రీస్తు ద్వారానే తిరిగి ఆయన యొద్దకు చేరాలనే కారణాన్ని బట్టే మనందరం ఒకరి తర్వాత మరొకరం ఈ లోకంలో రంగ ప్రవేశం చేయుచున్నాం. అంతేకాని మన కోరికలను తీర్చుకొనుటకు కాదు. అందుకే దేవుని కోరికను తీర్చుటకు మనం పుట్టామని, మనకు పిల్లలు పుడుతున్నారని యెరిగి ఆయన కన్న లేక ఆయన నుండి విడిపోయిన, ఆయన పిల్లలనబడే ఆత్మలకు రక్తమాంసాలనిచ్చి ఆయనకోసం పెంచాలి. ఆ కారణాన్ని బట్టే మన పుట్టుక, ఈ సృష్టి పుట్టుక జరిగిందని అర్థమవుచున్నది. అంటే మన జన్మ వెనుకాల ఇంతటి బలమైన కారణం ఉందన్నమాట. ఊరికే ఎవరు కంటారో ఆలోచించండి.

ఈ కారణం తెలియని చాలామంది నా జీవితం నా ఇష్టం వచ్చినట్లు చేసుకొంటాననో, ఇది నా శరీరం దీనిని నా ఇష్టం వచ్చినట్లు కాల్చుకొంటాను, ఉరేసుకొంటాననో, చంపుకొంటాను అని అంటున్నారు, అలాగే చేయుచున్నారు కూడా. నిజంగా మనందరం ఎంతటి గట్టిపోటీని తట్టుకొని ఈ లోకంలో ప్రవేశిస్తున్నామో తెలుసుకొంటే ఇకముందుకైనా అలాంటిపోటీనే తట్టుకొని వచ్చిన ఓ శరీరాన్ని వరకట్నం కోసం కాల్చకుండా, ఆస్తికోసమో, అంతస్తుకోసమో, పదవి కోసమో, కుల, మత, ప్రాంత, భాషా, వర్గ విబేధాలకోసమో ఇంకా ఇలాంటి మరెన్నో పనికిమాలిన కోరికల కోసమో, క్షణికావేశంలో మట్టిపాలు చేయకుండా ఉంటాము. మనం ఎంతటి పోటీతో ఈలోకంలోకి వచ్చామో ఆలోచించటానికి ఒకసారి సృష్టిలో మనకళ్ళ ముందు జరుగుచున్న వాస్తవాన్ని పరిశీలిద్దాం. ఒక మామిడి చెట్టును పూతపూసే కాలంలో చూసినట్లు అయితే ప్రతికొమ్మా, రెమ్మా కోటాను కోట్ల పూవులతో నిండిపోయి అసలు ఆకులు ఉన్నాయా? అనిపించేంతగా ఉంటుంది. కాని పూచిన పూవులన్ని పిందెలుగా మారుతాయా? మారవుగదా! ఎందుకంటే పరపరాగ సంపర్కం జరుగలేదు గదా! అలా జరిగినపుడే కొన్ని కోట్లలో పూచిన పూవులు కొన్ని వేలలో పిందెలు అవుతాయి అవి అన్ని అయినా కాయలుగా మారుతాయా? లేదే ప్రకృతిలో జరిగే ప్రళయ భీకరాలకు, పక్షుల తాకిడికి తట్టుకొని కొన్ని వందలలో కాయలుగా మారుతాయి. ఆకాయలలో కొన్ని మాత్రమే పండ్లుగా మారి తమ బ్రతుకును సార్థకం చేసుకొంటాయి.

చూశారా ఎంతటి గట్టి పోటీని తట్టుకొని కొన్నిపూవులే పండ్లుగా ఎలా మారాయో అలాగే మన తల్లిదండ్రులు లేక ఒక స్త్రీ - ఒక పురుషుడు కల్సుకొన్నప్పుడు మన తండ్రి నుండి కొన్ని కోటానుకోట్ల జీవకణాలు, మన తల్లినుండి ఒక అండము (నెలకు ఒకసారే) కూడా విడుదల అవుతుంది. అయితే వాళ్ళిద్దరు

కలుసుకొన్న ప్రతిసారీ గర్భధారణ జరగటం లేదు. కొన్ని నెలలు, సంవత్సరాలు పట్టవచ్చు అంటే కొన్ని కోట్ల జీవకణాలు (వీర్యకణాలు) నిర్వీర్యమైపోయి నేలరాలి పోతున్నాయి. ఎందుకంటే అన్ని కణాలలో మనం అనగా దేవుని ఆత్మ ఉంటే ఎంతోమంది ఆపరేషన్ చేసుకోకపోయినా ఒక్కరే ఎందుకు పుడుతున్నారు. కొందరికి అసలెందుకు పుట్టడంలేదు. మరియు టెస్ట్‌ట్యూబ్ బేబీగాని, క్లోనింగ్ బేబిల పుట్టుకలో కూడా ఎన్నో కణాలు రూపాలు దిద్దుకొనుటలేదేంటి. దేవుడి సంకల్పంలో, దేవుని లెక్కలో ఉన్నరోజుననే మనం పుడుతున్నాం. అలా పుట్టే వానికోసమే పనులున్నాయి (ఎఫెసి 2:10), పుట్టనివాడు ఉండడు కదా! దేవుని ఆలోచనలో / ప్రణాళికలో ఉన్నాడంటే పుట్టి తీరుతాడు.

అయితే అలావారు (స్త్రీ–పురుషులు) కలుసుకుంటూ ఉండగా ఎప్పుడో ఒకసారి మాత్రమే అనగా మనం కావాలని దేవుడనుకొంటేనే మన తండ్రి నుండి వచ్చిన మగకణం, తల్లినుండి వచ్చిన (ఆడకణం) అండంలో కలిసిపోయి తల్లి అండాశయంలో పిండంగా మారిపోతాము. (కీర్తన 139:16).

ఈమధ్యన కొందరు తమదే దైవజ్ఞానం అనుకొని తల్లిగర్భంలోకెళ్ళి ఫలదీకరణం చెందని జీవకణాలు (శుక్ల–వీర్యకణాలు) నేలరాలిపోతే వారందరూ పరలోకం పోతారని తప్పుగా బోధిస్తున్నారు. అది ఆత్మజ్ఞానం కాదు అజ్ఞానం. ఎందుకంటే భార్యాభర్తలు లేదా పురుషుడు స్త్రీతో కలువక పోయినా, నిద్రలోనో మరే కారణం చేతనో రోజుకు ఎన్నోసార్లు పురుషుడి నుండి జీవకణాలు నేలరాలిపోతాయి. వాటి లెక్క కోటానుకోట్లు అంటుంది శాస్త్రం. వాళ్ళంతా మనుషులు కారు. కేవలం జీవకణాలు మాత్రమే తండ్రి నుంచి వచ్చిన జీవకణం. స్త్రీ గర్భంలో అండంతో కలిసి ఫలదీకరణం చెంది పిండముగా మారితేనే మనిషి. ఆ పిండము

నేలజారిపోతే వారు పరలోకం పోతారు (యోబు 11,16) పిండముగా ఉన్నపుడే మనం ఉంటాం గనుక దేవుని కన్నులు మనల్ని చూస్తున్నాయి (కీర్తన 139:16). అందుకే ప్రతి కణంలో ఆత్మ ఉండదు. దేవుడు మనం కావాలని అనుకొన్న సమయంలోనే తండ్రి ఆత్మ నుండి ఒక భాగం విడిపోయి తల్లి గర్భంలోని అండముతో ఫలదీకరణం చెందుతుంది. అండం వద్దకు వెళ్ళాలని ఎన్నో కణాలు పోటీపడ్డా అందులో జీవింపజేయగల ఆత్మ ఉన్న కణమే అండంతో కలుస్తుంది. ఇది దైవజ్ఞానాన్ని సపోర్టు చేస్తున్న శాస్త్రం కూడా చెబుతుందని మరచిపోవద్దు. అలా గర్భంలో పడ్డ ప్రతి పిండం మనిషిగా బయటికి వస్తుందా? లేదు ఎన్నో కారణాల వల్ల మధ్యలోనే గర్భస్రావం జరిగిపోతుంది. పోనీ ఆ పోటీలో కూడా నెగ్గి బయటకి వస్తే ఎన్నో రకాల రోగాలతో చిన్నపుడే పోతాం. ఈ జీవన పోరాటాన్ని తట్టుకొని పెరిగి పెద్దగా అయిన (అంటే కాయ పండుగా మారినట్లు) నీకు మనకు ఆ జీవితాన్ని ప్రసాదించిన ఈలోకపు తండ్రికి మరియు ఆ పరలోకపు తండ్రికి ఎంతవరకు ఉపయోగపడుతున్నామనేది అసలు ప్రశ్న.

ఈలాంటి గట్టిపోటీతోనే లోకంలో మనతోపాటు ఎంతోమంది (ప్రతివారు) పుడుతున్నారు తప్ప మామూలుగా మాత్రం కాదని మనకు తెల్సిపోయింది. అంటే మనకన్నా ముందు లేదా వెనుకాల కొందరు పోయి ఉంటారుగదా. అలాగే భూమిమీద కొచ్చాక కూడా మన అన్నదమ్ములు పోలేదా? అంతటి గట్టిపోటీలోంచి వచ్చిన మనలాంటి వారితో మళ్ళీపోటీ పడి దేవుని పని అనగా దేవుని కోరికను సఫలం చేయటానికే మనల్ని దేవుడు కావాలని కంటున్నాడని అర్థం అవుతోంది కదూ! ఇందుకు దేవునికి స్తోత్రము!

ఆలోచించండి సహోదరులారా! ఇక్కడ ఇంకొకమాట ఈ లోకంలో జన్మించుచున్న ఆత్మలకు లింగబేధం (ఆడా–మగ తేడా)

లేదు. ఎందుకంటే ఈ ఆత్మ అన్నింటికి మూలమైన పరమాత్మది ఏ 'లింగం' అయితే మనకు అదేవర్తిస్తుంది. శరీరాలకే లింగభేదం ఉన్నది. ప్రస్తుత కాలంలో దేవుడు పురుషలింగంగా పిలువబడుచున్నాడు మరియు మనకర్ధమయ్యే భాషలో 'తండ్రి' అని చెప్పుకొనుచున్నాడు, కావున తనకు పిల్లలు లేదా కుమారులు కావాలి అనికోరుకొన్నాడు. అందుకే చాలాచోట్ల బైబిల్‌లో దేవుడు నా కుమారుడా! అని సంభోదిస్తాడు. యేసు క్రీస్తు ఆ తర్వాత వచ్చిన పరిశుద్ధాత్ముడైతే సహోదరులారా అని సంభోదించాడు. ఆత్మీయంగా అందరం కుమారులం గనుక అలా వ్రాయించాడు, పలికాడు. అంతేకాని సోదరీమణులను పిలువలేదని అనుకోకూడదు. ఆడశరీరంలో ఉన్నా ఆ ఆత్మ కుమారుడే అని మరువవద్దు. కేవలం వ్యాకరణం కోసం కుమారులు అని వ్రాశారు (కీర్తన 127:3).

తనకు శరీరాన్ని ఇవ్వటంలో గూడా దేవుని కోరికను తెల్సుకొన్న యేసు క్రీస్తు ఈ లోకంలో నరుడుగా ప్రవేశిస్తున్నపుడు ఇలా అంటున్నాడు. "బలియు అర్పణయు నీవు కోరలేదు గాని నాకొక శరీరమును అమర్చితివి పూర్ణహోమములు, పాపపరిహారార్ధబలులును నీ కిష్టమైనవి కావు. అప్పుడు నేను (యేసు అను నేను) – గ్రంథపు చుట్టలో నన్నుగూర్చి వ్రాయబడిన ప్రకారము, దేవా! నీ చిత్తము నెరవేర్చుటకు ఇదిగో నేను వచ్చియున్నానంటిని" (హెబ్రీ 10:5–7, కీర్తన 40:6–8). కాబట్టి ఈ సృష్టిపుట్టుకకు అందులో మనం పుట్టుకకు కారణమైన యేసుక్రీస్తు ఈ లోకంలోకి నరుడిగా వచ్చినపుడు ఆయన ఇష్టానుసారంగా జీవించుటకు కాక ఆయనకొక శరీరాన్ని నిర్మించి ఇచ్చిన దేవుని చిత్తాన్ని అనగా అంతకుముందే పాత నిబంధనలో లేక ధర్మశాస్త్రములోని లేఖనాలను, ప్రవచనాలను నెరవేర్చి దేవునిని మహిమపర్చుటకే నేను ఈ లోకానికి వచ్చానని అంటున్నాడు. అలా అనటమేకాదు అన్నంతపనిని అక్షరాల నెరవేర్చి తిరిగి తండ్రి దగ్గరకు వెళ్ళేటపుడు – తండ్రీ లోకము పుట్టక

మునుపు నీ యొద్ద నాకు ఏ మహిమ ఉండెనో (దేవుడైన వాక్యముగా, యోహాను 1:1-3) ఆ మహిమతో ఇపుడు నన్ను మళ్ళీ మహిమపర్చుము అని కూడా అన్నాడు. చేయుటకు నీవు నాకిచ్చిన పని నేను సంపూర్ణముగా నెరవేర్చి భూమిమీద నిన్ను మహిమపరిచితిని. తండ్రీ, లోకము పుట్టకమునుపు నీయొద్ద నాకు ఏమహిమయుండెనో ఆమహిమతో నన్ను ఇప్పుడు నీయొద్ద మహిమపరుచుము (యోహాను 17:4-5). ఇలా యేసు ప్రభువు తన జన్మకు గల కారణాన్ని తెలుసుకొని దానిని పూర్తిచేశాడు. అయితే ఆయన పుట్టుకకు మాత్రమే కారణం ఉందా? ఆయనకులాగే మన పుట్టుకకు ముందే అదే గ్రంథంలో మన గూర్చి కూడా ఏమైనా వ్రాయబడిందా? ఆలోచిద్దాం. బైబిల్‌లోని ఒక వచనాన్ని పరిశోదిద్దాం. - "మరియు వాటియందు (అనగా సత్యసంబంధమైన క్రియలయందు) మనము నడుచుకొనవలెనని దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్‌క్రియలు చేయుటకై, మనము (మనుషులంతా) క్రీస్తుయేసు నందు సృష్టింపబడినవారమై ఆయన చేసిన పనియై ఉన్నాం (ఎఫెసి 2:10)."

బైబిల్ గ్రంథములోని పైలేఖన భాగాన్ని మనం జాగ్రత్తగా పరిశీలించినపుడు దేవుడు మనం ఈ లోకంలో పుట్టకమునుపే మన కోసం అనగా మనం చేయుటకై కొన్ని క్రియలు ముందుగానే సిద్ధపరచి వ్రాయించి ఉన్నాడని అర్థం అగుచున్నది. ఎఫెసీ 1:4-12లో మన జన్మకు కారణాన్ని చెప్పిన దేవుడు మరోసారి వెంటనే అదే ఎఫెసీ 2:10లో మళ్ళీగట్టిగా చెబుతున్నాడంటే మన జన్మ వెనుకాల కూడా బలమైన కారణం ఉందన్నమాట. ఏమిటా కారణం అంటే మనందరము నిర్దోషులుగాను, పరిశుద్ధులమును అయి ఉండాలి అంటే సత్ క్రియలు చేయాలి, అని వ్రాయించాడు. సత్‌క్రియలు అనగానే చాలామంది మంచి క్రియలు అని ఠక్కున చెప్పేస్తారు. ఒకరకంగా మంచి క్రియలు అనుట లోకజ్ఞానం ప్రకారం

సరిపోతుందేమోగాని దేవుని జ్ఞానానుసారంగా మాత్రం సరిపోదు. ఎందుచేతనంటే మంచి క్రియలు అనే వాటికి అందరికి ఆమోదయోగ్యమైన కొలబద్ద కావాలి. లేకుంటే నాకు మంచిగా అనిపించింది నా వారికే చెడుగా అనిపిస్తుంది అలాగే అవతలి వారికి మంచిగా అనిపించింది మనకు చెడుగా కనిపిస్తుంది. అందరికి మంచిగా అనిపించాలంటే దేవుని జ్ఞానంలోనికి వెళ్ళి ఆప్రకారం ఆలోచిస్తేనే అందరికి నచ్చుతుంది. సత్క్రియలు అంటే సత్యసంబంధమైన క్రియలు అని అర్ధమిచ్చుచున్నది గదా. సత్యమంటే? దేవుని వాక్యం మాత్రమే సత్యము "సత్యమందు వారిని ప్రతిష్ఠ చేయుము; నీ వాక్యమే సత్యము (యోహాను 17:17). అందుకే యేసయ్య "నేనే సత్యమును" అన్నాడు (యోహాను 14:6). అనగా వాక్యసంబంధమైన క్రియలు లేక వాక్యములో ముందుగానే వ్రాయబడిన క్రియలు చేయుటకే మనం వచ్చాము అని అర్ధమైనది. మనకోసమో, మన భార్యాపిల్లలకోసమో, మన కుటుంబం కోసమో లేక మన కులం, మతం, ప్రాంతం లేదా దేశం కోసం మాత్రమే కాక వీటన్నింటికి కారణమైన దేవుని సంకల్పం నెరవేర్చుట కొరకే ఈ లోకానికి వచ్చియున్నాం. ఇది తెలియని వారు ప్రియుడు ప్రియురాలి కోసమని లేదా లోక సంబంధమైన ఉన్నత పదవులను అధిష్టించడమే నా జీవితాశయం, జీవిత పరమార్ధం అని చెబుతున్నారు. ఒకసారి ఈ విషయాలను ఆలోచించండి. అందుకై దేవుడు తన జ్ఞానంలో మరోచోట కూడా వ్రాయించాడు.

-దేవునిని ప్రేమించువారికి, అనగా ఆయన సంకల్పం చొప్పున పిలువబడిన వారికి, మేలుకలుగుటకై సమస్తమును సమకైకూడి జరుగుచున్నదని యెరుగుదము. ఎందుకనగా తన కుమారుడు (క్రీస్తు) అనేక సహోదరులలో (మనకు) జ్యేష్ఠుడగునట్లు, దేవుడెవరిని ముందుగా ఎరిగెనో, వారు తన కుమారునితో సారూప్యం గలవారగుటకు వారిని ముందుగా నిర్ణయించెను..(రోమా8:28-30).

కనబడుతున్న ఈ సృష్టిలో కనబడకుండా ఉండి దానిని క్రమబద్ధంగా నడిపిస్తూ, అదుపుచేస్తూ దానిలో జీవించుచున్న తన పిల్లలకు ఏలోటు కలుగకుండా దేవుడు ఎలా చూచుకొనుచున్నాడో అలాగే కనబడే సృష్టియైన, మన శరీరంలో ఎవరికి కనబడకుండా ఉన్నమనం కూడా మన శరీరాన్ని దాని నడకను అదుపుచేస్తూ ఆయనను ప్రేమిస్తూ (ఆయన ఆజ్ఞలను పాటిస్తూ) ఆయన సంకల్పాన్ని నెరవేర్చుటకే ఇదంతా సమకూడి జరుగుతున్నదని తెలుసుకొని, ఆయన పిలుపునకు తగిన విధంగా స్పందించి ఆయన ప్రియ కుమారునితో సారూప్యం గలవారమగుటకు వేగిరపడవలెను. సర్వోన్నతుని మహోన్నతమైన తలంపుతో కారణజన్ముడిగా ఈ భూమిమీద నరుడిగా అవతరించుచున్న మానవుడికి, మరియు అతడు ధరించుకొన్న అందమైన ఈ శరీరానికి అంతం (చావు) లేక నాశనం ఉన్నదా? దీనిని కూడా పరిశీలించి పరిశోదిద్దాం!

ఈ భూమి మీద అందరు మనుష్యులు దేవుడు బైబిల్ వ్రాయించిన క్రియలు చేయాలని పుట్టించాడే తప్ప ఒక్కొక్కరి నుదిటి మీద ప్రత్యేకంగా వ్రాయలేదు. మన తలరాత అనేమాట తప్పు. కొందరి చేతనే మంచి, మరికొందరు చెడు చేయాలని మన తలరాతలు వ్రాసే పక్షపాతి అయిన మనిషి కాదు దేవుడు. అందరూ సత్య సంబంధమైన మంచి కార్యాలను జరిగించాలనే మనం పుట్టకముందే క్రీస్తుతో (వాక్యంతో) వ్రాయించాడు. వారి వారి క్రియల చొప్పుననే మనకు తీర్పు తీరుస్తానన్నాడు.

# మానవుడికి మరణం ఉన్నదా?

ఈలోకంలో ఇప్పుడు కాని, ఎప్పుడైనా జీవించియున్నా లేక జీవింపబోవుచున్న మానవుడు అనుక్షణం భయపడే అతి సామాన్యమైన విషయం చావు లేదా మరణం. మంచి నీతిమంతుడైనా, దేవుని సేవకుడైనా, రౌడి అయినా, దేవునిగా చలామణి అవుతున్న ఏ బాబా అయినా ప్రతిరోజు కోరుకొనేది, జాగ్రత్తపడేది తన చావద్దనే. ఏమనిషి చావును స్వీకరించుటకు ఇష్టపడుటలేదు. చావు అంటే అందరికి భయమే. ఆఖరికి మనం ప్రతిరోజు చేసే ప్రార్థనలలో కూడా దేవుడా నన్ను సజీవులలెక్కలో ఉంచినందులకు స్తోత్రములు, ఇంకా బ్రతికించు అని అడుగుతాం లేదా డాక్టర్ల వద్దకెళ్ళి ఎలాగైనా నేను ఈ శరీరంలో జీవించాలని బ్రతిమాలి, ఎంత ఖర్చు అయినా పర్వాలేదు, నా శరీరాన్ని కోసి అయినా పరాయి వాడి శరీరాన్ని కోసి అందులో భాగాన్ని నాకు పెట్టి అయినా, ఎలాగైనా నన్ను బ్రతికించండి అని వేడుకొంటాం. అతను కూడా అలాగేనని అన్నివిధాల ప్రయత్నించి ఆఖరున చేతులెత్తేసి ఇక నాదేం లేదు, అంతాపైవాడి దయ ప్రార్థన చేసుకోండని అంటాడు.

అలాగే ఎందరు ఎన్ని విధాలుగా అడిగినా మంచిగానో, చెడ్డవానిగానో జీవించినా, ప్రార్థించినా, ప్రార్థనకు రాకపోయినా సరే ప్రతివాడు ఇంతలో కనపడి అంతలో మాయమై పోవుచున్నాడు అనిపిస్తుంది. మనకు తెలిసిన వారి ఇంట్లో ఎవరైనా చనిపోతే మనం ఓదార్చడానికెళ్ళి వాళ్ళు బాగా ఏడుస్తుంటే మనం సాధారణంగా మాట్లాడి అందరం ఏదో ఒకనాడు పోవాల్సిందే గదా అని ఓదార్చుతాం. అదే మన ఇంట్లోనో, మన వాళ్ళకు చావాల్సిన పరిస్థితే వస్తే అపుడు మన పరిస్థితి వేరుగా ఉంటుంది. అలాగే ఆ ఒక్కరోజు మాత్రమే ఎంతగానో బాధపడుతాం. ఆ తర్వాత మామూలే.

ఎక్కడైనా భూకంపమో, ప్రకృతివైపరీత్యమోవచ్చి జననష్టం కల్గినపుడు అందరూ మహా అయితే ఒక వారం వరకు భయపడ్డట్లు నటిస్తూ ఆ వారం అంతా చర్చిల్లోనూ, గుడుల్లోనూ ప్రార్థనలు మొదలుగునవి చేస్తారు. పరదేశులమో ప్రియులారా మన పురమిది కాదెపుడు అని పాడుతాం. అంటే మనది ఈ దేశం, ఈలోకం కాదు అనేది గుర్తుకురావాలంటే ఎవరో ఒకరు చావాలన్నమాట. అయినా ఆ తర్వాత మళ్ళీ అదే భయంకరమైన జీవితంలో జీవించాలని ఆశపడుతూ ఉంటారు. ఈ మధ్య ఒక సహోదరునికి భయంకరమైన జబ్బుతో ఉండి ఆ రోజు ఆపరేషన్ థియేటర్‌లోనికి తీసుకెళ్ళుతుండగా ప్రార్థన చేయటానికి వెళ్ళాను. అతను అందరిలాగే (పైపైకి) అదేం లేదు బ్రదర్ దేవుని చిత్తమైతే బ్రతుకుతాను లేకుంటే సంతోషముగా పోతాను అన్నాడు. దేవుని దయ వలన డాక్టర్ల శ్రద్ధ వలన బ్రతికి బయటపడ్డాక కూడా అతనిని మళ్ళీ అడిగాను ఏం బ్రదర్ ఆరోజు నిజంగానే చనిపోయినా సంతోషం అని అన్నావా? లేక నీలో ఏదో ఒక మూల బ్రతికితే బావుండును అనే ఆశ ఉన్నది కదూ! అని అడిగాను. నిజానికి ప్రతి వానికి బ్రతకాలని ఎప్పుడూ ఉంటుంది. అదే నాకు కూడా బ్రతకాలని ఉంది బ్రదర్ అన్నాడు

ఏమాత్రం ఆత్మ వంచన లేకుండా! అయితే శాస్త్రవేత్తలుగా మారిన వారు మాత్రం శతవిధాలుగా పరిశోధించుచున్నారు మనిషి చావకుండా మరియు చనిపోయిన వారిని బ్రతికించాలని.

మనకంటే ముందుగా జీవించిన కొందరు మాత్రం చావును ఆనందంగా స్వీకరించినట్లు, ఇష్టపూర్తిగా చనిపోయినట్లు, చావైతే లాభం అన్నట్లు బైబిల్ అని పిలువబడుచున్న జీవ గ్రంథంలో వ్రాయబడి ఉన్నది. హెబ్రీ పత్రిక 11వ అధ్యాయం అంతా చదివితే అలాంటి విశ్వాసవీరుల జాబితా కన్పిస్తుంది. అయితే చరిత్రలో ఒకే ఒక వ్యక్తి మాత్రం అందరికి భిన్నంగా అందరికోసం ఇష్టపూర్తిగా తన కిష్టమైన ప్రాణాన్ని నేను ఇష్టపడి బలిగా పెడుతున్నాను మళ్ళీ దానిని తిరిగి తీసుకోగలను అని గూడా అన్నాడు. ఆయనే మనందరికి ప్రభువైన యేసుక్రీస్తు అని చాలా మందికి తెలుసు. ఆ తర్వాత స్తెఫను, అపోస్తలులు, పౌలుగారు, మొదటి శతాబ్ధంలోని క్రైస్తవులు, ఆ తర్వాత ఇప్పటికి అక్కడక్కడా కొందరు సంతోషంగానే చనిపోవుటకు ఇష్టపడ్డారని తెలుస్తున్నది. ఎందుకు వీరికి చావు అంటే భయం లేదో! ఎప్పుడైనా ఆలోచించామా? వారందరూ చావు అంటే ఎందుకిష్టపడినారో బైబిల్‌ను పరిశీలిస్తే మనకు ఆశ్చర్యం ఆనందం కలుగక మానదు. వారందరూ చావుకి నిజమైన అర్థం తెలిసిన వారుగా కన్పించుచున్నారు. మనకింతవరకు తెలియకపోతే దీనిని చదివాకైనా తెలుసుకొని, గ్రహించి దాని ప్రకారము ప్రవర్తించుటకే దీని ద్వారా తెలియజేస్తున్నాడు.

# నేటి శాస్త్రమెరుగని ప్రాణం పోకడ!

కొంతమంది అతి చిన్న విషయానికి కూడా భయపడుతుంటారు. సాహసాన్ని చేయరు, రిస్కు తీసుకోరు. ఎందుకంటే ప్రాణం మీద తీపి అంటుంటారు. చాలామంది తమ పిల్లలను చూపించి వీరే మా 'పంచప్రాణాలు' అని అంటారు. మరికొందరు తమ పెంపుడు జంతువులను చూపించి, ఇది నా "ఆరోప్రాణం" అంటారు. దీన్ని విడిచి పెట్టి ఒక్కక్షణం కూడా ఉండలేను అని చెబుతుంటారు. ఇంతకీ మనిషి 'ప్రాణం' అంటే ఏమిటి? అది ఎక్కడ ఉంటుంది. పంచప్రాణాలు మరియు ఆరోప్రాణం అంటే ఏమిటి? ఇది చాలా మందికి తెలియకనే మాట్లాడుతుంటారు. లేదా పెద్దలో, కవులో ప్రయోగించిన పదాలు బాగున్నాయని వాడుతుంటారు. కాని ఒకవిధంగా వాస్తవాన్ని మాట్లాడుతున్నారు.

మానవులందరి జీవగ్రంథమైన బైబిల్‌లో కూడా ఒక భక్తుడు, రాజైన దావీదు "నా ప్రాణమా యెహోవాను సన్నుతించుము, ఆయన చేసిన

ఉపకారములలో దేనిని మరువకుము" (కీర్తన 103:1-3) అని తన ప్రాణంతో మాట్లాడుతూ, దానినే స్తుతించుము అని చెబుతున్నాడు. ఇంకొక చోట ధనవంతుడైన వాడికి విస్తారమైన పంటపండితే, తన వారికి ఎవ్వరికి చెప్పక తన ప్రాణంతో "ప్రాణమా, అనేక సంవత్సరములకు, విస్తారమైన ఆస్తి నీకు సమకూర్చబడియున్నది, సుఖించుము, తినుము, త్రాగుము, సంతోషించుము అని చెప్పుకొందుననుకొనెను" (లూకా 12:16-20). వెంటనే కొందరు వాని ప్రాణమును ఈ రాత్రికే తీయమని అడుగుచున్నారని దేవుడు వానితో చెప్పాడు. మరొకచోట సాక్షాత్తు జగత్తు రక్షకుడుగావచ్చిన యేసు కూడా "అప్పుడు యేసు-మరణమగునంతగా నాప్రాణము బహుదుఃఖములో మునిగియున్నది" (మత్తయి 26:38) అని అన్న తానే అంతకు ముందు తన శిష్యులతో "తన ప్రాణమును రక్షించుకొనగోరువాడు దాన్ని పోగొట్టుకొనును; నా నిమిత్తము నా సువార్త నిమిత్తమును తన ప్రాణమును పోగొట్టుకొనువాడు దాన్ని రక్షించుకొనును. ఒకడు సర్వలోక మంతయు సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకొనుట వానికేమి ప్రయోజనము" (మార్కు 8:35-37) అని అన్నాడు. ఆ తర్వాత పరిశుద్ధాత్మ "ఆయన (క్రీస్తు) మన నిమిత్తం తన ప్రాణము పెట్టెను గనుక దీనివలన ప్రేమ యెట్టిదని తెలుసుకొనుచున్నాం. మనం కూడా మన సహోదరుల నిమిత్తం మన ప్రాణమునుపెట్ట బద్ధులమై యున్నాం." (1యోహాను 3:16) అని అన్నాడు. మన ప్రాణాన్ని మనకోసం, ఈ లోకంకోసం కాక దేవుని కోసం, క్రీస్తు సువార్త కోసం పోగొట్టుకొంటే ప్రయోజనం అని దేవుడు మాట్లాడుచున్నాడు.

పైవచనాలలో ఒక భక్తుడు తన ప్రాణంతో దేవున్ని స్తుతించమంటున్నాడు, ఒక వ్యక్తి తన ప్రాణాన్ని సుఖించుము

అంటున్నాడు. క్రీస్తు తన ప్రాణం కలవరపడుతుందంటున్నాడు. మనల్ని తనకోసం మన ప్రాణం పెట్టమంటున్నాడు. ఇంతకీ వీరంతా మాట్లాడుతున్నది ప్రాణం గురించి, ప్రాణం కోసమే నని అర్థం అవుతున్నది. ఇంతకీ మన మాట వినేది విని గ్రహించి పని చేసేది, మనతో మాట్లాడేది, చివరికి మనలను విడిచిపోయేది లేక మనం పోగొట్టుకొనేది కూడా ఈ ప్రాణమే అనిపిస్తుంది. ఇంతకీ ఈ ప్రాణం ఎవరు? మనుషులను అడిగితే తమ అనుభవాలతో ఆలోచ నలతో రకరకాలుగా మాట్లాడుతారు గనుక దేవునినే అడుగుదాం. (యాకోబు 1:5).

సుమారు క్రీస్తు పూర్వ 1450 సం॥ క్రితం దేవుడు మోషె ద్వారా వ్రాయించిన ఆదికాండంలో ఆనాటి మానవులకు చెప్పిన సంగతిని చూస్తే ఈనాటి శాస్త్ర ప్రపంచానికి మతిపోతుంది. "ప్రాణముగల సమస్త చరములు మీకు ఆహారమగును పచ్చని కూరమొక్కలనిచ్చినట్లు వాటిని మీకిచ్చియున్నాను. అయినను మాంసమును దాని రక్తముతో తినకూడదు. రక్తమే దాని ప్రాణము. మరియు మీకు ప్రాణమైన మీ రక్తమును గూర్చి విచారణ చేయుదును. ప్రతి నరుని ప్రాణమును గూర్చి వాని సహోదరుని విచారణ చేయును... (ఆది. 9:3-5). సకలచరాచర జీవరాసులకైనా మనుషులకైనా ప్రాణం అనగా రక్తం అని దేవుడు సెలవిచ్చాడు. లేదా రక్తములో ప్రాణం ఉంటుందని మాట్లాడుచున్నాడు. ఈ ప్రాణం లేదా రక్తం బయటకు కనబడితే గడ్డకట్టుకొని పోతుంది, పనికిరాదు గదా! అందుకే ఇంకా కొంచెము ముందుకెళితే రక్తం ఎందులో ఉంటుందో చెబుతున్నాడు. "రక్తము దేహమునకు ప్రాణము". రక్తము దానిలో ఉన్న ప్రాణమును బట్టి ప్రాయశ్చిత్తము చేయును... ఏలయనగా అది సమస్త దేహములకు ప్రాణాధారము, దాని రక్తము ప్రాణమునకాధారము" వాటిరక్తము సర్వదేహములకు ప్రాణా ధారము....(లేవి కాం. 17:11-14).

మనిషి ప్రాణమైన రక్తము దేహంలోనే ఉంటుంది గనుక ప్రాణం అంటే దేహాన్ని సూచిస్తుంది అని అర్ధం అవుతుంది. ఎందుకంటే మాట్లాడేది వినేది, తినేది, సుఖించేది, స్తుతించేది. అన్ని చేసేది మన శరీరమే, దానిలోని అవయవాలే గనుక ప్రాణం అంటే స్థూలంగా దేహం, సూక్ష్మంగా అందులోని రక్తము. రక్తము లేని దేహము, దేహము లేని రక్తము పనిచేయవు కూడా. ఇపుడు ఆలోచించండి క్రీస్తు మనకోసం సిలువలో బలిగా అర్పించింది తన రక్తం మరియు దేహం కదా! (హెబ్రీ 10:5-7). మనల్ని అర్పించుమంటున్నది అదే దేహాన్ని కాదా! (రోమా 12:1-2) ఎక్కడైనా రోడ్డుమీద యాక్సిడెంట్ అయితే మనం చూసేది అక్కడ ఎంత రక్తం పోయిందని దానిని బట్టి అతడు బ్రతుకుతాడోలేదో చెబుతాము. వెంటనే ఆ వ్యక్తిని హాస్పిటల్‌కు తీసుకొని వెళ్ళగానే డాక్టర్లు అనేది, అడిగేది కూడా రక్తమే గదా! రక్తము ఎక్కిస్తేనే బ్రతుకుతాము, జీవిస్తాము. ప్రాణాన్ని కాపాడుకొంటాము.

ఈ విషయాన్ని ఎన్నో సంవత్సరాలుగా బైబిల్‌లో దేవుడు చెబితే నమ్మని మనుషులు, శాస్త్రం పేరుతో ఒక మనిషి చెబితే నమ్మారు. క్రీ.శ. 1629లో విలియం హార్వే అనే శాస్త్రవేత్త మనిషికి రక్తపోటు (బి.పి.) ఎందుకొస్తుంది అని పరిశోధన చేస్తుండగా మనిషి యొక్క ప్రాణం లేదా జీవం రక్తములోనే ఉంటుంది అని కనుగొన్నాడు. అతను చెబితేనే ఈ నాటి ప్రపంచం హాస్పటల్ మరియు అనేక చోట్ల రక్తదానం చేయండి - ప్రాణదానం చేయండి అనే స్లోగన్స్ వ్రాస్తున్నారు. ఇది చూసైనా తమ రక్తము, అవయవాలు దానం చేసి అనేక మందిని శరీరకంగా ఈ లోకంలో బ్రతికిస్తున్నారు. కాని దేవుని మాటలు నమ్మి నిత్యజీవాన్ని కోరుకోవటం లేదు.

మనశరీరమేనని మనమనుకొని, దానినే నమ్మి దానికోసమే బ్రతుకుతున్నాము. అయితే నా పంచప్రాణాలు అనే పదం

ఎలావచ్చిందో తెలుసా? మనిషి దేహాన్ని దేవుడు సృష్టిలో నుండి తీసాడు కదా! సృష్టిని పంచభూతాలు (ఆత్మలు) అంటారు. 1) భూమి, 2)నీరు, 3) వాయువు, 4) అగ్ని, 5) ఆకాశం ఈ ప్రకృతిలో ప్రతిదాంట్లో జీవం ఉన్నది గనుక జీవముగలిగిన ప్రతీదీ దీంట్లో నుండే పుట్టింది. ఎందుకంటే ఈ ప్రకృతిని పుట్టించిన దేవునిలో, ఆయన మాటలో జీవం / ప్రాణం ఉన్నది గనుక "ఆత్మయే జీవింపజేయుచున్నది. శరీరము కేవలము నిష్ప్రయోజనము. నేను చెప్పుమాటలు ఆత్మయు – జీవమునైయున్నది (యోహాను 6:63) అని యేసు చెప్పాడు గదా! ఈ(ఐదు) పంచభూతాలు / ఆత్మలు / ప్రాణాలు కలిసి ఒక ప్రాణంగా అవతరించాయి గనుకనే మనిషి (జీవాత్మ) తన శరీరంలో ఉండి నా పంచప్రాణాలు అంటున్నాడు. తనకు ప్రతిరూపాలు లేదా తనలోంచి వచ్చిన మరో ప్రాణినే తన ఆరోప్రాణం అని అంటున్నాడు లేదా ప్రకృతిలో తమ ఇష్టపడ్డ ప్రాణిని / జీవినికూడా తన ఆరోప్రాణం అని అనగలుగుతున్నాడు. ఇదంతా కూడా దేవుని జ్ఞానంలో వ్రాయబడి ఉన్నదని ఎందరికి తెలుసు. మన బ్రతుకుకు, అందులోని ప్రతి పలుకుకు మూలం మన బ్రతుకుపుస్తకమైన బైబిలేనని ఇప్పటికైనా నమ్ముతారా?

ఇక్కడొక శాస్త్రాతీతమైన ప్రశ్నకు సమాధానం చెబుతున్నాను జాగ్రత్తగా ఆలోచించండి. అర్థంచేసుకొని ఆనందించండి. మన ఆత్మయే ఈ శరీరాన్ని జీవింపజేసినపుడు. మనం చనిపోయాక మన అవయవాలు ఇతరులకెలా పనికొస్తాయి. మన శరీరంలో నుండి బయటికెళ్ళిన రక్తం ఇతరులకెల పనికొస్తుంది. మన ప్రాణం అనగా రక్తం అది ఉండే దేహం, అందులో మనం ఉన్నప్పుడు, మనం చెప్పినట్లు పనిచేస్తుంది. మనం పోగానే మనకు పనికిరానిదైపోతుంది. అయితే ప్రకృతిలో దేవుని ఆత్మలో భాగమైన నీవు లేకపోయినా, ఆయన మాటలో కూడా జీవం ఆత్మ కలిసే

ఉన్నాయి. కనుక జంతువులుకూడా జీవాత్మ సంబంధమైన శరీరులుగా బ్రతుకుతున్నాయి. దేవునిలోని ఊపిరి (జీవం) తిరిగి తీసేసుకొంటే అవి మరణిస్తున్నాయి (కీర్తన 104:29,30, యోబు 12:10, ఆది.కాం. 6:17,7:22).

మనం మరణించగానే అనగా శరీరంలోనుండి ఆత్మవెళ్ళిపోయినా మన దేహంలో ఇంకా కొన్ని గంటల వరకు (సుమారు 6 గం॥లోపు) ఆప్రాణాన్ని, ప్రాణంతో ఉండేటట్లు చేసి భద్రపరచి (సుమారు 40రోజులు) మరోప్రాణానికి దీన్ని అంతగట్టితే (ఒక మొక్కలాగే) అప్పుడది అతనికోసం పనిచేస్తుంది. ఇది కూడా దేవుని ఏర్పాటు. సృష్టిలో ఒక భాగం గనుకనే మన అవయవాలు ఎంతమందికయినా, ఎన్నిసార్లయినా పనికొస్తాయి. మనం ఉన్నంతసేపు మనదే ఈ దేహం. మనం వెళ్ళగానే అది దేవునిది గదా. ఆయన ఎవ్వరికోసమైనా తిరిగి దానిని ఉపయోగించగలడు. ఒక మనిషికి దేవుడు ఇచ్చిన ఆయుష్షు ఇంకా ఉన్నా అతను తన దేహాన్ని, అందులోని భాగాలను చెడగొట్టుకుంటున్నాడు గనుక అతన్ని అతని సమయం వరకు బ్రతికించాలి గనుకనే మనకు ఈ జ్ఞానాన్ని (అవయవ మార్పిడి పద్ధతిని) ఇచ్చి మనల్ని బ్రతికించుకొంటున్నాడు దేవుడు. ఇది మతంకాదు. మహాజ్ఞానం ఆలోచించండి.

దేవుడు మనల్ని రమ్మని పిలువగానే (కీర్తన 90:3) మన ప్రాణాన్ని విడిచిపెట్టాలి గనుక మన ప్రాణాన్ని మనం పోగొట్టుకొంటున్నాం. అంతేగాని మానవ జ్ఞానం కాదు, డాక్టర్ల దయకాదు. ఇది దేవుని దయాసంకల్పం. అందుకే ఎంతపెద్ద యాక్సిడెంట్ అయినా మనిషి బ్రతుకుతాడు. అలాగే సమయం అయిపోతే బాత్‌రూంలో కాలుజారినా చనిపోతాడు. కాబట్టి నేటి శాస్త్రప్రపంచం తన జ్ఞానంతో దేవుని జ్ఞానాన్ని తెలుసుకోలేకపోతుంది. దేవుడు మన మరియు జీవరాశుల ప్రాణాన్ని మట్టినుండి తీసాడు

గనుకనే అవి తిరిగి మంటికి చేరిపోతున్నాయి (ఆది. 2:7,3:19), ప్రసంగి 12:7). మనం ప్రాణాన్ని విడిచి మనం ఎక్కడికి పోతున్నామో ఇంకా దేవుని వాక్యం దగ్గరకెళితే మనకు ముందున్న వాళ్ళు పోయిన విధానం తెలుస్తుంది.

మానవులు ఏదైనా ఇంట్లో అద్దెకుంటే దానినెపుడైనా ఖాళీచేస్తారు గదా! అలాగే మానవుని దేహం లేదా ఒళ్ళు దేవుడు కట్టి మనకు ఇచ్చిన ఇల్లు (గుడారం) కనుకనే దానిని కూడా తప్పక ఖాళీ చేయాలిగదా! ఎంత గొప్ప భక్తులైనా తమ ఒళ్ళు ఖాళీ చేయాలని దేవుడు నియమించాడు. దేహంలోంచి (దేహం విడిచి) బయటకు పోతాను, లేక పోవాలి అని పౌలుగారు అంటున్నారు (ఫిలిప్పీ 1:21-24). ఇది ఆయన పితరులు చేసిన పనే అందుకే చావు గూర్చి విశ్వాసులకు తండ్రియైన అబ్రహాము దగ్గరనుండి ఆలోచిద్దాం అంతకు ముందు చనిపోయిన వారిని గూర్చి చాలాచోట్ల "మృతిపొందెను" అని మాత్రమే ఉంటుంది. ఆది. కాం. 5వ అధ్యాయం ఆతర్వాత అధ్యాయాలలో అలాగే ఉంది. అయితే అబ్రహాము చావును గూర్చి వ్రాయించినది ముందుగా చూద్దాం.

"అబ్రహాము బ్రతికిన సం॥లు 175. అబ్రహాము నిండు వృద్ధాప్యమునకు వచ్చినవాడై మంచి ముసలితనమున ప్రాణము విడిచి మృతిబొంది తన పితరులయొద్దకు చ్చేబడెను (ఆది.కాం. 35:28,29). ఆ తర్వాత ఇస్సాకును గూర్చి వాక్యములో చదివితే "ఇస్సాకు బ్రతికిన దినములు 185 సం॥లు. ఇస్సాకు కాలము నిండిన వృద్ధుడై ప్రాణము విడిచి, మృతిబొంది తన పితరుల యొద్దకు చేర్చబడెను." (ఆది.కాం. 35:28,29) మరోపితరుడు యాకోబును గూర్చి చూస్తే. యాకోబు తన కుమారుల కాజ్ఞాపించుట చాలించి మంచము మీద తన కాళ్లు ముడుచుకొని ప్రాణము విడిచి తన స్వజనులయొద్దకు చేర్చబడెను (ఆది. కాం. 49:33).

దేవునికిష్టుడైన దావీదును గూర్చి అయితే.... దావీదు దేవుని సంకల్పము చొప్పున తన తరమువారికి సేవచేసి నిద్రించి, తన పితరుల యొద్దకు చేర్చబడి కుళ్లిపోయెను గాని దేవుడు లేపినవాడు కుళ్లుపట్టలేదు (అపో. 13:36,37).

పైన వ్రాయబడిన వాక్యాలను చూస్తే వారు చనిపోలేదని, కేవలం మట్టి శరీరమును (ప్రాణమును) మట్టిలో వదిలి ఆత్మలైనవారు వారిపితరుల యొద్దకు వెళ్ళారని లేక నిద్రపోతున్నారని చెప్పబడింది అందుకే మనిషికి చావులేదు. మరొక అద్భుతమైన సంగతి చెబుతాను. పాత నిబంధనలో మామూలుగా 'మృతి పొంది' అని వారి భాషలో వ్రాయించాడు. అయితే క్రీస్తు బోధలో వారు అబ్రహాము, ఇస్సాకు, యాకోబులు సజీవులే అని చెప్పాడు. "మృతులు పునరుత్థానమును గూర్చి - నేను అబ్రహాము దేవుడను ఇస్సాకు దేవుడను, యాకోబు దేవుడనైయున్నానని దేవుడు మీతో చెప్పిన మాట మీరు చదువలేదా? ఆయన సజీవులకే దేవుడు కాని మృతులకు దేవుడుకాదు, (మత్తయి 22:31-33). అంటే మనకన్నాముందు చనిపోయిన విశ్వాసవీరులంతా సజీవులే నన్నమాట. మరియు నేటి క్రైస్తవులు చావు అంటే భయపడి, బ్రతికుండాలనే ఆశతో, శరీరంలో బ్రతికుంటేనే సజీవులమనుకొని, ప్రతిరోజు తమ ప్రార్ధనలో "మమ్ములను సజీవులలెక్కలో ఉంచినందుకు స్తోత్రము తండ్రీ" అంటున్నారంటే వారికి బైబిల్ అర్ధంకాలేదు అన్నమాట. ఇలాంటి ప్రార్ధనలే బైబిల్‌కు వ్యతిరేకమైనవి అని ఆలోచించండి. అందుకే చావైతే లాభం, మేలు అన్నాడు పౌలుగారు.

# చావు అంటే?

మానవుడు అనగా ఆత్మ అనియు ఆ ఆత్మ దేవుని నుండి వచ్చిన దేవుని స్వరూపం అని ముందుగానే తెలుసుకొన్నాం. అలాంటపుడు అతనికి చావు ఉన్నదా! మానవుడికి చావు ఉంటే అతనికి మూలమైన ఆ దేవుడికి కూడా చావు ఉండాలి. ఎందుకంటే ఇద్దరూ ఒక్కరేగాబట్టి. అందుకే చావు అనగా అర్థం వేరే ఉన్నది అని తెలుస్తుంది. ఎలాగంటే దేవుడు ఆదియు, అంతము లేక నిరంతరము ఉన్నవాడు అయి ఉన్నాడు. (నిర్గమ 3:14), ఎవడు దీని నాలోచించి జరిగించును? ఆదినుండి మానవ వంశములను పిలిచినవాడవైన యెహోవానగు నేనే. (యెషయా 41:4). అలాగే మానవుడు కూడా ఆదియు అంతము లేని వాడే అయి ఉండాలి. ఆలోచించండి. నేను ప్రస్తుతం నా శరీరంలో ఈ భూమిమీద ఎక్కడో ఒకచోట ఉన్నవాడినే. శరీరం వదలినాక కూడా ఉంటాను. ఉంటే నిత్య జీవితంలోనైనా ఉండాలి లేదా, నిత్యాగ్ని దండనలోనైనా ఉండేవాడినే కదా! అడ్రసు మాత్రం గల్లంతుకాదు.

సాధారణంగా ఈలోకంలోని తల్లిదండ్రులు తమపిల్లలు తమ మాట వినకుండా పెళ్ళి చేసుకొని దూరంగా వెడలిపోతే ఈరోజుతో నీవు నాకు చచ్చిన వాడిక్రిందలెక్క, నీకు నీళ్ళు వదులుకున్నాను పోరా అంటారు. అలాగే ఒకరోజు మనకు దూరంగా వెళ్ళిన మనిషి జీవితంలో మరెప్పుడు కలువలేదనుకోండి అతడు ఆరోజు నుండే మన దృష్టికి చనిపోయిన వాడిక్రింద లెక్క. అంటే మన ఈ మాటల్లోనే ఒక నిజం బయటపడుచున్నది. అదేమనగా శాశ్వతంగా దూరం అవటం లేక యెడబాటును గూడా చావు అనే అర్ధం అవుతున్నది. ఇదే అర్ధం కూడా బైబిల్‌లో ఎక్కడైనా ఉందేమో వెదకాలి. – "నా మట్టుకైతే బ్రతుకుట క్రీస్తే చావైతే లాభము అయినను శరీరముతో నేను జీవించుటయే నాకున్న పనికి ఫలసాధనమైన యెడల నేనేమి కోరుకొందునో నాకు తోచలేదు. ఈ రెంటి మధ్యన ఇరుకున పడియున్నాను. నేను వెడలిపోయి క్రీస్తుతో కూడా నండవలెనని ఆశయున్నది అది నాకు మరిమేలు". (ఫిలిప్పీ 1:21–23). మరియు మన ప్రభువైన యేసుక్రీస్తు నాకు సూచించిన ప్రకారము నాగుడారమును త్వరగా విడిచిపెట్టవలసివచ్చునని యెరిగి, నేను ఈ గుడారములో ఉన్నంతకాలము ఈ సంగతులను జ్ఞాపకముచేసి మిమ్మును రేపుట న్యాయమని యెంచుకొనుచున్నాను. నేను మృతిపొందిన తరువాత కూడా మీరు నిత్యము వీటిని జ్ఞాపకము చేసికొనునట్లు జాగ్రత్తచేతును (2పేతురు 1:13–15).

పైన చెప్పబడిన రెండు వాక్యములలోనూ శరీరమును విడిచి పెట్టుట లేక శరీరం నుండి బయటకు పోవుటయే మరణం లేక చావు అని అర్ధమయిపోతుంది. అనగా శరీరము నుండి ఆత్మ యెడబాటు కావడమే చావుగా పలుకుచున్నారు. పౌలుగారు వ్రాసిన దాంట్లో శరీరము లేకున్నా గూడా జీవించవచ్చుననియు అర్ధం అగుచున్నది. అలాగే శరీరాన్ని వదిలివేసి క్రీస్తుతో కూడా ఉంటాను

అంటే పౌలు అనే ఆత్మకు చావులేదు ఇక్కడ కాకపోయినా మరోచోట (స్వర్గం లేక నరకం) కూడా జీవించే ఉంటాను అని చెప్పుటను బట్టి ఆత్మ ఎలాగైనా జీవించే ఉంటుందని అర్ధం. దానికి నాశనంలేదని, నరకమున వారి పురుగు చావదు; అగ్ని ఆరదు (మార్కు 9:48). అని అర్థం అవుచున్నది. అందుకే దేవుడు మన్నయినది వెనుకటివలెనే మరల భూమికి చేరును, ఆత్మ దాన్ని దయచేసిన దేవుడనియొద్దకు మరలిపోవును (ప్రసంగి 12:7) అని కూడా అన్నాడు. మన్ను అయినది (మట్టి నుండి తీసిన శరీరం) మన్నే అవుతుంది. అందులో జీవించిన ఆత్మమాత్రం తాను దయచేసిన దేవుని (ఆత్మ-తండ్రి)యొద్దకు తిరిగి వెళ్ళుతుందని వ్రాయించాడు. ఎంతో కష్టపడి శరీరాన్ని తయారు చేసి దాంట్లోకి తన ఆత్మను పంపిన దేవుడు మళ్ళీ ఈ రెండింటిని ఎందుకు వేరుచేయుచున్నాడో లేక మానవులను ఎందుకు చంపుతున్నాడో ఒకసారి ఆలోచిద్దామా! మనుషులందరూ చస్తున్నారా? దేవుడు మనలను చంపుతున్నాడా? చంపడం అనే మాట న్యాయంగా ఉందా ఆలోచించండి.

మనవాళ్ళు ఎవరైనా మరీ కావాల్సిన వారు చనిపోతే ఉదా : వయసులో ఉన్న భార్య తన యొక్క భర్త చనిపోతే, లేక వయసులోకి వచ్చిన కుమారుడు చనిపోతే అతని తల్లి తండ్రులు ఏడ్చేటపుడు దేవుడు మాకు అన్యాయం చేసాడని ఏడుస్తారు. అందరితో అంటారు కదా! నిజంగా దేవుడు అన్యాయం చేస్తున్నాడా? ఆలోచించండి. మనలో చాలామందిమి తల్లిదండ్రులుగా ఉన్నాం. మన పిల్లవాడో, కూతురో బడికి వెళ్ళి సాయంత్రం ఇంటికి వచ్చే వేళకు తిరిగి రాకపోతే ఏం చేస్తాం. ప్రతీసారి ఇంట్లోకి బయటకు తిరుగుతూ, మాటిమాటికి రోడ్డువైపు చూస్తూ నానా గాభరాపడుతాం. కొంచెంసేపు చూసి ఇక లాభం లేదు అనుకొని స్కూల్‌లోనైనా, ఎవరింట్లోనైనా ఉన్నపుడు

సంతోషించి వాడు తిరిగి మన ఇంటికి రానని, ఎంతగా మొరాయించినా నాలుగు తన్ని బర,బరా ఈడ్చుకొని పట్టుకొస్తాం ఎందుకంటే వాళ్ళు మన ప్రతిరూపాలు, ఆశల సౌధాలు. వాళ్ళు లేకుంటే మనం బ్రతుకలేం అంటాం కదా! ఇంకా వేరే ప్రాంతాలకు విహారయాత్రలకు వెళ్ళినపుడు కూడా నాయనా క్షేమంగా వెళ్ళి లాభంగా త్వరగా తిరిగి రాబాబు అని మరీమరీ జాగ్రత్తలు చెప్పి పంపిస్తాం. అక్కడ నుండి తిరిగి రాకపోతే వెళ్ళివెతికి పట్టుకొస్తాం. వేరే దేశాలలో లేక అందమయిన ప్రదేశాలలో చూడటానికి వెళ్ళిన వారు అక్కడి అందానికి మురిసిపోయి అక్కడే ఉండాలని అనుకొన్నా ఆ దేశపు వారు బలవంతంగానైనా బయటకు తోసేస్తారు గదా.

అలాగే దివి (పరలోకం) నుండి భువికి దిగివచ్చిన నీవు నీ విహారయాత్రలో ఈ శరీరం లేక లోకం మాయలో పడి ఇక్కడే ఉండిపోతాను. వచ్చిన చోటుకు తిరిగి వెళ్ళను అంటే న్యాయంగా ఉంటుందా? నిన్ను శరీర ప్రకారం కని, కొద్దిరోజుల మమకారాన్ని పెంచుకొన్న నీ తల్లిదండ్రులే నిన్ను చూడకుండా ఉండలేనపుడు, మనల్ని తనకోసమే కని, తన పని మీద ఇక్కడకు పంపి యుగయుగాలు మనమీద మమకారాన్ని పెంచుకొన్న ఆ పరలోకపు తండ్రికూడా మనం తన దగ్గర లేకుండా ఎలా ఉండగలడు. ఇక్కడే ఉండిపొమ్మని మనల్ని పంపించాడనుకుంటున్నారా! మనం రాను అంటున్నా ఎందుకు బలవంతంగా (చంపి) తీసుకొని పోతున్నాడో తెలుసా? ‘‘నీవు మనుష్యులను, (శరీరాలను) మంటికి మార్చుచున్నావు. నరులారా తిరిగి (నాదగ్గరకే) రండని సెలవిచ్చుచున్నావు (పిలుచుచున్నావు) – (కీర్తన 90:3) ఒకవేళ మనం ఎంతగా ఇక్కడ ఉండాలనుకున్నా దేవుడు మనల్ని తన దగ్గరకు తిరిగి రండని పిలుచుటలో ఎంత న్యాయం ఉందో ఆలోచించారా! ఒకవేళ మనం ఎంతగా ఇక్కడ ఉండాలనుకున్నా దేవుడు మాత్రం

ఉంచదు. మరియు మనం నమ్ముకున్న మన శరీరం కూడా ఎంతగా అందులో ఉండాలని ఆశించినా, ఆరాటపడ్డా, ఆవేదనపడ్డా, అనుకోని సమయంలో అర్ధాంతరంగా తనలోంచి మనల్ని బయటకు గెంటివేసి తన దారి తను చూసుకుంటుంది.

ఒకరోజు నేను "చచ్చిబ్రతుకుతావా? బ్రతికి ఛస్తావా?" అనే బహిరంగ సువార్త సభలలో మాట్లాడి హైదరాబాద్‌కు తిరిగి వెళ్ళడానికి సిద్ధమయ్యాను అపుడు రాత్రి 11 గం॥ దాటింది. ఈ మూడు రోజులు శ్రద్ధగా వాక్యం విన్నా, నేను బ్రతికి ఉండాలనే ఆశతో ఆరాత్రి ఒక వ్యక్తి చాలా ప్రేమగా అయ్యా ఇంత రాత్రి ఎలా వెళతారండీ అని అడిగాడు. అందుకు నేను మామూలుగా రోడ్డుమీద ఏ వాహనం (లారీనో, జీపో) కనబడితే దాన్ని ఎక్కేసి వెళ్ళిపోతానని అన్నాను. వెంటనే అతను రాత్రి పూట లారీ ఎక్కవద్దు సార్, డ్రైవరు తాగి నడిపి యాక్సిడెంట్ చేస్తాడు అన్నాడు. అయితే జీపు ఎక్కాలా? అన్నాను. అది మరీ భయంకరం వద్దుసార్ అని, బస్సు ఎక్కండి బావుంటుంది కాని ఇపుడు బస్సులు లేవు కదా అన్నాడు. అయితే నేనన్నాను ఈ మధ్య బస్సులుకూడా కాలువలు, నదులు, చెరువులలో పడుతున్నాయి గదా అన్నాను. అవునండీ బస్సుకూడా వద్దు రైలు అయితే బావుంటుంది అన్నాడు. మరలా నేను ఈరోజుల్లో చాలా రైళ్ళు పట్టాలు తప్పుతున్నాయి కదా! అదీ ప్రమాదమేమో ఆలోచించండి అన్నాను. కాబట్టి అతను అయ్యా ఈ రాత్రి ఇక్కడే పడుకొని తెల్లవారున వెళ్ళండి అన్నాడు. ఇది చాలా బాగున్నా దుప్పటి కప్పుకొని పడుకొంటే తెల్లవారేసరికి గుండె ఆగి చనిపోతే... అప్పుడు అందరు అంటారు రాత్రి బాగానే ఉన్నాడే నిద్రలోనే 'హార్ట్ ఎటాక్' వచ్చిందండి అంటారు. రాత్రి ప్రయాణంలో చస్తానని భయపడి పడుకుంటే తెల్లారి బ్రతుకుంటానని గ్యారంటీ ఉందా? ఇంతకీ మన హార్ట్‌కి ఎటాక్ ఇచ్చింది ఎవరు? దేవుడే కదా! గుండె

పని ప్రారంభించిన వాడే మనకిచ్చిన టైమ్ అయిపోగానే దాన్ని ఆపుతాడు గదా! ఇపుడు చెప్పండి మరణాన్ని తప్పించుకొనే నరుడెవరు? (కీర్తన 84:48) అందుకే ఈ మర్మాన్ని లేక ఇంత చక్కటి ఆత్మజ్ఞానాన్ని తెలుసుకొన్న మన ముందుతరాలవారు చావైతే లాభం బ్రతుకుట క్రీస్తు కొరకే అన్నారని ఇప్పుడు మనకు బాగా అర్థమయ్యింది అనుకొంటాను. అర్థం కాకపోతే మరోసారి జాగ్రత్తగా బైబిల్‌ను చదవండి ఆలోచించండి! దేవునికి లోబడండి.

మరియు మన జీవగ్రంథంలో ఈ మొదటి మరణమే కాక రెండవ మరణము అని గూడా వ్రాయబడి ఉన్నది. దాని విషయం పరిశీలిద్దాం. మనుష్యులొక్కసారే మృతిపొందవలెనని నియమింపబడెను; ఆ తరువాత తీర్పు జరుగును (హెబ్రీ 9:27). నామాట విని నన్ను పంపినవానియందు విశ్వాసముంచు వాడు నిత్యజీవము గలవాడు; వాడు తీర్పులోనికి రాకమరణములో నుండి జీవములోనికి దాటియున్నాడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను (యోహాను 5:24). ఇక్కడ చెప్పబడిన మరణము వేరొక మరణంగా కనబడుచున్నది. అలాగే మరో జీవము లేక నిత్యపజీవం అంటున్నాడు. ఈ మరణం అయ్యాక కూడా మరొక మరణం ఉందంటున్నాడు. "మరణమును మృతుల లోకమును అగ్ని గుండములో పడవేయబడెను. ఈ అగ్ని గుండము రెండవ మరణము (ప్రకటన 20:1-4) ఇక్కడ రెండవ సారి మరణం అని మళ్ళీ చెబుతున్నాడు. మరణం అనగానే యెడబాటు అని ముందే తెలుసుకొన్నాంకదా! అంటే దేవుని నుండి బయటకు వచ్చిన ఈ నరుడు లేక జీవాత్మ తిరిగి దేవునియొద్దకే వెళ్లి నిత్యం ఆయనతో ఉండడమే నిత్యజీవమనియు, అలాకాక ఈ ఆత్మ దేవునియొద్దకు వెళ్ళక మరో లోకం (నరకం)లోకి వెళ్ళి అక్కడ అగ్నిగుండంలో నిత్యం బాధననుభవిస్తూ జీవించడమే అనగా దేవునికి దూరంగా

నిత్యం ఉండటము రెండవ మరణం అన్నమాట. అక్కడ కూడా ఈ ఆత్మకు చావులేదు. – నరకమున వారి పురుగు చావదు అగ్ని ఆరదు (మార్కు 9:48) – నిత్యము శిక్షలోనికి వెళ్ళడమే (మత్తయి 25:46) రెండవ మరణమని, ఆ నరకంలో కూడా మన పురుగు (ఆత్మ) చావదని చెప్పబడినది. ఎందుకంటే దేవుడైన ఆత్మకు చావు లేదు గనుక. మన ఆత్మ చస్తే దేవునికి చావుండాలి గదా!

అయితే దేవుని చిత్తప్రకారం ఈ లోకంలో బ్రతికిన నీకు – నాకు కలుగబోయే లాభం ఏమిటి. మహోన్నతుని సంకల్పంలో మన శరీరం మరియు – ఆత్మ ఏమి కాబోతున్నాయి నిజంగా శరీరం మన్నయిపోతుందా? మరి శరీరం లేకుండా ఆత్మ దేవుని దగ్గరకు వెళ్ళిపోతుందా! ఎంతో శ్రద్ధ తీసుకొని భూమియొక్క అగాధ స్థలములలో విచిత్రముగా నిర్మించిన మన దేహం గతి ఏమి కానున్నది అని ఆందోళన చెందుతున్నారు ఎంతోమంది. అందుకే ఈ శరీరం మీద మమకారం పెంచుకొని ఎల్లకాలం దాంట్లోనే ఉండాలని శాస్త్రవేత్తలు దివారాత్రులు పరిశోధనలు చేస్తున్నారు. ఇంతవరకు ఫలితం సాధించలేకపోయారు. ఇకముందు సాధించలేరుకూడా. దేవుడు మన శరీరంలో ఉండాలని ఎంతో కోరుకున్నాడు గనుక మన శరీరం మీద ఆయనకు కూడా ప్రేమ ఉన్నది గనుక దానిని కూడా ఎల్లవేళలా తనతో ఉంచుకొనే ఏర్పాటు చేసి ఉండాలి. ఇంత గొప్ప బలమైన కారణజన్ముడైన మానవుడి అంతం లేక అనంతమైన స్థితి ఎలాగుంటుందో ఒకసారి బైబిల్‌ను పరిశీలించి ముగింపులోనికి వెళదాం.

## "అక్షయ శరీరము - పునరుత్థానం"

చావు తర్వాత స్థితియొక్క ఆలోచన మనిషిని ఆశ్చర్యంలోను, ఒకానొకపుడు నిరాశా వాదంలోనూ ఉంచుతుంది. చాలా మంది చనిపోయాక జరిగేది మనకు ఎందుకు, లేక మనకు తెలువదు. అసలు మరోలోకం ఉందో లేదో వాటిని ఎవరైనా, ఎప్పుడైనా చూసిన వారు ఉన్నారా? ఏ మనిషి లేదా ఒక్కడు అయినా చూచి వచ్చాడా? అని అడుగుతాం. అలాగే క్రైస్తవులు కూడా తమకు కష్టాలు వచ్చినప్పుడు కూడా బైబిల్ చెబుతున్నదంతా నిజమేనా? అని సందిగ్ధంలోపడుతారు. చాలామంది వాదిస్తున్నారు. చాలామంది చాలా రకాలుగా ఈ విషయాల మీద బోధిస్తున్నారు, ప్రశ్నిస్తున్నారు, దేవుడిని, ఆయన సృష్టించిన పరలోకాన్ని, నరకాన్ని చూసిన ఒక వ్యక్తి భూమిమీద కొంతకాలం క్రితం మన మధ్యనే జీవించాడు. ఆయన పేరు యేసుక్రీస్తు ఆయన కూడా ఈలోకంలో జీవించాడనే చరిత్ర సాక్ష్యం కావాలా?

ఈనాడు క్రీస్తును ఆయన ద్వారా దేవున్ని నమ్మని, క్రీస్తును ద్వేషించే అనేకులు కూడా తమ దైనందిన జీవితాలలో ఆయన పేరుననే అనేక పనులు

చేయుచున్నారు. తమ పుట్టుక, పెళ్ళి, చావు, పండుగలు ప్రయాణాలు ఉద్యోగం, ఏదైనా కొనాలన్నా, అమ్మాలన్నా అన్నింటికి ముఖ్యంగా ఒక కొలబద్ద మీద జరిగించుచున్నారు. అదే సమయం లేక తేది ప్రపంచంలో ఏ దేశ చరిత్ర చూసినా, ప్రపంచ చరిత్ర చూసినా ఈయన పేరు మీదనే కాలాన్ని కొలవటం లేక సంవత్సరాలను పాటిస్తున్నారు. కొందరికి వారి వారి శకాలున్నా అందరి దగ్గరకొచ్చేసరికి కాలాన్ని కొలవడానికి దేవుని కుమారుడైన క్రీస్తు పేరునే వాడుకొంటున్నారు. అదేనండీ క్రీస్తు శకం మరియు క్రీస్తు పూర్వం. నేటికి 2004 సంవత్సరమైంది అంటే క్రీస్తు నిజంగానే ఈ లోకంలోనికి వచ్చిన లేదా మనిషిగా పుట్టిన సమయాన్ని తెలియజేస్తున్నది. ఆయనని నమ్మనివారు కూడా కాగితం మీద ఈ రోజు తేది వేస్తున్నారు అంటే ఆయనను పరోక్షంగా లేక ప్రత్యక్షంగా ఒప్పుకొన్నట్లే. అప్పటి నుండి ఇప్పటి వరకు అంతటి మహోన్నతుడు ఏ దేశంలోనూ పుట్టలేదు గనుకనే ఆయన మాత్రమే యుగపురుషుడు శకపురుషుడు అయ్యాడు. ఆయన ఒక్కడే మనిషి లాగే పుట్టి, జీవించి, మరణించాడు. మనుషులందరికన్నా అతీతంగా తిరిగిలేచి తన శరీరాన్ని దక్కించుకొని వచ్చిన చోటికి తిరిగి వెళ్ళాడు. ఆయన బోధలు, జీవిత చరిత్రలతో కూడిన బైబిల్ గ్రంథమే నేటి అధునాతన మానవునికి సైతం అందని మహాజ్ఞానం. అంతటి గొప్ప ఆయనే చెప్పాడు మనందరి ఈ జన్మ రహస్యాన్ని. మనందరి చావు తర్వాత జరుగబోయే అద్భుత రహస్యాన్ని. తీయండి మీ చేతిలో ఉన్న జీవగ్రంథాన్ని. తన ప్రాణమును రక్షించుకొనగోరువాడు దానిని పోగొట్టుకొనును; నా నిమిత్తమును సువార్త నిమిత్తమును తన ప్రాణమును పోగొట్టుకొనువాడు దానిని రక్షించుకొనును (మార్కు 8:35, మత్తయి 10:39, లూకా 9:24).

తను కూడా మన నిమిత్తం మరియు ఆయనను ఈలోకంలోనికి పంపిన దేవుని చిత్తాని నెరవేర్చటానికే తన ప్రాణాన్ని

పోగొట్టుకొని తిరిగి దానిని దక్కించుకొన్నాడు గాబట్టే అంత ఖచ్చితంగా చెప్పగలిగాడు. అందుకే దేవుడు తనకిచ్చిన ఆధిక్యతను బట్టి ఇపుడు మనల్ని ఆయన నిమిత్తం, ఆయన సువార్త నిమిత్తం మన ప్రాణాన్ని పెడితే దానిని తిగిరి తీసుకొంటావని గట్టిగా చెప్తున్నాడు. ఆత్మకు చావులేదు అని ముందుగానే తెలుసుకొన్నాం. మరి ప్రాణం అని దేనిని అంటారు. చాలా మందికి ప్రాణం అన్నా ఆత్మ అన్నా ఒకటే భావం ఉన్నది. అది బైబిల్ ప్రకారంగా అనగా మహాజ్ఞానం ప్రకారం సరియైనది కాదు అని ముందే తెలుసుకున్నాము. క్రీస్తు నిమిత్తం ఆయనబోధ నిమిత్తం నీ ప్రాణాన్ని లేక దేహాన్ని పోగొట్టుకొంటే దానిని మనం మరలా తిరిగి తీసుకొంటాం. పోగొట్టుకొనడం లేక బలిగా ఇవ్వడం అంటే క్రీస్తులాగా రక్తాన్ని సిలువలో ప్రతివాడు కార్చాలనే అర్థం కాదు. ప్రతిక్షణం మన దేహాన్ని అందులోని రక్తాన్ని నీళ్ళుగా / చెమటగా మార్చుతూ, ఆయన బోధ నిమిత్తం దేహాన్ని నలుగగొట్టుకోవడం అనగా కోరికలను చంపుకోవడం అని అర్థం. నిజంగా మన శరీరాన్ని దేవుని వాక్యానుసారంగా నడిపిస్తే ఆ దేవుని ప్రియ కుమారునిలాగే మనం మన శరీరాన్ని తిరిగి పొందుతామా? అంటే తిరిగి లేస్తామా? లేక తిరిగి బ్రతుకుతామా? చాలామందికి ఇదో పెద్ద అనుమానం. చనిపోయిన వాడు ఎలా తిరిగి లేస్తాడు, మట్టిలో కలిసిన శరీరం ఎలా బయటకు వస్తుంది అని ప్రశ్నిస్తూనే ఉన్నారు. ఈ ప్రశ్న ఈనాడు పుట్టినది కాదు. దాదాపు 1900 సంవత్సరాల క్రితమే ఇప్పటి యూరప్ ఖండంలోని కొరింథి పట్టణంలోనివారు అడిగినారు.

"అయితే మృతులేలాగు లేతురు? వారెట్టి శరీరంలో వత్తురని యొకడు అడుగును" (1కొరింథి 15:35-49).

అందుకు దేవుడేమంటున్నాడంటే ఒరే పిచ్చివాడా నీవు దేనినైనా విత్తడం లేక చల్లుతావో అది ఛస్తేనే గదా బ్రతికింపబడుతుంది అని అంటున్నాడు ఒకసారి మన చుట్టూ ఉన్న

ప్రకృతిని పరిశీలించండి మనం ఏ విత్తనం భూమిలో పాతిపెడితే అది లేక దాని శరీరం కుళ్ళిపోయి మట్టిలో కల్సిపోతుంది కాని అందులో నుండే మనం అంతకు ముందు చూడని ఒక అద్భుతమైన రూపం చెట్టుగా బయటకు వస్తుంది. అంటే మనం విత్తిన ఈ గింజనే తన రూపాన్ని మట్టిలో కలిపివేసి తిరిగి దాని సహాయంతోనే ఒక అద్భుతమైన రూపాన్ని పొందుతున్నది. ఇది మన కళ్ళముందు జరుగుచున్న నగ్నసత్యం. చిన్న మర్రివిత్తనం ఏ కాకి రెట్టలోంచి ఒక ఇల్లుమీదనో, చెట్టుసందులోనో పడి అందులోని మట్టితో కలిసిపోయి ఎలా మహావృక్షంగా మార్పు చెందుతుందో ఆలోచించండి. సోదరులారా అంత చిన్న విత్తనంలో అంతటి మహావృక్షం దాగి ఉన్నదని మనం ఎంతో జాగ్రత్తగా ఆలోచిస్తే తప్ప అర్థం కాదు. ఆ విత్తనం కూడా ఒకప్పుడు ఈ భూమిలోంచి వచ్చిన చెట్టుదేనని మరువకూడదు సుమా! ఇది వృక్షశాస్త్రం.

అలాగే మన కళ్ళముందే మరో జీవరాశిలో కలిగే మార్పును గమనిద్దాం గొంగళి పురుగును అందరూ చూసే ఉంటారు. దాని శరీరాన్ని చూస్తే అందరిలోను అసహ్యం, గగుర్పాటు పుట్టుకొస్తుంది. అది భూమి మీద ఒక అడుగు దూరం పోవాలంటే చాలా సమయం తీసుకుంటుంది. అయితే ఆ గొంగళి పురుగు ఒక ఆకు మీదనో, కొమ్మమీదనో ఒక ప్రత్యేకమైన గూటిని నిర్మించుకొని అనగా మూడువారాలు సజీవ సమాధియై అందరూ వెంటపడి ముద్దుపెట్టుకోవాలని ఆశించే అంత అందమైన రంగురంగుల సీతాకోకచిలుకగా మారిపోతుంది. అది ఆకాశంలో హాయిగా ఎగిరిపోతుంది. ఇక్కడ గమనించాల్సింది గొంగళి పురుగులోని జీవం, లేక ఆత్మ ఒకటే కాని శరీరం మార్పు చెందినది. ఇది ప్రతివారు ఒప్పుకొని తీరాల్సి వచ్చిన నిజం. ఇది జంతుశాస్త్రం. మరి ఇలా మన అధీనంలో ఉండే వృక్షాలు, జంతు జీవరాశులకే ఇంతటి ఆధిక్యాన్ని ఇచ్చిన దేవుడు సాక్షాత్తు తన స్వరూపంలో ఉన్న నరుడి

దేహానికివ్వడా? పైరెండు ఉదాహరణలను మనకు ప్రాక్టికల్‌గా ఋజువు కోసం మన కళ్ళముందే జరిగించుచున్నాడు. మన కళ్ళముందు జరుగుచున్న ఈ విషయాలను కాదనేవారున్నారా?

చాలామంది అనవచ్చు మానవ శరీరం మట్టి అయిపోతుంది గదా ఎపుడు మార్పు చెందుతుంది అని అనుమానం రావచ్చు. ఒకపుడు మనముందు తరంవారి కళ్ళముందే యేసుప్రభువు దేహం మూడు రోజులకే ఒక అద్భుతమైన శరీరంగా, మార్పుచెందినది. కాని మన శరీరం మారటానికి దేవుడు కొంత (క్రీస్తు 2వ రాకడ వరకు) సమయాన్నిచ్చాడు. ఈ లోకంలో పుట్టిన మొదటి మానవుడు ఆదాము మొదలుకొని ఆఖరి మానవుడి దేహం కూడా ఒకేసారి మారే అవకాశాన్ని ఇస్తున్నాడు. – "ప్రతివాడును తనతన వరుసలో బ్రతికింపబడును. ప్రథమ ఫలం క్రీస్తు, తరువాత క్రీస్తు వచ్చినపుడు ఆయన వారు (ఆయనను నమ్మి వెంబడించినవారు) బ్రతికింపబడుదురు". ఇప్పుడైతే నిద్రించినవారిలో ప్రథమఫలముగా క్రీస్తు మృతులలోనుండి లేపబడియున్నాడు.. (కొరింథీ 15:20–26) సహోదరులారా, నిరీక్షణలేని యితరులవలె మీరు దుఃఖపడకుండు నిమిత్తము, నిద్రించుచున్న వారిని గూర్చి మీకు తెలియకుండుట మాకిష్టములేదు... (1థెస్స 4:13–17) యేసుక్రీస్తు ఈ లోకానికి మరలా వచ్చేంత వరకు మన దేహములు మాత్రమే అనగా ఆయనకోసం పనిచేసిన దేహములు ఈ మట్టిలోనే చెడిపోకుండా భద్రంగా ఉంటాయి. ఎలాగంటే మనలో చాలామందికి రిఫ్రీజిరేటర్ (ఫ్రిడ్జ్) గూర్చి తెల్సుగదా! అందులో మనం వండిన కూరగాయలు, మాంసం, పండ్లు అన్నీ పెడుతాము. అవి చాలా రోజుల వరకు చెడిపోకుండా అనగా కుళ్ళిపోకుండా భద్రంగా ఉంటాయి. అయితే ఈ ఫ్రిడ్జ్ ఎక్కడి నుండి వచ్చింది. దాని తయారీకి వాడిన ప్రతి వస్తువు ఈ మట్టిలోంచి తీయబడినదే. దానిని పనిచేయించే విద్యుత్ కూడా ఈ మట్టిలోంచి తీయబడిన (జనరేటర్) యంత్రములోనుండి

పుట్టినదే. ఇప్పుడు ఆలోచించండి మనం తింటున్న లేక ఫ్రిడ్జ్‌లో భద్రపరుచుచున్న పదార్థములన్నియు ఈ మట్టిలో నుండి బయటకు వచ్చినవే లేదా తయారు చేయబడినవే అంటే మట్టిలోనుండి వచ్చిన పదార్థములను ఆ మట్టిలోనుండి వచ్చిన లేదా తీసిన పదార్థములతో చేయబడిన ఫ్రిడ్జి భద్రం చేయగలిగినపుడు మట్టిలోనుండి తీయబడిన మన దేహాన్ని భద్రపరిచే అత్యంత క్షేమమైన ప్రదేశం ఈ మట్టేకదా! అందుకే దేవుడు మనందరి దేహాలను మట్టిలోనికి చేర్చుచున్నాడు. అందులోనే లోకాంతం వరకు కాపాడుచున్నాడు. ఇదే దేవుని సైన్స్ & టెక్నాలజీ.

ప్రకృతి సంబంధమైన లేక క్షయమైనదిగా విత్తబడుతున్న ఈ శరీరం యేసుక్రీస్తు ఈ లోకానికి తిరిగి రాగానే ఆత్మ సంబంధమైన శరీరం లేక అక్షయమైన (నాశనంలేని) శరీరంగా మార్పు చెందుతుంది. ఒక్కసారి అక్షయ శరీరాన్ని పొందిన యేసుప్రభువు క్షణాలమీద పరలోకం వెళ్ళి మళ్ళీ భూమి మీదకొచ్చాడు. శిష్యులందరూ ఒక ఇంట్లో కూడి తలుపులు మూసుకొని ప్రార్థించుచుండగా వేసిన తలుపు వేసి ఉండగానే వారి మధ్యలో కొచ్చి తనకు అంతకు ముందున్న శరీరం లాంటి దానినే వారికి చూపాడు. “యేసు ఆమెతో నేను ఇంకను తండ్రియొద్దకు ఎక్కిపోలేదు గనుక నన్ను ముట్టుకొనవద్దు; అయితే నా సహోదరులయొద్దకు వెళ్లి – నాతండ్రియు మీతండ్రియు, నాదేవుడును మీ దేవుడునైన వానియొద్దకు ఎక్కిపోవుచున్నానని వారితో చెప్పుమనెను. ....(యోహాను 20:17–20) అలాగే అవసరమైనప్పుడు తన రూపాన్ని మార్చుకోగలిగాడు. ఆ తరువాత వారిలో ఇద్దరు ఒక పల్లెటూరికి నడిచి పోవుచుండగా, ఆయన మారురూపముగలవాడై వారికి ప్రత్యక్షమాయెను (మార్కు 16:12) అంటే ఆ అక్షయ శరీరాన్నిమార్చుకొనేవీలుగూడా ఉందన్నమాట. అటు తరువాత అందరూ చూచుచుండగా మేఘము మీద ఆకాశానికి

యెగిరిపోయాడు. ఈమాటలు చెప్పి, వారుచూచుచుండగా ఆయన ఆరోహణమాయెను, అప్పుడు వారి కన్నులకు కనబడకుండా ఒక మేఘము ఆయనను కొనిపోయెను... (అపో. 1:9-11) ఇంతగొప్పదైన అక్షయ శరీరంగా మనందరి శరీరాలు గూడా మార్చబడుతాయని దేవుడు మనకు వాగ్దానం చేసియున్నాడు. మృతుల పునరుత్థానమును అలాగే, శరీరము క్షయమైనదిగా విత్తబడి అక్షయమైనదిగా లేపబడును... (1కొరింథీ 15:42-52) నేటి ఈ మానవ మేథస్సుకు అందని అందమైన అద్భుతమైన, ఈ అక్షయ శరీరం మనందరికి కావాలంటే మానవజన్మకు గల కారణాన్ని సార్థకం చేయాలన్నమాట. మరియు మనందరిని చంపి, మన శరీరాలను ఎందుకు మట్టిలో కలుపుతున్నాడో, చనిపోయే లోపున మన శరీరంతో దేవుని పని ఎందుకు చేయమన్నాడో, చేస్తే మన శరీరానికి వచ్చే లాభం ఏమిటో మానవ భాషలో ఆలోచిద్దాం.

**జీవితభీమా (ఎల్.ఐ.సి) :** మన జీవితాన్ని భీమా అనగా ఇన్సూరెన్స్ చేసుకొమ్మని ఈ మధ్య ప్రభుత్వ, ప్రైవేటు ఏజెన్సీలు తెగ ప్రచారం చేస్తున్నాయి. మనకు జీవితాన్ని, జీవాన్ని అనగా శరీరాన్ని ఇచ్చిన దేవుడే దీనికి గ్యారంటీ ఇవ్వలేదు. "మీ జీవమేపాటిది. మీరు ఇంతలో కనపడి అంతలో మాయమయ్యే ఆవిరి వంటివారు" (యాకోబు 4:17) మరి ఈ ఏజెన్సీలు ఏమైనా ఇన్సూరెన్స్ లేదా భద్రత నివ్వగలవా అంటే.. మనం బ్రతికి ఉండగా భీమా పాలసీ తీసుకొంటే ఎక్కువ లాభం చనిపోతే వస్తుందని చెబుతున్నారు. మనం పోయాక వచ్చే లాభం, అదే డబ్బు త్రిబుల్ బెనిఫిట్... మనకు ఉపయోగపడదు. మనపిల్లలకోసం, భార్యకోసం పనికొస్తుంది. అయితే నిజంగా మన జీవితానికి భీమా, జీవాన్నిచ్చిన దేవుడే మనం పుట్టకముందే ఏర్పాటు చేశాడని పైన చదివిన అంశాలను బట్టి గ్రహించారని ఆశిస్తున్నాను.

మనం బ్రతికి ఉన్నప్పుడు మన సంపాదనలో శ్రేష్టమైన భాగాన్ని పరలోకంలో దాచుకోమన్నాడు. ఈలోకంలో దాచుకొంటే మనకు మరోలోకంలో ఉపయోగపడదు. మన జీవితాన్నే తన పనిలో ఉపయోగిస్తే మనదేహం పర్మనెంటుగా యుగయుగాలు పనికొచ్చేటట్లు ఇన్సూరెన్స్ చేస్తానంటున్నాడు చూడండి. (యోహాను 12:24,25).

మన జీవాన్ని (శరీరాన్ని) మరియు జీవితాన్ని ఇన్సూరెన్స్ చేయించే ఏజెన్సీలు మన ఊరిలోనే మన కనులముందు కనబడుతున్నా గుడ్డివారమైపోతున్నాం. అదేనండీ దేవుని రాజ్యంగా పిలువబడుతున్న ప్రార్థనా మందిరాలు అనగా చర్చీలు. 60,70 ఏండ్ల జీవితంలో ఈ శరీరాన్ని దేవునికోసం పనిచేయిస్తే యుగయుగాలు దానిలో ఉండగల అవకాశం ఇస్తున్నాడు. ఈలోకంలో ఇన్సూరెన్స్ చేయించవద్దని నేను చెప్పడం లేదు. ఇక్కడ చేసుకొంటే మన పిల్లలకు, కుటుంబానికి ఉపయోగపడుతుంది. అది మన ధర్మము (1తిమోతి 5:8) అయితే వీళ్ళెవరు మనతో రారు. మనతో మనశరీరం కూడా పరలోకం రావాలంటే పరలోక పాలసీలు తీసుకొని తీరాల్సిందే. ఇది దేవుడిస్తున్న ఉచిత జీవిత భీమా సౌకర్యం. అదే పునరుత్థానభాగ్యం. ఎన్ని దేశాలలో, ఎంతమంది వద్దన్నా, ఆపాలని చూసినా సువార్త ప్రకటన ఎందుకు నిర్విరామంగా జరుగుతుందో ఆలోచిస్తే అందులోని మర్మం అర్ధం చేసుకొంటే అద్భుతంగా ఉంటుంది. సర్వలోకానికి వెళ్ళిన సర్వసృష్టికి సువార్తను ఎందుకు ప్రకటించమన్నాడో (మార్కు 16:15, తిమోతి 3) ఈ లోకంలోని **L.I.C.** ఏజంట్లకన్నా ఎక్కువగా ఇంటింటికి తిరిగి దేవుడు సిద్ధపరచిన పరలోక పాలసీ గూర్చి (మతంకాదు) ఎందుకు తెలియజేయాలో ఆలోచిస్తే క్రైస్తవులతోపాటు సువార్తికులందరూ **L.I.C. of God** లోని సభ్యులే. అందరి జీవాలకు భీమా సౌకర్యం ఉన్నదని మర్చిపోకండి వివరాలకు వెంటనే మీ దగ్గరలో ఉన్న నిజమైన క్రీస్తు రాజ్య సువార్త కేంద్రాన్ని సంప్రదించండి.

మనం రోజూ చూసుకొని మురిసిపోయి దానిలోనే ఉండాలనుకుంటున్న మన శరీరం మనకు మళ్ళీ దక్కుతుందన్న గ్యారంటీ ఇచ్చాడు. చాలామందికి అనగా కొందరికి ఇప్పుడున్న శరీరం మీద కోపం ఉండవచ్చు ఎందుకంటే రంగో, రూపమో, అంగవైకల్యమో కారణం అయి ఉంటుంది. అంగ వైకల్యం (గుడ్డితనం, పోలియో... మొదలుగునవి) రంగు, రూపు అనునవి మట్టి శరీరానికేగాని ఆత్మ సంబంధమైన శరీరానికి ఉండవు. ఇపుడు గుడ్డివారైనా తరువాత ఆత్మతో చూడగలరు. ఈ శరీరం మన తల్లిదండ్రుల అజాగ్రత్త వల్లనే లేక జన్యువులలోపం వల్లనే లోపభూయిష్టమైన శరీరాలు మనకు లభించుచున్నవి. భూమి మీద మన గుడారమైన ఈ వివాహము శిథిలమైపోయినను, చేతిపనికాక దేవునిచేత కట్టబడినదియు నిత్యమైనదియునైన నివాసము పరలోకమందు మనకున్నదని యెరుగుదుము... (2కొరింథి 5:1-4) మన పౌరస్థితి పరలోకమందున్నది; అక్కడి నుండి ప్రభువైన యేసుక్రీస్తు అను రక్షకుని నిమిత్తము కనిపెట్టుకొనియున్నాము. సమస్తమును తనకు లోపరచుకొనజాలిన శక్తినిబట్టి ఆయన మన దీనశరీరమును తన మహిమగల శరీరమునకు సమరూపము గలదానిగా మార్చును. (ఫిలిప్పీ 3:20,21) ఎంతటి దీన శరీరాన్ని అయినా ప్రభువు తన మహిమ శరీరంతో సమానమైన దానిగా మారుస్తాను అంటున్నాడు. ఆయన (క్రీస్తుకు) వచ్చిన అక్షయ శరీరం లాంటిదే మన అందరికి వస్తుంది. దేవుడు పక్షపాతి కాడు. ఈలోకంలో జీవించాలంటే ఒక రకమైన సూటు కావాలి. అలాగే పరలోకంలో జీవించాలంటే అందుకు తగ్గట్లు అక్షయమైన సూటు (ఆకారం) కావాలి. దేవుని ప్రేమ ఎంత గొప్పదో! ముగింపులోకి వెళ్ళేముందు మరో అద్భుతమైన మన జన్మదిన రహస్యాన్ని వివరిస్తున్నాను. జాగ్రత్తగా ఆలోచించి చదవండి.

# “ఓ మనిషీ! నీ జన్మదినం రహస్యమా?”

నేటి ఆధునిక ప్రపంచంలో ఏ దేశంలో చూసినా ప్రజలు వారితోపాటు వారి బంధువుల యొక్కయు, నాయకుల, అభిమానుల, అధికారుల యొక్కయు జన్మదిన (జయంతి), మరణదినం (వర్ధంతి) ని స్మరించటం అలవాటుగా మారి సంస్థలు, చర్చీలు, రాజకీయ పార్టీలు, దేశాలయొక్క జన్మదినాలు జరిపించడం కూడా ఇపుడు సరికొత్త ఫ్యాషనై పోయింది. అలాగే వారు నమ్మిన దేవుళ్ళను గూర్చి ఆలోచించే ముందు మనుష్యులమైన మన గురించి ఆలోచించడమే మంచిది. మనిషి జన్మ అద్వితీయం, అనన్య సామాన్యమైనది, బ్రతుకు అమూల్యమైనది, నరుడి జీవన విధానం అద్భుతం, అగమ్యగోచరమైనది. తనకన్నా ముందు పుట్టిన ప్రకృతి నుండి తీయబడిన శరీరాన్ని ధరించుకొని అదే ప్రకృతిపై పెత్తనం చెలాయించటమనేది నిజంగా అదృష్టం.

నేటి సర్వమానవులు ప్రతి ఒక్కరు ఒక ప్రాంతంలోనో, దేశంలోనో, ఇంట్లోనో, ఆసుపత్రిలోనో మనుష్యుల సమక్షంలోనో పుట్టుచున్నాం అనుకొని తమ పుట్టిన తేదిని గంటలు, నిమిషాలు, సెకనులతో సహా వ్రాయించిన వాటిని నమ్మి జాతక చక్రాలు వ్రాయించుకొని మురిసిపోతున్నారు. నిజంగా లోకం అంతా అనుకొనుచున్న ఈ జన్మదినం కరెక్టేనా? మనుష్యులు వ్రాసిన గ్రంథాలను అడిగితే వారి ఆలోచన ప్రకారం వ్రాస్తారు గనుక ఒకరు వ్రాసింది మరొకరితో సరిపోదు. ఒకేరోజు, ఒకే ఆస్పత్రిలో, ఒకే సమయంలో పుట్టిన ఇద్దరి జాతకాలు / బ్రతుకులు ఒక్కటిగా ఉండవు. పుట్టినరోజు, ఘడియల మీద ఆధారపడిన జన్మ నక్షత్రాలు, రాశిఫలాలు అన్నీ దండగేనని జోతిష్య శాస్త్రాన్ని సవాల్ చేస్తున్న దేవుని శాస్త్రమైన బైబిల్ గ్రంథం చెబుతున్నది కావాలంటే పరీక్షించండి. ఎందుకో తెలియదు అందుకే అందరిని పుట్టించిన దేవుడిని అడిగితేనే న్యాయంగా ఉంటుంది. ఆయనే అందరికి ఆమోద యోగ్యమైనదే చెప్పగలడు. నేను రహస్యమందు పుట్టినవాడు భూమియొక్క అగాధస్థలములలో విచిత్రముగా నిర్మింపబడినవాడు నాకు కలిగినయెముకలును నీకు మరుగైయుండలేదు. (కీర్తన 139:15) క్రీ.పూ. ఇశ్రాయేలీయులను పరిపాలించిన దావీదు మహారాజు దేవుని ప్రేరేపణతో అంటున్నాడు. ఆయన రహస్యమందు పుట్టాననీ, ఇది నమ్మబుద్ధి కావటంలేదు గదా. ఆయన పుట్టిననాడు కనీసం ఒక మంత్రసాని అయినా ఉండి ఉండాలి. అయితే బైబిల్ చెబుతుంది అంటే ఖచ్చితంగా మనుష్యులందరూ రహస్యంగానే పుడుతూ ఉండాలి. ఎలాగో పరిశీలిద్దాం.

మన తల్లి గర్భంలో నుండి బయటకు వచ్చిన దినాన్నే పుట్టినరోజు అంటున్నాం. కాని అంతకు మునుపే దాదాపు 9/10 నెలలు తల్లి గర్భంలో ఉన్నాం అనే సంగతి మర్చిపోతున్నాం. అంతకుమునుపు ఎక్కడున్నాం. అందులోనికి ఎప్పుడు వచ్చాం.

తల్లిగర్భంలోనికి రాకమునుపు తండ్రిలో ఉన్నాం అని ఎంతమందికి తెలుసు? "ఏలాగనగా మెల్కిసెదెకు తన పితరుని కలుసుకొనినపుడు లేవి తన పితరుడైన అబ్రహాము గర్భములో ఉండెను" (హెబ్రీ 7:10). అంటే ప్రతి మనిషి తన తండ్రి ద్వారా తల్లి గర్భములో ప్రవేశిస్తున్నాడని సత్య వేదం చెబుతుంది. అందుకే నేటి డాక్టర్లనడిగితే ఆడబిడ్డ పుట్టాలన్నా, మగబిడ్డ పుట్టాలన్నా నిర్ణయించేది పురుషుడే అని చెబుతున్నారు. అంటే మనం తండ్రిలో నుండి తల్లిలోనికి ప్రవేశించి తల్లిగర్భంలో శరీరాన్ని లేదా ఒక ఆకారాన్ని సంతరించుకొని దాదాపు 9నెలల తర్వాత బయటి ప్రపంచానికొస్తున్నాం అన్నమాట. తండ్రిలో నుండి విడిపోయి అనగా తండ్రి కనగా తల్లిలోనికి వచ్చి అండంతో కలిసి పిండంగా మారిన దినమే మన పుట్టిన దినం. మరి మనం ఆసుపత్రిలో పుట్టిన దినాన్ని వైద్యభాషలో డెలివరిడేట్ అంటారు. ప్రొడక్ట్ మాత్రం తయారి అయ్యాక బయటకొచ్చే తేది అన్నమాట. డెలివరీ తేదిని పుట్టిన తేది అని మనుషులు చెబితే నమ్మి అన్యాయం అయిపోతున్నాం. మనలను కన్న దేవుడు చెప్పేది సరియైనదని గ్రహించాలి. తల్లి గర్భమే మన జన్మస్థలం ఇండియా కాదు, ఇంగ్లండు కాదు, అమెరికా అసలేకాదన్నమాట. అదే బైబిల్ చెప్పిన నగ్నసత్యం.

"నేను గర్భమున పుట్టగానే... అవి నీకు వినబడనే లేదు నీకు తెలియబడనే లేదు పూర్వము నుండి నీ చెవి తెరువబడనేలేదు నీవు అపనమ్మకస్థుడవై నీ తల్లి గర్భమున పుట్టినది మొదలుకొని తిరుగుబాటు చేయువాడవని అనిపించుకొంటివని నాకు తెలియును (యెషయా 48:1-8) ద్వీపములారా! నామాట వినుడి, దూరముననున్న జనములారా, ఆలకించుడి, నేను గర్భమున పుట్టగానే యెహోవా నన్ను పిలిచెను తల్లి నన్ను ఒడిలో పెట్టుకొనినది మొదలుకొని ఆయన నా నామము జ్ఞాపకము చేసికొనెను. (యెషయా 49:1) స్త్రీ తన గర్భమున పుట్టిన బిడ్డను కరుణింపకుండ తన

చంటిపిల్లను మరచునా? వారైనా మరచుదురు గాని నేను నిన్ను మరువను. (యెషయా 49:15) అంటే మనం గర్భాన పుట్టిన దినము రహస్యం. అది అమ్మకు తెలియదు, నాన్నకు తెలియదు. అమ్మకు నెలరోజుల తర్వాత తెలుస్తుంది. అమ్మ చెబితేనే నాన్నకు తెలుస్తుంది. ఎందుకు తెలియదు? టెస్ట్ చేసి స్కానింగ్ ద్వారా డాక్టరు చెబుతాడనుకొని వెళితే ఆ కంప్యూటర్ కూడా ఒక వారం ముందు, వెనుకా అనగా ఎక్స్‌పెక్టెడ్ డెలివరీ డేట్ (EDD) అని చెబుతుందే తప్ప కరెక్టు తేది చెప్పదు. ఎందుకంటే దేవుడే పుట్టిన దిన రహస్యం అన్నాడు కాబట్టి మనిషి ఎన్నటికి తెలుసుకోలేడు. ఇది దేవుడి ఛాలెంజ్. మన పుట్టిన దినమే రహస్యమైతే మరి దేవుడి పుట్టిన దినం గూర్చి ఆలోచిస్తే పిచ్చిపడుతుంది.

దేవుడు బైబిల్‌లో మరో అద్భుతమైన మాట చెప్పాడు. మన అమ్మానాన్నలైతే మనల్ని భూప్రపంచంలోనికి వచ్చాక చూస్తారు గాని ఆయనైతే తల్లి గర్భంలో పిండముగా ఉండి ఆ తర్వాత ప్రతి దినము తన అవయవ నిర్మాణము జరుగుతున్నపుడు చూస్తున్నాడు. నేను పిండమునైయుండగా నీ కన్నులు నన్ను చూచెను నియమింపబడిన దినములలో ఒకటైన కాకమునుపే నా దినములన్నియు నీ గ్రంథములో లిఖితము లాయెను. (కీర్తన 139:16) మానవ నేత్రానికి కనపడని సూక్ష్మపిండముగా ఉన్నప్పటి నుండి చూస్తున్న దేవుడు నీవు పెరిగి పెద్దవాడైన తర్వాత ఎక్కడ తిరుగుతున్నావో, ఏమి చేస్తున్నావో చూడడా? ఎందుకు అంత జాగ్రత్తగా నిన్ను చూస్తున్నాడనుకొంటున్నావు? నీవు ఆయన కుమారుడవు, సాక్షాత్తు ఆయన స్వరూపమై ఆయనలోని భాగానివి గనుక. అలాగే నీకు ఒక జీవిత కాలాన్ని ముందే నియమించి ఇక్కడకు పంపుతున్నాడు. ''నియమింపబడిన దినములలో ఒకటైనను కాకమునుపే నాదినములన్నియు నీ గ్రంథములో లిఖితములాయెను.'' నియమింపబడిన దినములు కాకమునుపే అంటే మనం తల్లిగర్భంలో

పెరుగుతున్న దినాలు అన్నమాట. నియమింపబడిన దినాలు అనగా మన జీవితకాలం. అదేప్రపంచంలోనికి వచ్చిన దినం నుండి ప్రపంచాన్ని వదిలి, వచ్చిన చోటికి తిరిగి వెళ్ళడం అనగా మరణదినం. అదే సమాధి రాయి మీద కనబడే "జననం - మరణం".

ఇక్కడ మరో అద్భుత విషయం తెలుసా? మన మరణ దినమెపుడో కూడా మనకు తెలియదు. అదీ సీక్రెట్. బైబిల్‌లో అన్ని విషయాలు తెలియజేసిన దేవుడు మన జన్మదినం - మరణ దినాల గూర్చి మనకెందుకు తెలియజేయలేదు అని ఆలోచిస్తున్నారు గదా! మన జన్మకు, ఈ జగత్తుకూ కారకుడు మన ఆత్మకు భాగము (కీర్తన 16:5) అయిన పరమాత్ముడైన తండ్రియగు దేవునికి కూడా జనన - మరణాలు లేవు గనుక. మన తండ్రియైన దేవుడు ఆది - అంతం లేనివాడైతే మనకు ఆది - అంతము ఉంటాయని భ్రమించడం వెర్రితనమే అవుతుంది. దేవుడు "ఉన్నవాడు" గనుక ఆ ఉన్నవాడిలో నుండే పుట్టుకొని వచ్చి కొద్దికాలం ఈ మట్టి శరీరంలో ప్రస్తుతం ఈ భూమి మీద జీవించుచూ ఉన్నవారం. ఇందులోనికి రాకముందు దేవుడిలో ఉండేవారం. "ప్రభువా, తరతరములనుండి మాకు నివాసస్థలము నీవే." (కీర్తన 90:1) ఈ శరీరాన్ని వదిలినాక కూడా మన క్రియలనుబట్టి నరకంలో నిత్యం కాలుతూనో లేక పరలోకంలో నిత్యం ఆనందంతోనో ఎక్కడో ఒకచోట తప్పనిసరిగా ఉంటాం. అడ్రస్ మాత్రం గల్లంతు కాదు. అన్ని సంగతులను నిజంగా చెప్పిన బైబిల్ ఈ విషయం కూడా సత్యమే చెప్పింది. నమ్మటం - నమ్మకపోవటం నీ ఇష్టం. అందుకే మానవ మట్టి బుర్రతో కాక ఆత్మజ్ఞానంతో ఆలోచిస్తేనే తెలుస్తుంది దేవుడు మన పుట్టుక - చావులను మనకెందుకు రహస్యంగా ఉంచాడో.

కాబట్టి ఇన్ని సంగతులు తెలిసినవారు జన్మదినం - మరణ దినాలపేరిట, పండుగలు, ఉత్సవకాలాల పేరిట దేవుడిచ్చిన ఎంతో

విలువైన అతి తక్కువ జీవితకాలాన్ని వ్యర్థం చేయకండి, నా[ప్రాణమా! తినుమా! త్రాగుమా! సుఖించుమా! అని అన్యాయం అయిపోకండి. మనకెందుకు ఈ జన్మనిచ్చాడో అనే దేవుని సంకల్పాన్ని తెలుసుకొని ఆయన ఆశ, ఆశయాలకనుగుణంగా ఆయన చిత్తాన్ని అనుక్షణం నెరవేరుస్తూ మట్టిలోకంలో మనిషిగా బ్రతికినంత కాలం నీలోని దైవత్వాన్ని ప్రపంచ ప్రజలకు చూపాలి. మనిషి సృష్టించలేని, ఎన్నడు తెలుసుకోలేని అమూల్యమైన కాలాన్ని సరిగ్గా ఆ దేవునికోసం ఉపయోగిస్తే నీకూ, నీ కుటుంబానికి, నీ దేశానికి ఆఖరున నిన్ను కన్న దేవునికి కూడా ఎంతో మేలు చేసినవాడివి అవుతావు. ఆలోచించు సోదరీ! సోదరా!

**కనుక ప్రియమైన దేవుని పిల్లలారా!**

ఈ లోకంలో నాటి నుండి నేటి వరకు ఒకరి తర్వాత ఒకరు మానవులుగా ప్రవేశించుచున్న ప్రతి మనిషి జన్మకు ఓ కారణం ఉంది. ఏ ఒక్కరు అకారణంగా పుట్టడం లేదు. ఇంత గొప్ప కారణ జన్ముడిగా దివినుండి భువికి దిగివచ్చిన నరుడు పుట్టుకతో పాపి అని నమ్మక పరమాత్ముని స్వరూపమని, పరిశుద్ధులమని నమ్మి దేవుణ్ణి మహిమపరుద్దాం. సూర్య, చంద్ర నక్షత్రాలు, ఈ సృష్టి పుట్టకకొక కారణం ఉంది. జంతువులు, చెట్లు, పక్షులు, సముద్రంలో జలచరాలు, క్రిమి, కీటకాలు, పువ్వులు ప్రతీవాటి పుట్టుకకొక కారణం ఉంది. ఇవన్నీ నీకోసం పుట్టాయి (కలిగాయి) మరీ నీ పుట్టుకకు కారణం నీవు నీ దేవునికి కావాలి అని ఆలోచించండి. ప్రతి వారి జన్మ వెనుకాల ఇంత గొప్ప చరిత్ర కలదు. అందుకే నీసోదరున్ని వ్యర్థుడా (పనికిమాలినవాడా) అంటే నరహత్యతో సమానం అన్నాడు దేవుడు. ప్రతీ వారు దేవుని ఆత్మలోని భాగం అంటే అందరూ ఒకే దేవుని ఆత్మ స్వరూపులము, సోదరులము అందును బట్టి నిన్నువలె నీపొరుగు వానిని ప్రేమించండి అన్నాడు. నీ యెదుటి వాడిలో ఉన్నది కూడా దేవుడే అయితే మీరు పరస్పరం వ్యతిరేకించు

కోకూడదు, దూషించుకోకూడదు. మన జన్మ రహస్యాన్ని తెలుసుకొన్న మనం ఇక నుండి అయినా ఎందుకు పనికి రాని వారం అని అనుకోకుండా ఒకప్పుడు నేను కూడా దేవుడను, ఈ మట్టి శరీరంలో కొద్ది రోజులు మానవుడిగా అవతారమెత్తి ఈ మట్టి శరీరాన్ని (లోకాన్ని) జయించి మన దైవత్వాన్ని నిలుపుకొని లేదా రుజువు చేసుకొని దేవుని కుమారులమైన దేవుళ్ళమై తిరిగి దేవలోకానికి (పరలోకానికి) వెళ్ళవలసిన కారణ జన్ములమని మరువకండి. మన సేవకోసం, మనం అనుభవించడం కోసం సృష్టించుకొన్న ఈ సృష్టానికి బానిసలము కాక దాని మీద అధికారం కొనసాగించాల్సిన వారమైయున్నాము. ఈ భూమి, దానిలోని దంతయు (మొత్తం) మనదే కాని, గజం, ఎకరం స్థలం, ఒక పల్లె, ఒక దేశం కోసమె మరియు దాంట్లోంచి వచ్చిన కానుకల కోసమో మారణహోమం సాగించక సృష్టి అంతటిని కాపాడాల్సిన మరియు దానిని లోబర్చుకోవలసిన గట్టి బాధ్యత గలవారమై సృష్టికర్తకు వారసులం అని మరువకండి. ఈ భూమి మీద దేవుడునడిపించు కోగలిగితే క్రీస్తు ప్రత్యక్షమైనపుడు ఆయనకు వలెనే మనకు మెప్పు, ఘనతయు, మహిమయు కలుగుతాయి (1పేతురు 1:3-7). దీనిని నమ్ముట మన(నీ)వలననైతే నమ్మువానికకి సమస్తము సాధ్యమే. అందుకు 'యేసు నమ్ముట నీవలననైతే, నమ్మువానికి సమస్తమును సాధ్యమేనని అతనితో చెప్పెను.' (మార్కు 9:23). దేవుని కృపా సమాధానములు, ఆత్మ నడిపింపు సదాకాలము మనకు తోడైయుండును గాక... ఆమెన్.

రారాజు క్రీస్తు యేసు రాజ్యంల

రాజు యాజకుడైన

మీ సోదరుడు

**డా॥ బి. జాన్**

# ADMISSION NOTICE

## కరస్పాండెన్స్ మరియు కాంటక్ట్ కోర్సు

## (అడ్మిషన్లు సంవత్సరమంతా జరుగును)

**మేము సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించుచున్నాము.** (1కొరింథ 1:23).

మానవులందరు సర్వేశ్వరుడైన దేవుని యొద్దకు తిరిగి చేరడానికి ఆయన ప్రియ కుమారుడైన క్రీస్తు యేసు చూపిన సర్వోన్నతమైన మార్గముపై నేటి మన అఖండ భారతావని ప్రశ్నలకు - అనుమానాలకు, శాస్త్ర సాంకేతికపరంగా, చరిత్ర - న్యాయ - ఆధ్యాత్మికంగా సకల విధములైన అనుభవ జ్ఞానంతో, ప్రేమ - సాత్వీకంతో సమాధానం చెప్పి అవసరమైనచోట తర్కించి - వాదించి - ఒప్పించి దేశరాజ్యాంగ చట్టాలకనుగుణంగానే ధైర్యముగా మాట్లాడే వారిగా, అనేకుల ఆత్మ రక్షణ కొరకు దేవుడే ఈ జీవుడి ద్వారా వ్రాయించిన జీవగ్రంథమైన బైబిల్‌లో తర్ఫీదునిచ్చి, మనిషిలోని రాక్షసత్వాన్ని రూపుమాపి, తనలోని దైవత్వాన్ని పైకి తీసి దేశంలోని, మూఢనమ్మకాలను సాంఘిక దురాచారాలను, సంఘ వ్యతిరేక కార్యకలాపాలను మాన్పించి ఈ ప్రపంచాన్ని అందులోని ప్రతి మనిషి దేహాన్ని ఒక దేవాలయంగా చేయాలన్నదే మా ఆశ-ఆశయము.

ప్రపంచంలోని ఎన్నో బైబిల్ కళాశాలల్లో బోధించని సృష్టి రహస్యములను, అనేక దేశ చరిత్రలోనూ, రాజ్యాంగ న్యాయ చట్టాలలోను అణువణువునా కనిపించేవి, ఆధునిక శాస్త్రాలను సైతం అధిగమించినవి, మానవ మనుగడకు అత్యవసరమైన వాటిని పరిశోధించి ఉచితముగా బోధించుచున్నాము, ప్రస్తుతము బోధనా భాష తెలుగు.

**మావద్ద కోర్సులు :**

1. **D.B.Th. (Diploma in Bible Theology)**
2. **B.B.Th. (Bachelor of Bible Theology)**
3. **M.B.Th. (Master of Bible Theology)**
4. **Ph.D (Degree of Doctroate in Bible Philosophy)**

కనీస విద్యార్హత : ఎ) 10వ తరగతి (ఎస్.ఎస్.సి.) పాస్ అయి ఉండాలి

బి) ఇంగ్లీషు, సైన్సు, చరిత్రలపై అవగాహనుండాలి.

2. ప్రతి సోమవారం సాయంత్రం 7:30 నుండి 9 గం॥ల వరకు నెలకు నాలుగు పాఠాలు బోధించబడును. ప్రతి నెల ఆఖరి ఆదివారం గాని సెలవురోజున గాని పరీక్ష నిర్వహించబడును. సర్టిఫికేట్ అవసరం లేనివారు కూడా వచ్చి విని వెళ్ళవచ్చు.

3. ప్రతి ఆదివారం ఉదయం 10:30 నుండి 12:30 వరకు.

4. సిలబస్‌లో ఇచ్చిన బోధనాంశముల క్రమసంఖ్యను అవసరాలన్నిబట్టి లేదా సమయానుకూలతను బట్టి మార్పులు చేసి బోధించబడును. ఏ విషయం ఒక వారం ముందుగా తెలియజేయబడును. బైబిల్‌పై మీకున్న అనుమానాలన్నిటికి పూర్తి వివరణ ఇవ్వబడును.

5. అవసరాన్నిబట్టి వారానికి రెండు క్లాసులు జరిపి ఇంకా ఎక్కువ సంగతులు బోధింపబడును. ప్రతిరోజు క్లాసు తర్వాత ఆ రోజు పాఠ్యభాగంపై సమగ్రమైన పరిశోధన (చర్చ), ప్రశ్నలకు సమాధానములు ఉంటాయి.

6. ప్రతి విద్యార్థి స్వంత నోట్ పుస్తకం, పెన్ను, పెన్సిల్, బైబిల్ తెచ్చుకొనవలెను. ఆసక్తి కలిగినవారందరు వయోబేధం - స్త్రీ-పురుష బేధం లేకుండా అప్లికేషన్ కొరకు పై ఆఫీస్ అడ్రస్‌కు వ్రాయండి. దరఖాస్తుతోపాటు 4 పాస్‌పోర్టుసైజు ఫోటోలు తప్పక జతచేయండి.

7. పండుగ మరియు సెలవు దినములలో ఆత్మరోగులకు ఉచితవైద్య శిబిరములుగా ప్రత్యేకమైన సెమినార్లు సంవత్సరానికి 6లేక 5 జరుగును.

సర్టిఫికేట్ కావల్సినవారు తప్పనిసరిగా ఈ సెమిస్టర్లకు హాజరు కావలెను. ప్రతి సం॥ జనవరిలో జరిగే ఎగ్జామ్‌కు హాజరు కావలెను.

**డా॥ బి. జాన్ గారి** గళము నుండి వెలువడిన "ఆధునిక సమాజానికి ఆధ్యాత్మిక ఉపదేశములు॥ అనే ఆడియో CDs., DVD, MP3 ల రూపంలో సిద్ధంగా ఉన్నాయి. అనేకమంది ఈ ప్రసంగములు విని ఆధ్యాత్మిక ఎదుగుదల, బైబిల్‌లోని మర్మాలను అర్థం చేసుకొని, అనేక సందేహాలను నివృత్తి చేసుకొంటున్నారు.

మీరూ వినండి! వినిపించండి!! అజ్ఞానాన్ని పారద్రోలండి!!

సి.డి. ధర : 50/- పోస్టేజి అదనం